ఈనాడు అమరావతి

గురువారం 4 జనవరి 2018 | 20 పేజీలు



పోరంకిలో బుధవారం జరిగిన జన్మభూమి- మా ఊరు గ్రామ సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఐటీ మంత్రి లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఉంచిన పుంగనూరు జాతి దూడలను చూస్తున్న మంత్రి. చిత్రంలో కృష్ణా జడ్పీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ...

వివరాలు 5లో

వివాద కీలాద్రి

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో సాగుతున్న అవినీతితో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నా...ఈవో, పాలకమండలి పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకమైన దుర్గామల్లేశ్వర ఆలయంలో సంబంధం లేని వ్యక్తులు అంతరాలయంలో ప్రవేశించి, అర్ధరాత్రి వేళ పూజలు, అలంకారాలు చేయడం యంత్రాంగం బాధ్యతారాహిత్యాన్ని తేటతెల్లం చేస్తోంది. ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకోవడం, ఒకరి ఆదేశాలను ఇంకొకరు కాలరాయడంతో అవినీతిపరులకు కలిసి వస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ ప్రతిష్ఠకే ఇబ్బంది వచ్చే పరిస్థితి తలెత్తుతుంది.



గౌరంగబాబు, ఛైర్మన్

➠ పరువు పోతున్నా పట్టని పాలకులు

➠ ఇదీ ఈవో, పాలక మండలి తీరు...



సూర్యకుమారి, ఈవో

- ఈ మొత్తం వ్యవహారానికి కారణమైన వారిలో ప్రధానర్చకుడు బద్రీనాథ్‌బాబు, అర్చకుడు ప్రణవ్, దేవస్థానానికి సంబంధంలేని పార్థసారథి, సుజన్‌పై సుమోటోగా కేసును స్వీకరించిన వన్‌టౌన్ పోలీసులు, విచారణ జరిపేసరికి పరస్పర విరుద్ధంగా ప్రకటనలు జారీ చేయడం దారుణం.
- పైగా దేవస్థానానికి సంబంధించిన అధికారులు, వైదిక కమిటీ సభ్యులు ఒకరు శుద్ధి చేశారు, బొద్దింకలను తోలారని నమ్మబలికేందుకు ప్రయత్నించడం గమనార్హం.

కాగా పోలీసు విచారణలో దేవస్థానానికి సంబంధం లేని వ్యక్తులు తమను అమ్మవారి పూజలు, అలంకరణ నిమిత్తం పిలిపించారని తమ స్టేట్‌మెంట్లలో స్పష్టంగా పేర్కొన్న తర్వాతగానీ డొంక కదలడం ఆలోచించాల్సిన అంశం.

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే, ఈనాడు, విజయవాడ

దుర్గగుడిలో తాజా వ్యవహారం దుమారం రేపుతోంది. గుడి మూసివేసిన సమయం మించిన తర్వాత అంతరాలయంలో దేవస్థానానికి సంబంధం లేని ఇద్దరు వ్యక్తులు ప్రవేశించిన విషయం డిసెంబరు 26న విధి నిర్వహణలో ఉన్న సూపరింటెండెంట్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్, క్యూలైన్ ఇన్‌స్పెక్టరు, ఎస్పీఎఫ్ సిబ్బంది, శాంతిభద్రతల విభాగం విధులు పర్యవేక్షించే వన్‌టౌన్ సిబ్బంది, ఓపీడీఎస్ సిబ్బంది ఎవరూ గుర్తించక పోవడం దేవస్థానం భద్రతలోని డొల్లతనాన్ని స్పష్టం చేస్తోంది. పైగా అజ్ఞాత వ్యక్తులు అర్ధరాత్రి 12.30 గంటలకు ఆలయం నుంచి బయటకు వెళుతున్న సమయంలోనూ, భద్రతా సిబ్బంది ఒక్కరు కూడా వారి నుంచి గుర్తింపు కార్డులను అడిగిన దాఖలాలు లేవు.

ఈవోకు ఆమాత్రం తెలియదా?

ఈ విషయం మొత్తం పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా కోడై కూసినా, ఈవో సూర్యకుమారికి నాలుగు రోజుల వరకు ఎవరు లోపలికి వచ్చారో తెలుసుకోలేనంత తీరకలేదన్నట్లు, ఆమె మీడియాకు ఇచ్చిన పరస్పర విరుద్ధ సమాచారాలతో స్పష్టమైంది. అయిదో రోజున ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అర్ధరాత్రి పూజలు జరుగుతున్న విషయాన్ని వరుస కథనాలతో ప్రసారం చేసిన తర్వాత కూడా, దేవస్థానానికి బాధ్యత వహించాల్సిన పాలకమండలి, ఈవో, వైదిక కమిటీ ఒకే వేదిక మీదకు వచ్చి సమాధానం చెప్పడంలో పూర్తిగా విఫలమయ్యారు.

అధికారుల తీరుపై దుమ్మెత్తిపోసిన పాలకమండలి

దేవస్థానంలో అర్ధరాత్రి గుడి తలుపులు తెరచి పూజలు నిర్వహించడానికి కారణమైన అధికారులు, ప్రత్యక్షంగా పాల్గొన్న వారిని కఠినంగా శిక్షించాలని దుర్గగుడి పాలకమండలి సభ్యులు (మిగతా 19లో)




మంగళగిరి హైవేలోని పెట్రోల్ బంక్ ఇది. పక్కనే ప్రైవేటు వ్యక్తి ఆధ్వర్యంలో పంచరు, గాలి పెట్టే దుకాణం నడుస్తోంది.

గాలి ఇంత భారమా...

నిబంధనల ప్రకారం పెట్రోలు బంకుల్లో గాలి ఉచితంగా పెట్టాలి.. కానీ పెట్టడం లేదు.. పోతే పోనీ పది రూపాయలే అని వదిలేస్తాం.. కానీ ఆ మొత్తాన్ని నెలకు లెక్కిస్తే... ఏడాదికి ఎంత అవుతుందో అంచనా వేస్తే ఎంతగా వాహనదారుల జేబులకు చిల్లుపడుతుందో అర్థం చేసుకోవచ్చు.. ఏటా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సుమారు రూ. 107 కోట్లు వాహనదారులు గాలి కోసం ఖర్చు చేస్తున్నట్లు అంచనా..

బంకుల్లో నిబంధనలు గాలికొదిలేస్తున్న వైనంపై కథనం...

9లో



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట జరుగుతున్న ప్రకృతి సేద్య శిక్షణలో ప్రసంగిస్తున్న సుభాష్ పాలేకర్, పాల్గొన్న శిక్షకులు, నిపుణులు, రైతులు తదితరులు

- 3లో

నాసిరకం మందుల వ్యవహారం రాజధాని జిల్లాల్లో కలకలం సృష్టిస్తోంది. ఇప్పటికి బయటపడినవి కాకుండా ఇంకా ఉన్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. చాలా మంది తమ సంపాదనలో 40 శాతం ఆరోగ్యం కోసమే వెచ్చిస్తున్నారు. తాము వాడుతున్నవి అసలువో, నకిలీవో తెలియక సతమతమవుతున్నారు. పర్యవేక్షించాల్సిన ఔషధ నియంత్రణ అధికారులు పట్టించుకోవడం లేదు. తూతూ మంత్రంగా దాడులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. సంబంధిత కంపెనీలు ఫిర్యాదు చేసే వరకు అధికారులకు తెలియడం లేదు. ఎక్కువ ఆదరణ ఉన్న వాటికి నకిలీలు తయారవుతున్నాయి.

మందులోళ్లు.. మాయలోళ్లు

ఈనాడు – అమరావతి

విజయవాడలో బయటపడిన నకిలీ మందుల వ్యవహారానికి సంబంధించి నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు, డ్రగ్స్ కంట్రోల్ అధికారులు పలు దఫాలు దిల్లీ, ఉత్తరాఖండ్ వెళ్లి పరిశోధన కొనసాగించారు. అధికారుల తనిఖీల్లో కేవలం జాన్సన్ కంపెనీ మందులే కాకుండా ఇంకా పలు బ్రాండ్ల ఔషధాలు దొరికాయి. ప్రముఖ కంపెనీలైన సన్ ఫార్మా, టొరెంట్, కేడిలా, అజంతా ఫార్మా, తదితర సంస్థలకు చెందిన బాగా



అమ్ముడయ్యే బిళ్లలు, ఆయింట్‌మెంట్లు కూడా ఉన్నట్లు గుర్తించారు. ఏ కంపెనీకి చెందిన మందులను అయినా నకిలీ తయారు చేయమని ఆర్డర్ ఇస్తే చాలు అచ్చుగుద్దినట్లు అలాగే తయారు చేస్తారు.

అట్టపెట్టెలను కూడా ముద్రిస్తున్నారు : విజయవాడలోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తుండగా బ్యాచ్‌నెంబరు తేడా రావడంతో గుర్తించగలిగారు. ఎన్548 అనే బ్యాచ్‌ను తాము విడుదల చేయలేదని కంపెనీ ప్రతినిధులు చెప్పడంతో బయటపడింది. ఏమాత్రం అనుమానం రాకుండా తయారు చేస్తారు. నకిలీల ఆనవాళ్లు విజయవాడకే పరిమితం కాలేదు, గుంటూరు, నర్సరావుపేటలోనూ కనిపించాయి.

❖ 2017, నవంబర్ 1న గుంటూరులోని దుర్గా మెడికల్ ఏజెన్సీస్‌లో ఉమ్మడిగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రూ. 6 లక్షల విలువైన పాంటాసిడ్ 40, పాంటాసిడ్ డీఎస్ఆర్, స్కిన్‌లైట్ క్రీమ్, మెలాకేర్ క్రీమ్, కిమోరల్ బిళ్లలను స్వాధీనం (మిగతా 19లో)

45,300 రేషన్‌కార్డులు..

అర్హులకు అక్కడికక్కడే మంజూరు

66 వేల పింఛన్లు

నూతన కార్డులకూ చంద్రన్న సంక్రాంతి కానుకలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

ఐదోవిడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని పండగలా నిర్వహించటంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అల్పాదాయక కుటుంబాలపై వరాలు కురిపిస్తోంది. అభివృద్ధి.. సంక్షేమ ఫలాలు అందుకునేందుకు కీలకమైన రేషన్ కార్డులను అర్హత కలిగిన వారికి అందించడంతో పాటు పింఛన్ల రూపంలో ఆ పన్నులకు సామాజిక భరోసాను కలిపిస్తోంది. ఈ నెల 11వ తేదీ వరకు నిర్వహించబోయే గ్రామ.. వార్డు సభల్లో పంపిణీకి రెండు జిల్లాలకు కొత్త రేషన్‌కార్డులు.. పింఛన్లు మంజూరయ్యాయి. చంద్రన్న సంక్రాంతి కానుకలతో కొత్త కార్డుదారుల్లో పండగ ఆనందం కలిగించనున్నారు.



బుధవారం గన్నవరం మండలం తెంపల్లి సభలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీకాంతం

రెండు జిల్లాలకు 45,300 కార్డులు

రాజధాని ప్రాంతం పరిధిలోని గుంటూరు జిల్లాకు 24 వేలు, కృష్ణా జిల్లాకు 21,300 నూతన కార్డులు మంజూరయ్యాయి. బీపీఎల్ పరిధిలోని అన్ని కుటుంబాలకు కార్డులను అందజేస్తున్నారు. గడిచిన జన్మభూమి సభల్లో దరఖాస్తులతో పాటు డిసెంబరులో రెవెన్యూ, పురపాలకశాఖలకు దరఖాస్తు చేసుకుని పౌరసరఫరాలశాఖ వెబ్‌సైట్‌లో వివరాలు నిక్షిప్తం చేసుకున్న వారికి కార్డులు మంజూరు చేస్తున్నారు. ప్రజా సాధికార సర్వే వివరాల ఆధారంగా కార్డుల జారీ జరిగింది. అయితే కార్డుదారులకు నిత్యావసర సరకుల్ని వచ్చే నెల 1వ తేదీ నుంచి అందించనున్నారు.

అందరికీ చంద్రన్న సంక్రాంతి సరకులు..

45,300 కార్డుదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సాధారణ కార్డుదారులతో పాటు వీరికి అదనంగా సంచులు రేషన్ దుకాణాలకు అందుతున్నాయి. వెంటనే వాటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

66 వేల పింఛన్లు..

గుంటూరు జిల్లాలో 17 నియోజకవర్గాలకు 34 వేలు, కృష్ణాలో 16 నియోజకవర్గాలకు 32 వేలు కేటాయించారు. ఈ నెల 6వ తేదీలోగా లబ్ధిదారుల జాబితాలు అప్‌లోడ్ చేయాలని తాజాగా మార్గదర్శకాలు అందాయి. వాటిని తుది పరిశీలన చేసి 9వ తేదీకి వివరాలన్ని నమోదు చేయనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి 66 వేల పింఛను మంజూరు ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. వాటిలో లబ్ధిదారుల పేర్ల వివరాలను ఖాళీగా ఉంచారు. వాటిని పూరించి 9వ తేదీ నుంచి 11 వరకు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. అనర్హులు జాబితాల్లో చేరకుండా నాలుగు అంశాలను ప్రధానంగా ప్రామాణికంగా తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు మార్గదర్శకాలు అందాయి. అవేమంటే..

ప్రజా సాధికార సర్వేలో వివరాలు నమోదై ఉంటేనే అర్హత..

☛ ఆధార్‌లో ఇటీవల మార్పులు చేసుకున్న వారికి పింఛను ఇవ్వరు. వయసుకు పెంచుకుని పింఛనును పొందుతున్నారనే విషయాన్ని గుర్తించి వాటిని తొలగించనున్నారు.

☛ రేషన్ కార్డుపై ఒకటే పింఛను అందజేస్తారు. ఒకే కార్డు నుంచి రెండు పింఛన్లు పొందుతున్నా.. కేవలం పింఛను కోసమే కార్డు పొందినా అటువంటి వాటిని గుర్తించి లబ్ధి నిలుపుదల చేస్తారు.

☛ ఏపీఎల్ కుటుంబానికి చెందిన వ్యక్తికి పింఛను మంజూరైతే దానిపై అభ్యంతరాలు వస్తే విచారించి లబ్ధి ఆపేస్తారు.

అక్కడికక్కడే మంజూరుకు అధికారం

జన్మభూమి సభల్లోనే అక్కడికక్కడే పింఛను మంజూరు చేసే అధికారాన్ని ప్రభుత్వం కల్పించింది. అర్హత ఉన్నా దక్కని వారిని గుర్తించి ఇచ్చే అవకాశాన్ని జిల్లా, నియోజకవర్గ, మండల అధికారులకు కల్పించింది. దీనికోసం ఒక యాప్‌ను రుపొందించారు. జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారి ఒక్కొక్కరికి 100, మండలాధికారులకు 50 నూతన పింఛన్లు మంజూరుచేసే అధికారం కల్పించారు. అనర్హులకు వారు పింఛను అందించినట్లు తేలితే వారి వేతనాల్లో నుంచి ఆ నగదును మినహాయించడంతో పాటు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. నూతన పింఛనుదారులకు మార్చి 1వ తేదీ నుంచి నగదు అందేలా చర్యలు తీసుకున్నట్లు గుంటూరు జిల్లా డీఎస్‌ఓ చిట్టిబాబు, డీఆర్‌డీఏ పీడీ హబీబ్‌బాషా తెలిపారు.

5న మానస సరోవర ధ్యాన ఆశ్రమ వార్షికోత్సవం

తాడేపల్లి, న్యూస్‌టుడే: విజయవాడ సమీప మణిపాల్ ఆసుపత్రి వద్ద కృష్ణా నదీ తీరంలోని ఈనెల 5వ తేదీన మానస సరోవర ధ్యాన ఆశ్రమ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకులు కళ్లం రామిరెడ్డి తెలిపారు. పిరమిడ్ ధ్యాన కేంద్రాల వ్యవస్థాపకులు బ్రహ్మర్షి పత్రీజీ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ధ్యాన తరగతులు, పత్రీజీ వేణునాదం, పిరమిడ్ మాస్టర్ల సందేశాలు, అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు.

'అణగారిన వర్గాల సంక్షేమంపై చిన్నచూపు'

గాంధీనగర్ (విజయవాడ) న్యూస్‌టుడే: అణగారిన వర్గాల సంక్షేమంపై ప్రస్తుత పార్టీలు చిన్నచూపు చూస్తున్నాయని ఈ తరుణంలో కొత్తగా రాజ్యాధికార ఐకాసను ఏర్పాటు చేసి చైతన్యపరుస్తున్నట్లు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ఫ్రాన్సిస్ తెలిపారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభాలో అత్యధిక శాతం ఉన్నా దళిత, గిరిజనులంతా కేవలం ఓటు బ్యాంకుగానే మిగిలిపోతున్నారని రాజ్యాధికారం కోసం ఐక్యంగా పోరాడాలని కోరారు. విజయవాడలో త్వరలో బహిరంగ సభ ఏర్పాటుతో పాటు పార్టీ జెండా, అజెండాను ప్రకటిస్తామన్నారు. దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు మేళం భాగ్యారావు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో దళితులపై జరిగిన దాడులపై ప్రభుత్వం పూర్తిగా అగ్రవర్ణాలకు వత్తాసు పలికిందని ఆరోపించారు. బీసీ ఐక్యవేదిక నగర అధ్యక్షుడు బుద్ధా నాగేశ్వరరావు తదితరులు సావిత్రిబాయి పూలే, ఫాతిమా జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

30న నాయీబ్రాహ్మణుల రాష్ట్ర సదస్సు

నందిగామ, న్యూస్‌టుడే: ఈనెల 30న విజయవాడలో నాయీబ్రాహ్మణుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. యానాదయ్య తెలిపారు. నందిగామలో బుధవారం రాత్రి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు ఇప్పటికీ కుల వృత్తితోనే జీవనం సాగిస్తున్నారని తెలిపారు. సమస్యలపై సదస్సులో చర్చించి, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యానాదయ్య

జాతీయ సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు రాష్ట్ర జట్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: హరియాణా రాష్ట్రం గుర్గాన్‌లో ఈ నెల 5 నుంచి అయిదు రోజుల పాటు జరిగే 63వ జాతీయ సీనియర్ స్త్రీ, పురుషుల బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే రాష్ట్ర జట్లను రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి ఆర్.వెంకటరావు బుధవారం వెల్లడించారు. ఎంపికైన జట్టు సభ్యులను శాప్ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నల్లపరాజు బంగారరాజు అభినందిస్తూ.. జాతీయ ఛాంపియన్‌షిప్‌లో మెరుగైన ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేయాలన్నారు. జట్టు సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి.





జాతీయ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన రాష్ట్ర స్త్రీ, పురుషుల జట్లుతో శాప్ ఎండీ బంగారరాజు, రాష్ట్ర సంఘం కార్యదర్శి ఆర్.వెంకటరావు, తదితరులు

పురుషుల జట్టు.. ఎంవీఎస్ సురేష్‌కుమార్, కె.శివశంకరనాయుడు(కర్నూలు), వైవీఎస్‌కే రెడ్డి, ఆర్.అనిల్‌కుమార్(తూర్పు గోదావరి), ఎం.సురేష్, ఎస్‌కే ఛాంద్ బాషా (నెల్లూరు), పి.కార్తీక్ (చిత్తూరు), పి.శ్యామ్‌కుమార్(విశాఖ), బి.రవికుమార్ (అనంతపురం), ఎస్‌వీఎస్‌ఆర్‌కృష్ణ(కృష్ణా) ఎంపికయ్యారు. ఈ జట్టుకు మేనేజరుగా డి.శ్రీనివాసరావు, కోచ్‌గా ఎం.చిట్టిబాబు నియమితులయ్యారు.

మహిళల జట్టు.. ఆర్.అపర్ణ, పి.ప్రభావతి(విశాఖ), పీవీవీఎస్ ఐశ్వర్య, పీవీఎస్ఎన్ జయలక్ష్మి, ఎ.పార్వతి(విజయనగరం), బి.కల్యాణి(కృష్ణా), డి.శ్రావణి (గుంటూరు), కె.ఫణితా, చౌదరి, జి.శిరీష (కర్నూలు), జీవీవీఎస్ వరలక్ష్మి(తూర్పు గోదావరి) ఎంపికయ్యారు. ఈ జట్టుకు మేనేజరుగా వేణు, కోచ్‌గా బి.ప్రేమ్‌సాయి నియమితులయ్యారు.

క్రీడలకు ఎనలేని ప్రాధాన్యం

శాప్ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బంగారరాజు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : జన్మభూమిలో ప్రజల సమస్యలతో పాటు క్రీడలకు కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాధాన్యం ఇచ్చారని శాప్ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నల్లపరాజు బంగారరాజు పేర్కొన్నారు. గత నెల 26 నుంచి 30వ తేదీ వరకు భువనేశ్వర్‌లో జరిగిన 37వ జాతీయ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పసిడి పతకం సాధించిన రాష్ట్ర బాలుర జట్టు, రజిత పతకం సాధించిన రాష్ట్ర బాలికల జట్టుకు బుధవారం స్థానిక ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ క్రీడలకు శాప్ నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఈనెల 5వ తేదీన విజయనగరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడ ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర బాలబాలికలకు శాలువాకప్పి, జ్ఞాపికను బహూకరించారు. పసిడి పతకం సాధించిన రాష్ట్ర బాలుర జట్టుకు రూ.లక్ష, రజిత పతకం సాధించిన రాష్ట్ర బాలికల జట్టుకు రూ.50వేల నగదు బహుమతిని ప్రకటించారు. కార్యక్రమంలో శాప్ ఓఎస్‌డీ పి.రామకృష్ణ, రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి ఆర్.వెంకటరావు, రాష్ట్ర సబ్ జూనియర్ బాలబాలికల జట్ల శిక్షకులు, మేనేజర్లు పాల్గొన్నారు.



రాష్ట్ర సబ్ జూనియర్ బాలుర బాల్ బ్యాడ్మింటన్ జట్టు సభ్యులకు షీల్డు, రూ.లక్ష చెక్కును అందజేస్తున్న శాప్ ఎండీ నల్లపరాజు బంగారరాజు



రాష్ట్ర సబ్ జూనియర్ బాలికల బాల్ బ్యాడ్మింటన్ జట్టు సభ్యులకు రూ.50వేల చెక్కును అందజేస్తున్న శాప్ ఎండీ నల్లపరాజు బంగారరాజు



పంచగవ్యంను పరిశీలిస్తున్న ఔత్సాహికులు

ప్రకృతి సేద్యంపైనే ఆశలు

అధిక దిగుబడుల సాధనకు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడి నష్టాల బాటలో కొనసాగుతున్న రైతులు పెట్టుబడి లేని ప్రకృతి సేద్యం వైపు అడుగులేస్తున్నారు. ఈ పాటికే కొందరు సదరు సాగు చేపట్టి కొంత వరకు ఫలితాలు సాధించినా మరిన్ని మెలకువలు నేర్చుకోవడానికి ప్రకృతి వ్యవసాయ పితామహుడు పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం వద్ద అందిస్తున్న శిక్షణకు హాజరవుతున్నారు. మరికొందరు కొత్త విధానంలోనైనా సాగును లాభసాటిగా మారుతుందేమో చూద్దామనే ధోరణితో వస్తున్నారు. సందేహాలు నివృత్తి చేసుకుంటూనే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. దిగుబడులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే లాభదాయకంగా ఉంటుందని ఇంకొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రకృతి సేద్యం ఆచరిస్తున్న పలువురు రైతులను ఈనాడు పలకరించగా..తమ అనుభవాలను పంచుకున్నారు. అవి వారి మాటల్లోనే...

– ఈనాడు, గుంటూరు

ప్రత్యామ్నాయంగా రైతుల మొగ్గు

పెట్టుబడిలేని విధానం కావటంతో ఆసక్తి

గ్రామంలో అందరూ ఇదే విధానం..



ఏడేళ్లుగా ప్రకృతి సేద్యం విధానంలో వరి సాగు చేస్తున్నా. దిగుబడులు కొంతమేర తగ్గినప్పటికీ పెట్టుబడి వ్యయం తక్కువగా ఉండటంతో కొనసాగిస్తున్నా. దుక్కులు నుంచి కోత వరకు ఎకరాకు రూ.10 వేల వరకు ఖర్చులు అవుతున్నాయి. సాంబ మసూరి రకం ఎకరానికి 25, స్వర్ణ 30, 1001 రకం 30 బస్తాల వరకు దిగుబడి ఇస్తున్నాయి. ఈ విధానంలో ఇప్పటివరకు నష్టాలు వచ్చిన దాఖలాలు లేకపోవడంతో మా గ్రామం మొత్తం ఇదే విధానాన్ని అనుసరిస్తోంది. ప్రభుత్వం నుంచి పురస్కారం పొందింది. హైదరాబాద్ నుంచి శ్రేష్ఠ సంస్థ వచ్చి యంత్రంతో తేమ, రసాయనాల శాతం పరీక్షించి ధాన్యం కొనుగోలు చేస్తోంది. మార్కెట్లో మిగిలిన వారితో పోల్చితే అధిక ధర ఇస్తోంది. ఇది లాభదాయకంగా ఉండటంతో అందరం ప్రకృతి సేద్యం చేస్తున్నాం.

- జి.సుందరరావు, పూసర్లపాడు, గార మండలం, శ్రీకాకుళం జిల్లా

పొలం నుంచే అన్ని ఉత్పత్తులు



పదకొండేళ్లుగా 17 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నా. బోరు ఉన్న చోట వరి వేస్తున్నా. మెట్ట భూమిలో వేరుసెనగ, కంది తదితర పంటలు పండిస్తున్నా. ఎకరాలో బీపీటీ-5204 రకం వరి 39 బస్తాల దిగుబడి ఇచ్చింది. ఒక్కో బస్తా 90 కిలోల బరువు తూగుతోంది. ఎకరాకు అందరికీ వేరుసెనగ 8- 9 బస్తాలు దిగుబడి వస్తే మాకు మాత్రం 12 బస్తాల దిగుబడి రావడంతో పాటు ఒక్కోటి 45 కిలోల బరువు వచ్చింది. ఇంటికి సంబంధించి అన్ని కూరగాయలు, ధాన్యం పొలంలోనే పండించుకుంటాం. రెండు ఆవులతోనే సాగు చేస్తున్నాం. బెల్లం, కాఫీ పొడి మాత్రమే బయట కొనుగోలు చేస్తాం. మేము పండించిన బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి వ్యాపారులు వచ్చి క్వింటా రూ.7 వేలకు కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే గిట్టుబాటు అవుతుంది. 2010లో ప్రభుత్వం నంది అవార్డు ఇచ్చి ప్రోత్సహించింది.

- పి.నంజుండప్ప, చింతర్లపల్లి, కల్యాణదుర్గం మండలం, అనంతపురము


ఒడుదొడుకులు ఎదురవుతున్నాయి



ప్రకృతి సేద్యంలో పెట్టుబడి తక్కువగానే ఉన్నా సాగులో ఒడుదొడుకులు ఎదురవుతున్నాయి. ఎకరాలో పందిళ్లు వేసి దొండ, కాకర సాగు చేశా. తొలుత కాపు బాగానే వచ్చింది. ఎండుకొమ్మ, పండు తెగుళ్లు, బిళ్ల పురుగు వస్తున్నాయి. వీటి నివారణ చర్యలు తెలుసుకుని సస్యరక్షణ చేపట్టే సరికి పంట దెబ్బతింటోంది. రూ.2 లక్షలు రావాల్సిన చోట రూ.50 వేలు మాత్రమే వచ్చాయి. ప్రకృతి సేద్యపు ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెట్ లేకపోవడంతో సాధారణ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్నాం. తెగుళ్లు వచ్చిన వెంటనే నివారణకు మార్గాలు తెలియజేస్తే ఉపయోగం ఉంటుంది. దీనికి పరిష్కారం లభిస్తుందనే ఉద్దేశంతో శిక్షణకు వచ్చాను. ఆ తర్వాత ఏం చేయాలనేది ఆలోచిస్తా.

- రామ్మోహన్‌రెడ్డి, జిల్లెళ్లపాడు, వెలిగండ్ల మండలం, ప్రకాశం జిల్లా

దిగుబడి తగ్గినా లాభదాయకమే



రెండేళ్లుగా ప్రకృతి సేద్యం విధానంలో పత్తి వేస్తున్నాను. ఈ ఏడాదీ రెండెకరాల్లో సాగు చేశాను. ఇప్పటివరకు ఏడు క్వింటాళ్ల పత్తి తీసి అమ్మాను. మరో రెండు క్వింటాళ్ల వరకు తీయాల్సివుంది. పక్క పొలాల రైతులు రసాయన విధానంలో సేద్యం చేసి ఎకరాకు 8-10 క్వింటాళ్లు పండించారు. వారితో పోల్చితే పెట్టుబడి తక్కువ కావడంతో దిగుబడి తగ్గినా నష్టాలు రాలేదు. ఈసారి భారీ వర్షాలకు నీరు పొలంలో నిలిచిపోవడంతో దిగుబడి తగ్గింది. కషాయాలు పిచికారీ చేస్తే పొలం పచ్చగా పెరుగుతోంది. గతంలో పురుగు మందులు వాడి తీవ్రంగా నష్టపోయాం. ప్రకృతి సేద్యంలో పెట్టుబడి తక్కువగా ఉండటంతో పొరుగు రైతులు కూడా ఆసక్తి చూపుతున్నారు. తొలుత దిగుబడులు తగ్గుతున్నా క్రమంగా పెరుగుతున్నాయి. ఈ విధానంలో మరిన్ని మెలకువలు నేర్చుకోవడానికి ఇక్కడికి వచ్చా. ఈ విధానాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నా.

- పి.నాగరాజు, ఉయ్యాలవాడ, ఓర్వకల్లు మండలం, కర్నూలు జిల్లా

రోజూ 200 కి.మీ. వచ్చి వెళ్తున్నా..



చెన్నైలో ఉంటున్నా. నెల్లూరు జిల్లా దగదర్తి మండలం ఐతంపాడులో 60 ఎకరాలు కొనుగోలు చేసి ప్రకృతి సేద్యం చేస్తున్నా. మూడేళ్లుగా రసాయనాలు వేయకుండా మామిడి, నేరేడు, జామ తోటలు పండిస్తున్నా. ఇప్పటివరకు వివిధ కారణాల వల్ల పెట్టుబడి పెడుతున్నా ఆశించిన లాభాలు రావడం లేదు. కూరగాయల పంటలు వేస్తున్నా. నిత్యం చెన్నై నుంచి 200 కిలోమీటర్ల దూరం ప్రయాణించి పొలానికి వచ్చి తిరిగి సాయంత్రం వెళ్తున్నా. ప్రకృతి సేద్యం ద్వారా పొలం ఉన్న గ్రామం నుంచి మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. ఇప్పుడిప్పుడే కొంత ఫలితాలు వస్తున్నాయి. పంట దిగుబడులు వస్తున్నా మార్కెటింగ్ సౌకర్యం లేక దళారులకు అడిగినంత ఇవ్వాల్సివస్తోంది. ఈ క్రమంలో చెన్నైలో ఆర్గానిక్ ఉత్పత్తులు విక్రయించే వారితో మాట్లాడి ఒప్పందం చేసుకుంటున్నా. ఎకరాలో పది రకాల కూరగాయలు వివిధ రోజుల్లో కోతకు వచ్చేలా సాగు చేయాలని సూచించారు. వారి సూచనల మేరకు పండిస్తే గిట్టుబాటు ధర లభించే అవకాశముంది. ఆ దిశగా ప్రణాళికను రూపొందించుకుంటున్నా. మరిన్ని మెలకువలు నేర్చుకోవడానికే శిక్షణకు హాజరవుతున్నా. మనం ఆరోగ్యంగా ఉండటమే కాదు.. సమాజం మొత్తం ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఈ విధానాన్ని అనుసరిస్తున్నాను.

- అనుమోలు సుగుణ, చెన్నై, ప్రకృతి సేద్యం మహిళా రైతు

పోషక చక్రాలను కాపాడాలి: ప్రకృతిలో అనేక పోషక చక్రాలున్నాయని వాటిని సమర్థంగా పాటించడం ద్వారానే భూసారాన్ని సంరక్షించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం పితామహుడు సుభాష్ పాలేకర్ తెలిపారు. పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ బుధవారం నాలుగోరోజుకు చేరుకుంది. నేలలో లభ్యమయ్యే నాలుగు పోషక చక్రాలైన కర్బన, నత్రజని, నీటి, శక్తి చక్రాల గురించి రైతులకు వివరించారు. పంటల అవశేషాలను తగలబెట్టడం వల్ల పోషకాల సమతుల్యత దెబ్బతిని, తరువాత పంటలకు పోషకాలు అందక ఎరువుల వాడకం తప్పనిసరి అవుతోందన్నారు. పోషకాల సమతుల్యతను కొనసాగించడానికి మొక్కల అవశేషాలను తప్పనిసరిగా ఆచ్ఛాదనగా మాత్రమే వాడాలని రైతులకు చెప్పారు. మొక్కలకు, నేలకు గల సంబంధం గురించి, ఆచ్ఛాదన వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.



వివరాలు నమోదు చేసుకుంటున్న మహిళలు

ప్రతి పదం జాగ్రత్తగా రాసుకుంటూ...: శిక్షణకు వచ్చిన రైతులు, వ్యవసాయశాఖకు చెందిన సిబ్బంది, విద్యార్థులు సుభాష్ పాలేకర్ చెప్పే విషయాలన్నింటినీ శ్రద్ధగా రాసుకుంటున్నారు. పాలేకర్ చెబుతున్నంతసేపు ఆ ప్రాంగణమంతా నిశ్శబ్దంగా ఉంటోంది. విరామ, భోజన సమయాల్లో మాత్రమే మాట్లాడుకుంటూ రైతులంతా క్రమశిక్షణతో ఉంటున్నారు. ఇద్దరు ముగ్గురు రైతులు కలిసిన చోటా ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లుదామనే అభిప్రాయమే వినిపిస్తోంది. కొంతమంది రైతులు తమకున్న పొలంలో సగం ప్రకృతి వ్యవసాయం చేసి చూద్దామని అనుకుంటున్నారు.

దొంగ అరెస్ట్

★ రూ.4లక్షల సొత్తు స్వాధీనం

★ పోలీసు సిబ్బందికి రివార్డులు



స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, నిందితుడితో డీఎస్పీ రామాంజనేయులు, అధికారులు

మంగళగిరి, న్యూస్‌టుడే: గృహాల్లో సొత్తు అపహరించుకుపోయిన నిందితుడు 27 ఏళ్ల షేక్ షాన్వాజ్ అలియాస్ శాన్మాస్‌ని బుధవారం అరెస్టు చేసినట్లు మంగళగిరిలో ఉత్తర మండలం డీఎస్పీ గోగినేని రామాంజనేయులు తెలిపారు. పట్టణ పోలీసుస్టేషన్‌లో సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడు చేసిన నేరాలను వివరించారు. తాడేపల్లి పోలకంపాడులోని అత్తగారు ఇట్టాదేవి ఇంటి వద్ద నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద రూ.1.7లక్షల నగదు, 88 గ్రాముల బంగారు వస్తువులు, 5తులాల వెండి పట్టీలు, 2 సెల్‌ఫోన్లు, ఒక బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనం, స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మొత్తం చోరీ సొత్తు విలువ రూ.4లక్షలు ఉంటుందన్నారు. నిందితుడు శాన్మాస్ చిన్ననాటి నుంచి చెడు వ్యసనాలకు డబ్బు కోసం బంగారు వస్తువులు అపహరించటం మొదలుపెట్టాడు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న అతను 2017 నవంబరు 17న రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యాడు. 2017 డిసెంబరు 18న విజయవాడ కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో రాణిగారితోట ఇంటిలో నగదు, బంగారు వస్తువులు చోరీ చేశాడు. 28న మంగళగిరిలో రెండిళ్లలో ఒకే రోజు బంగారం, నగదు చోరీకి పాల్పడ్డాడు. 30న పల్సర్ ద్విచక్ర వాహనం చోరీ చేశాడు. ఆయా నేరాల కింద మంగళగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడ్ని పట్టుకోటానికి అర్బన్ ఎస్పీ విజయరావు ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేశారు. సీసీఎస్ సీఐలు షేక్ అబ్దుల్‌కరీం, టి.వి.రత్నస్వామి, ఎస్సై సుబ్బారావు, షేక్ అబ్దుల్‌అలీం, ఎ.ఎస్.ఐ. షేక్ షరీఫ్, సిబ్బంది జి.ఎస్.రామారావు, వై.సాంబశివరావు, ఎస్.కె. చాంద్‌బాషా, టి.శ్రీనివాసరావు, బాలాజీ, శ్రీధర్, పట్టణ సి.ఐ.బి.హరికృష్ణ, ఎస్.ఐ. జి.బాలకృష్ణ, ఎ.సాంబశివరావు, కె.దాలినాయుడు నిందితుడ్ని అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసిన కృషికి అర్బన్ ఎస్.పి. రివార్డులు అందచేసి అభినందించారు.

ఈనాడు–ఈటీవీ ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీ

జనవరి 2, 2018 విజేతలు

1. సి.హెచ్ జ్యోతి నిఖిల, జగ్గయ్యపేట; 2. వి. రమ్య, మధిర; 3. కె.పద్మ భారతి, యలమంచిలి; 4. ఎస్. శైలజ, జగ్గయ్యపేట; 5. కె. పూజిత, చిలకలూరిపేట; 6. డి. నాగయశస్వి, వైజాగ్; 7. దుర్గా స్రవంతి, కనుమోలు, కృష్ణా; 8. కె.వి. లావణ్య, బుచ్చిరెడ్డి పాలెం; 9. సి.హెచ్. సంధ్యారాణి, చీరాల; 10. శైలజ, రామదుర్గం, బళ్ళారి. విజేతల వివరాలు ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చు.

అక్షరానికి నీరాజనం

- సందడిగా పుస్తకమహోత్సవ ప్రాంగణం
- అధిక సంఖ్యలో విద్యార్థుల రాక
- ప్రేక్షకులను ఉర్రూతలూగించిన 'యండమూరి'

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా పెరిగినా పుస్తకానికి ఆదరణ తగ్గలేదని స్వరాజ్యమైదానంలో జరుగుతున్న 29వ పుస్తకమహోత్సవం మరోసారి నిరూపించింది. అంతర్జాలాన్ని కాదని అక్షరమే విజేతగా నిలిచింది. వందల సంఖ్యలో విద్యార్థులు బృందాలుగా విచ్చేసి పుస్తకాలను ఆసక్తిగా తిలకించారు. పలు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు బస్సుల్లో తమ విద్యార్థులను పుస్తకమహోత్సవానికి తీసుకువచ్చాయి. బుధవారం నాటి ప్రదర్శనను సుమారు 25వేల మంది తిలకించి ఉంటారని అంచనా. మరోపక్క సాహిత్యవేదికపై ప్రసంగ సదస్సులు, పుస్తకావిష్కరణలు స్ఫూర్తిదాయకంగా సాగాయి. తెలుగు విశ్వవిద్యాలయం, ఇగ్నో వంటి సంస్థల కేంద్రాలను విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో సందర్శించి, కొత్త కోర్సుల వివరాలను తెలుసుకున్నారు. మొత్తంగా అన్ని వర్గాల వారికి విజ్ఞానదాయకంగా, పుస్తక ప్రపంచ నిలయంగా నిలిచిన పుస్తక మహోత్సవ ప్రాంగణం అక్షరాభ్యుదయానికి వేదికగా నిలిచింది. .

'సాహిత్యాకాశంలో సగం మాదే'

మహిళలకు వర్తమాన సమాజంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని అందిపుచ్చుకుంటే అపారమైన విజయాలు సాధించవచ్చు. ఇప్పటికే అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా ఎదిగిన మహిళ ఇక స్వావలంబన దిశగా, స్వయం ప్రేరణతో ఎదగాలంటూ పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. సి.వి.సాహిత్యవేదికపై బుధవారం తొలికార్యక్రమంగా 'సాహితీ సృజనలో స్త్రీలు' అనే అంశంపై ప్రసంగ సదస్సు జరిగింది. గౌరవ అతిథిగా పాల్గొన్న రచయిత్రి పి.సత్యవతి మాట్లాడుతూ మహిళల పట్ల సమాజంలో జరుగుతున్న అమానవీయ సంఘటనల్ని ఖండించారు. ప్రముఖ రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ వర్తమాన సమాజంలో మహిళల స్థానాన్ని, వారి సమస్యల్ని, పరిష్కార మార్గాల్ని ప్రస్తావించారు. అనంతరం జరిగిన ప్రసంగ పరంపరలో 'ఉద్యమ సాహిత్యం - స్త్రీలు' అనే అంశంపై కె.ఎన్.మల్లీశ్వరి, 'అస్తిత్వవాద సాహిత్య సృజనలో స్త్రీలు' అనే అంశంపై షాజహానా, 'కవిత్వ రచనలో స్త్రీలు' అంశంపై విమల, 'నవలా రచన -స్త్రీలు' అంశంపై చంద్రలత ప్రసంగించారు.

రసాభాసగా మారిన సైకాబాబా పుస్తకావిష్కరణ

రచయిత సైకాబాబా రచించిన 'మొఖామి' పుస్తకావిష్కరణ కార్యక్రమం రసాభాసగా మారి, చివరకు రద్దయింది. పత్రికల్లో రాయటానికి వీలులేని అసభ్య పదజాలంతో ఉన్న కవిత్వాన్ని నలుగురిలో ఎలా ఆవిష్కరిస్తారని, ఆంధ్రజాతినే అవమానిస్తూ సాగిన రచన ఆవిష్కరణ నిషేధించాలని కోరుతూ తొలుత తెదేపా నాయకులు, కార్యకర్తలు పుస్తక మహోత్సవ నిర్వాహకులకు తమ నిరసన తెలిపారు. తమ భావప్రకటన స్వేచ్ఛను అడ్డుకుంటున్నారంటూ సైకాబాబా తన అనుచరులతో వేదిక వద్దకు చేరుకోవటంతో వివాదం మరింత రాజుకుంది. ఈక్రమంలో పుస్తక మహోత్సవ నిర్వాహకులు కూడా తెదేపా నేతలకు మద్దతు పలికి, పుస్తకావిష్కరణను నిలిపివేశారు. అందరూ వేదికమీదకు చేరుకుని తెలుగుతల్లి పేరు మీద జయజయధ్వానాలు చేస్తూ, మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాన్ని గానం చేశారు. పరిస్థితి విషమించటంతో పోలీసులు రంగప్రవేశం చేసి, ఇరువర్గాలను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. చివరకు సైకాబాబాను అదుపులోకి తీసుకోవటంతో వివాదం సద్దుమణిగింది.



పుస్తకాలను తిలకిస్తున్న విద్యార్థినులు

అనువాదాలతో భాషాభివృద్ధి సాధ్యం
కేంద్రీయ హిందీ సమితి సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

అనువాదాలతోనే భాషాభివృద్ధి సాధ్యమవుతుందని, ఒక భాష నుంచి మరొక భాషలోకి సాహిత్యాన్ని అనువాదం చేసినప్పుడే సాహిత్యస్థాయి పెరుగుతుందని కేంద్రీయ హిందీ సమితి సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన పలుపుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం పుస్తక మహోత్సవ ప్రాంగణంలోని సి.వి. సాహిత్యవేదికపై బుధవారం జరిగింది. తెలుగు భాషా చరిత్ర పుస్తకాన్ని లక్ష్మీప్రసాద్, శతవసంతాల తెలుగు కథ పుస్తకాన్ని ముప్పాళ్ల నాగేశ్వరరావు, మహాభారత చరిత్రం పుస్తకాన్ని ఆచార్య వెలమల సిమ్మన్న, విశ్వకథా శతకం పుస్తకాన్ని డాక్టర్ గుమ్మా సాంబశివరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ అద్భుతమైన సాహిత్య విలువలు ఉన్న ఎన్నో తెలుగు పుస్తకాలు అనువాదం కాని కారణంగా జాతీయ స్థాయిలో వెలుగులోకి రాలేకపోతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హిందీ అకాడమీ నెలకొల్పి, తెలుగులో వచ్చిన ఉత్తమ సాహిత్యాన్ని హిందీలోకి అనువాదం చేయించే కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని సూచించారు. సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ తెలుగు విద్యార్థి లోకానికి తెలుగు భాషా చరిత్ర పుస్తకం విజ్ఞానసర్వస్వంగా నిలుస్తుందన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ సాహిత్యం సమాజంలో చైతన్యం తీసుకువస్తుందన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఛైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావు, గడ్డం కోటేశ్వరరావు తమ సంస్థ ప్రచురించిన పుస్తకాల విశేషాలను వివరించారు.



తెలుగు భాషా చరిత్ర పుస్తకావిష్కరణ చేస్తున్న లక్ష్మీప్రసాద్ వేదికపై గుమ్మా సాంబశివరావు, సిమ్మన్న తదితరులు

రచయితలకు ఆపన్నహస్తం అందించాలి : యార్లగడ్డ

పుస్తక మహోత్సవంలో రచయితలే స్వయంగా నిర్వహిస్తున్న స్టాల్‌ను ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయితలే స్వయంగా కేంద్రాన్ని నిర్వహించటం అభినందనీయమన్నారు. రచయితల కోసం అండగా నిలుస్తున్న కృష్ణాజిల్లా రచయితల సంఘాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా యార్లగడ్డను జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచందు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు ఆయన్ను సత్కరించారు.

కుటుంబ విలువలకు ప్రాధాన్యమివ్వాలి
మంత్రి కొల్లు రవీంద్ర

ఆధునిక యుగంలో వేగం అంటూ భార్యాభర్తలూ ఉద్యోగాలు చేస్తున్న కారణంగా పిల్లల సంరక్షణ అత్యంత లోపభూయిష్టంగా మారిందని, బిడ్డల ఆలనపాలన మొక్కుబడిగా సాగుతోందని యువజనులు, క్రీడాశాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ విలువలకు ప్రాధాన్యమిస్తూ, పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలన్నారు. సుప్రసిద్ధ మానసిక వైద్యనిపుణులు డాక్టల్ ఇండ్ల విశాల్, రచయిత యండమూరి వీరేంద్రనాథ్ రచించిన 'టీన్స్, పిల్లల పెంపకం ఒక కళ' పుస్తకాన్ని సి.వి.సాహిత్యవేదికపై బుధవారం మంత్రి రవీంద్ర ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దలను గౌరవించటం, నీతినియమాలు పాటించటం వంటి విలువలను పిల్లలకు తప్పనిసరిగా నేర్పించాలన్నారు. తమ కోసం తల్లిదండ్రులు ఉన్నారనే భద్రతాభావాన్ని పిల్లలకు కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఉందన్నారు. మానసిక వైద్య నిపుణులు ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పిల్లల పెంపకం ఒక కళ అని, సరైన అవగాహన కలిగిఉంటే ఉత్తమ వ్యక్తిత్వం కలిగినవారుగా పిల్లలను పెంచటం సాధ్యమవుతుందన్నారు. రచయిత యండమూరి వీరేంద్రనాథ్ మాట్లాడుతూ పిల్లల్ని ఎలా పెంచాలనే విషయం మీద తనదైన శైలిలో ఛలోక్తులు విసురుతూ ప్రసంగించారు. ప్రేక్షకుల్లో ఉన్న తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు యండమూరి విశ్లేషణాత్మకంగా సమాధానాలు చెప్పి, సభను రంజింపజేశారు. డాక్టర్ ఇండ్ల విశాల్ కూడా పాల్గొన్నారు.



'పిల్లల పెంపకం ఒక కళ' పుస్తకావిష్కరణ చేస్తున్న కొల్లు రవీంద్ర. పక్కన రామసుబ్బారెడ్డి, విశాల్, యండమూరి వీరేంద్రనాథ్

దొంగతనం కేసులో ఒకరికి ఎనిమిది నెలల జైలు

విజయవాడ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: దొంగతనం కేసులో నిందితునికి ఎనిమిది నెలల జైలు శిక్ష విధిస్తూ రెండో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ న్యాయస్థానం న్యాయమూర్తి రాజేశ్వరి బుధవారం తీర్పు చెప్పారు. సి.ఎం.ఎస్ పోలీస్ కోటిరెడ్డి తెలిపిన వివరాల మేరకు కృష్ణలంక కోటినగర్‌కు చెందిన బాధితురాలు పి.పార్వతి 2017 మార్చి 25న ఉదయం బయట ముగ్గు వేస్తున్న సమయంలో ఓ వ్యక్తి వచ్చి మెడలోని నానుతాడును దొంగిలించి అక్కడ నుంచి పరారయ్యాడు. దీంతో బాధితురాలు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో ఆ వస్తువును కంకిపాడుకు చెందిన నిందితుడు పెన్నేరు రాఘవయ్య అలియాస్ ముసలయ్య వద్ద పట్టుబడటంతో అతనిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితునకు ఎనిమిది నెలల జైలు శిక్షను విధించారు.

మరో కేసులో.. విజయవాడ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: దొంగతనం కేసులో నిందితునకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ రెండో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ న్యాయస్థానం న్యాయమూర్తి రాజేశ్వరి బుధవారం తీర్పు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి మండలంకు చెందిన బాధితుడు వానపల్లి రమేష్ 2017 జూన్ 29న వ్యాపార నిమిత్తం తెనాలి వెళ్లి తిరిగి ఊరు వెళ్లడానికి విజయవాడ బస్సు ఎక్కి వారధి వద్ద దిగి బెంజిసర్కిల్‌కు వెళ్లడానికి ఆటో ఎక్కారు. ఆటో దిగి ముందుకు వచ్చి జేబులో చూసే సరికి జేబులో ఉండాల్సిన నగదు కనపడకపోవడంతో అతను కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో దొంగ ఇబ్రహింపట్నంకు చెందిన టి.నాగరాజు(37)గా గుర్తించి అతనిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితునకు ఆరు నెలల జైలు శిక్షను విధిస్తూ తీర్పు చెప్పారు.

పరువు కోసం ప్రాణం తీశాడు..!

కన్నబిడ్డను చంపిన తండ్రి

పోస్టుమార్టం నివేదికతో హత్య కేసుగా మార్చిన పోలీసులు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: పాయకాపురంలో నాలుగురోజుల కిందట జరిగిన ఓ బాలిక మరణంపై విచారణ చేపట్టిన పోలీసులకు బహిర్గతమైన విషయాలు దిగ్భ్రాంతికి గురి చేశాయి. కన్నతండ్రే కర్కశంగా మారి మద్యం మత్తులో కన్నబిడ్డను హతమార్చి తనకేం తెలియనట్లుగా కుటుంబసభ్యులను ఒప్పించాడు. దీంతో అంతా ఆ బాలిక అంత్యక్రియలకు సిద్ధం చేశారు. రోజూ పాఠశాలకు వెళ్లే బాలిక మృతి చెందడం ఏమిటని చుట్టుపక్కల వారి అనుమానాలు కాస్తా పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. కుటుంబసభ్యులను ఒప్పించి తప్పించుకునేందుకు ప్రయత్నించిన అతడ్ని విధి మాత్రం వదిలి పెట్టలేదు. ఎదిగిన కుమార్తెను పరువు కోసం కాటికి పంపించాడని పోస్ట్‌మార్టం నివేదిక, పోలీసుల దర్యాప్తులో తేలింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన కేసును పోలీసులు హత్యానేరంగా మార్చారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాయకాపురం ఉడాకాలనీ ప్రాంతానికి చెందిన అల్లు రమణ, లక్ష్మిలకు ముగ్గురు సంతానం. పెద్దకుమార్తె అల్లు కృష్ణవేణి(14) స్థానికంగా ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతుంది. ఈ నెల 30వ తేదీన బాలిక మృతి చెందింది. కడుపు నొప్పితో చనిపోయిందని కుటుంబ సభ్యులకు చెప్పి గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు చేసేందుకు తండ్రి రమణ ప్రయత్నించాడు. అతని ప్రవర్తనలో మార్పు రావడం.. ఆరోగ్యంగా ఉండే బాలిక అకస్మాత్తుగా మరణించడం చుట్టుపక్కల వారిని కదిలించింది. వెంటనే నున్న పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగప్రవేశం చేసిన పోలీసులు బాలిక మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం అదే రోజు రాత్రి ఆసుపత్రికి తరలించారు. ముందుగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా పోలీసులకు వాస్తవాలు తెలిశాయి. అల్లు కృష్ణవేణి తన తండ్రి అల్లు రమణ ఫోన్‌లో నుంచి గుర్తు తెలియని వ్యక్తితో మాట్లాడిందని.. ఈ విషయంపై ఈ నెల 29వ తేదీ రాత్రి బాయ్‌ఫ్రెండా? స్నేహితుడా? ఎవరితో మాట్లాడావంటూ బాలికను తీవ్రంగా ఆమెను కొట్టాడు. మరుసటి రోజు మధ్యాహ్నం మద్యం తాగి వచ్చి కుమార్తెను ప్రశ్నిస్తూ తీవ్రంగా కొట్టాడు. అడ్డొచ్చిన భార్యను కూడా కొట్టడంతో ఆమె స్పృహ కోల్పోయింది. పరువు తీస్తావా? అంటూ బాలిక మెడకు చీరవేసి లాగడంతో బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. ఏమీ తెలియనట్లుగా ఆమెను బీరువా పక్కన పడుకోబెట్టి నిద్రపోయాడు. తర్వాత బాలిక తల్లి లేచి చూసేసరికి చనిపోయినట్లు గ్రహించారు. ఎలా మృతి చెందిందని అతడ్ని ప్రశ్నించడంతో తనకేం తెలియదని చెప్పాడు. ఈ విషయం బయటకి రాకుండా కుటుంబసభ్యులకు మాయమాటలు చెప్పి అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రయత్నించాడు. దీనిపై బుధవారం పోస్ట్‌మార్టం నివేదిక రావడంతో బాలికది బలవన్మరణంగా తేలినట్లు పోలీసులు చెప్పారు. అనుమానాస్పద మృతి కేసును హత్యానేరం కేసు నమోదు చేశారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. పరువు కోసం కన్నబిడ్డను తండ్రి చంపినట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన బాలిక (పాతచిత్రం)



జన్మభూమి ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్, చిత్రంలో లోకేష్, ఎమ్మెల్యే ప్రసాద్

2019 నాటికి ఇంటింటికీ కుళాయి

మంత్రి లోకేష్

పెనమలూరు, న్యూస్‌టుడే : 2019 నాటికి ఇంటింటికీ కుళాయిని ఏర్పాటు చేస్తామని, నగరాలకు దీటుగా అన్ని గ్రామాలకు భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు పంచాయతీరాజ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. బుధవారం పోరంకిలో జరిగిన జన్మభూమి- మా ఊరు గ్రామ సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ లోకేష్‌ను సభా ప్రాంగణానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన 100 రోజుల్లోనే 24 గంటల విద్యుత్తును ప్రజలకు అందించారని గుర్తు చేశారు. దీనికి ఆమోదం పలుకుతూ కార్యక్రమానికి హాజరైన ప్రజలు చేతులు పైకెత్తారు. ఎన్టీఆర్ వైద్యసేవల్లో 1444 వైద్యసేవలను పేదలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి పడుతున్న కష్టాన్ని అందరూ గుర్తించాలని లోకేష్ కోరారు.

నా కంటే నాన్నే స్పీడు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కంటే వేగంగా పని చేస్తున్నట్లు మంత్రి నారా లోకేష్ పేర్కోవడంతో సభలో హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. ఏడుపదుల వయసుకు దగ్గరైన నాన్న పని వేగాన్ని అందుకోవడం తనతో పాటు మంత్రులకు కష్టంగా ఉందన్నారు. రోజూ తాను ఇంటికి చేరుకున్న రెండు గంటల తరువాతే ముఖ్యమంత్రి తన పరిపాలనా విధులు ముగించుకొని వస్తున్నారని వెల్లడించారు. ఎంపీ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఎమెల్సీలు యలమంచిలి రాజేంద్రప్రసాద్, బచ్చుల అర్జునుడు తదితరులు ప్రసగించారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ గద్దే అనూరాధ, కలెక్టర్ లక్ష్మీకాంతం, ఎంపీపీ బొర్రా కనకదుర్గ, పంచాయతీరాజ్ కమిషనర్ రామాంజనేయులు, సర్పంచి వేమూరి స్వరూపరాణి, ప్రత్యేకాధికారి కృష్ణకుమారి, తహసీల్దారు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కేకు కోసి కలెక్టర్‌కు తినిపిస్తున్న మంత్రి లోకేష్. చిత్రంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎంపీ కొనకళ్ల, ఎమ్మెల్సీ వైవీబీ



స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులు



స్వామివార్లకు పసుపుతో అభిషేకం

మలయప్ప స్వామికి సహస్ర కలశాభిషేకం

కొనసాగుతున్న శ్రీవారి నిత్యోత్సవాలు

పటమట (విజయవాడ), న్యూస్‌టుడే : పటమట రైతుబజార్ వద్ద శ్రీలక్ష్మీ శ్రీనివాస వాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి నిత్యోత్సవాలను తిలకించేందుకు భక్తులు బుధవారం అధిక సంఖ్యలో విచ్చేశారు. స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, విశ్వరూప దర్శనం, తోమాల సేవ, కొలువు, సహస్ర నామార్చన, మొదటి గంటనివేదన, అనంతరం 9 గంటలకు కలశాభిషేకం కనుల పండుగగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామికి బుధవారం సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. వస్త్రం, యజ్ఞోపవేతంతో అలంకరించి స్వామివారిని పసుపు, గంధం, కుంకుమతో అభిషేకించారు. అనంతరం క్షీరాభిషేకం చేశారు. శ్రీవారికి అర్చన అనంతరం మహా నైవేద్యాలను నివేదించారు. లడ్డూ, వడ, పెరుగన్నం, పులిహోర, పులుసన్నం, చక్కెరపొంగలి వంటి వివిధ రకాల పదార్థాలను స్వామివారికి నైవేద్యంగా పెట్టారు. స్వామివారి కల్యాణంలో 500 మంది దంపతులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అర్చకుల వేదమంత్రాలు, కళాకారుల కోలాటం, గాయకుల సంకీర్తన మధురగానం, మంగళవాయిద్యాల నడుమ ఊంజలసేవ నిర్వహించారు. స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతుడై ఊయలలో ఊగారు. భక్తిశ్రద్ధలతో వేయిదీపాలు వెలిగించి శ్రీవారికి కైంకర్యాలు అర్పించారు. సాయంత్రం శ్రీవారు సర్వఅలంకారభూషితుడై హనుమంతుని వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ తిరుమాడ వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. తొలుత నక్షత్రహారతిలో పంచహారతులు ఇచ్చి క్రతువు నిర్వహించారు. శ్రీత్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార్ రామానుజ జీయర్ స్వామి, ఆధ్యాత్మికవేత్త బాచుపల్లి సంతోష్‌కుమార్ శర్మలు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. నగరానికి చెందిన కళాకారులు స్వామివారికి నృత్యార్చన చేశారు. కార్యక్రమంలో గరిమెళ్ల నాని, దూపుగుంట్ల శ్రీనివాస్, గొల్ల శ్రీధర్, ఉదయగిరి, మానేపల్లి లక్ష్మీకుమారి, మామిడి కృష్ణారావు దంపతులు పాల్గొన్నారు.



సిద్ధం చేసిన కలశాలు

స్నేహపూరిత పోలీసింగ్‌కు ప్రాధాన్యం

మైలవరం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రజలతో స్నేహపూరిత పోలీసింగ్‌కు తాము అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పేర్కొన్నారు. అందుకోసం విధి నిర్వహణే కాకుండా సమయానుకూలంగా మానవత్వాన్ని చాటడం ప్రధానమని చెప్పారు. బుధవారం మైలవరం వచ్చిన ఆయన ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగిన విద్యుత్తు ఉపకేంద్రం వద్ద ఘటనా స్థలాన్ని నూజివీడు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రామచంద్రరావు, ఎస్సై రామకృష్ణలతో కలిసి సందర్శించారు. అనంతరం మైలవరం స్టేషన్లో విలేకరులతో మాట్లాడారు. వివిధ మతాల పూజ, ప్రార్థనాలయాల వంటి చోట ప్రజలతో ప్రతిజ్ఞ చేయించే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి రోడ్డు ప్రమాదం వెనుక ఒక రకమైన తప్పిదాలు కన్పిస్తున్నాయని, వాటిని అధిగమించటానికి అంతా కృషి చేయాలన్నారు. కోడి పందేల నిర్వహణకు అనుమతులు లేవని, కోర్టు అదేశాలుంటే సంప్రదాయం పేరిట ఆడటం కుదరదని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 300 మంది వరకు కోడిపందేల నిర్వాహకులను ముందస్తు బైండోవర్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో నేరాల సంఖ్య తగ్గిందని పేర్కొన్నారు.



మైలవరం స్టేషన్లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర 86 రిటైల్ ధర - 108, చికెన్ విత్ స్కిన్ - 157, చికెన్ స్కిన్‌లెస్ - 178 **అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం ధర - 89, 96, 106 చికెన్ విత్ స్కిన్- 172, చికెన్ స్కిన్‌లెస్- 182

నెక్ కోడిగ్రుడ్ల ధర

★ విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.85 పైు. నెక్ విజయవాడ ఆఫీస్ Ph: 0866 - 6582559.

పీఏసీఎల్ ఖాతాదారులకు సెబీ ఊరట

గవర్నర్‌పేట (విజయవాడ), న్యూస్‌టుడే: సుదీర్ఘ నిరీక్షణ తరువాత పీఏసీఎల్ (పెరల్ ఆగ్రోటెక్ కార్పొరేషన్ లిమిటెడ్) ఖాతాదారులకు సొమ్ము చెల్లింపు విషయంలో సెబీ కొంత ఊరట ఇచ్చిందని పీఏసీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. మురళీబాబు, జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కంపెనీ నుంచి రూ. 2500లు లోపు రావాల్సిన ఖాతాదారులకు చెల్లింపు విషయంలో ఊరట ఇస్తూ సెబీ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వులు ప్రకారం రూ. 2500లు లోపు ఉన్న ఖాతాదారులు తమ వివరాలను సెబీ తెలియజేసిన వెబ్‌సైట్ www.sebicommitteepaclrefund.com లో ఫిబ్రవరి 28లోగా నమోదు చేసుకోవాలని కోరారు. ఖాతాదారులకు సందేహాలుంటే సమీపంలోని పీఏసీఎల్ ఇన్వెస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను సంప్రదించాలని మురళీబాబు, చల్లా శ్రీనివాసరావులు కోరారు.

వాలీబాల్ పోటీల్లో పీబీ సిద్ధార్థ విజయం

విజయవాడ క్రీడలు: మొగల్రాజపురంలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం సిద్ధార్థ అకాడమీ అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీల్లో ఆతిథ్య పీబీ సిద్ధార్థ జట్టు విజేతగా నిలిచింది. నాకౌట్ పద్ధతిలో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం ఎనిమిది కళాశాలల జట్లు తలపడ్డాయి. ప్రథమ స్థానాన్ని పీబీ సిద్ధార్థ జట్టు కైవసం చేసుకోగా.. ద్వితీయ స్థానాన్ని ఉయ్యూరులోని ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల జట్టు సొంతం చేసుకుంది. ఉదయం సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా హాజరై నూతన వాలీబాల్ కోర్టును ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రమేష్ అధ్యక్షత వహించగా.. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ఆచార్య రాజేష్ సి. జంపాల హాజరయ్యారు. పోటీలకు కళాశాల వ్యాయామ విద్యా విభాగాధిపతి డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి లక్ష్మణరావు

గన్నవరంలో సినిమాలు

శ్రీవెంకటేశ్వర - **ఎంసీఏ**
శాంతి - **హలో**
జంక్షన్‌లో
కృష్ణా : **2 కంట్రీస్**
కె.యస్.టాకీస్ : **ఒక్క క్షణం**

గ్యాస్ సమాచారం

గన్నవరం హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 3న నమోదు చేసుకున్న వారికి 4న సరఫరా చేస్తారు. ఆన్‌లైన్ విధానంలో నమోదు చేసుకునే వారు 96660 23456కు ఫోన్ చేయాలి.

గన్నవరం

నేడు జాతీయ సేవా పథకం శిబిరం

ఎనికేపాడు(విజయవాడ గ్రామీణం), న్యూస్‌టుడే : ఎన్ఎస్ఎస్ యూనిట్-2 దత్తత గ్రామం ఎనికేపాడులో గురువారం నుంచి ఈ నెల 10 తేదీ వరకు ప్రత్యేక సేవా శిబిరం నిర్వహిస్తున్నామని ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఎం.హరిప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్, ఓడీఎఫ్, ఆరోగ్య సంబంధిత, ట్రాఫిక్ భద్రతా నియమాలు, విద్య ఉపాధి అవకాశాలు, యోగా తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ వెలగా జోషి అధ్యక్షత వహిస్తారు. ఆర్డీవో డాక్టర్ హరీష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు. ఏడు రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సౌకర్యం.. సుఖమయం..!

✿ నియోజకవర్గంలో ప్రధాన రహదారుల అభివృద్ధి ✿ గోతుల ఇబ్బందులు తప్పినట్లే



పెద్దఆవుటపల్లి-చొప్పరమెట్ల ప్రధాన మార్గం

కేసరపల్లి, తెంపల్లి, బుద్ధవరం, అజ్జంపూడి (గన్నవరం), న్యూస్‌టుడే : నవ్యాంధ్ర రాజధాని అమరావతి ఏర్పాటయ్యాక రహదారుల అభివృద్ధి పరుగులు పెడుతోంది. గన్నవరం నియోజవకవర్గం విజయవాడ నగరానికి అనుసంధానంగా ఉంది. ఇక్కడ విమానాశ్రయం ఉండటంతో మౌలిక వసతుల కల్పనకు స్థానిక ప్రజాప్రతినిధులు కృషిచేస్తున్నారు. ప్రధాన మార్గాలను అభివృద్ధి చేస్తున్నారు. వివిధ రకాల నిధులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యమైన దారులను రెండు లైన్లుగా విస్తరిస్తూ.. పునర్నిర్మిస్తున్నారు. ఇటు చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిలో విజయవాడ, ఏలూరు వైపు నుంచి వచ్చే వాహనాలు, ఇటు విజయవాడ-మచిలీపట్నం, విజయవాడ-గుడివాడ మార్గాలతోపాటు విజయవాడ-నూజివీడు రహదారిలో రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారులను అభివృద్ధి చేశారు. సులువుగా.. సౌకర్యవంతంగా ప్రయాణం సాగేలా దారులు ఉన్నాయి.

పెద్దఆవుటపల్లి-చొప్పరమెట్ల రెండులైన్ల మార్గం..

ఉంగుటూరు మండలం పెద్దఆవుటపల్లి కూడలి నుంచి పెద్దఆవుటపల్లి-చొప్పరమెట్ల దారిని రెండులైన్లుగా అభివృద్ధి చేశారు. ఇది గన్నవరం మండలంలోని తెంపల్లి, శివారు బల్లిపర్రు, వీరపనేనిగూడెం, మెట్లపల్లి గ్రామాలను కలుపుతూ ఆగిరిపల్లి మండలం చొప్పరమెట్ల వరకు విస్తరించి ఉంది. జాతీయ రహదారిలో రెండు వైపులా నుంచి వచ్చే అన్ని రకాల వాహనాలు విజయవాడ-నూజివీడు మార్గంలోకి సాఫీగా రాకపోకలు సాగించవచ్చు. చొప్పరమెట్ల నుంచి ఆగిరిపల్లి కూడలి ద్వారా అనుసంధానం అవుతాయి. ఈ రోడ్డు ఏకమార్గంగా ఉన్నప్పుడు అటు గన్నవరం లేదా ఇటు హనుమన్‌జంక్షన్ నుంచి నూజివీడు వైపు వెళ్లాల్సి వచ్చేది. పెద్దఆవుటపల్లి-చొప్పరమెట్ల రహదారి అందుబాటులోకి రావడంతో వ్యయ ప్రయాసలు తగ్గాయి. 6 నుంచి 10 కిలోమీటర్ల దూరం కలిసివచ్చినట్లయింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ మార్గం అందుబాటులోకి వచ్చింది.

కేసరపల్లి నుంచి మానికొండకు..

గన్నవరం విమానాశ్రయం అభివృద్ధి, రన్‌వే విస్తరణ జరుగుతున్న నేపథ్యంలో బుద్ధవరం గ్రామంలోని నివాసాలు, బుద్ధవరం ఆర్‌అండ్‌బీ మార్గం, పొలాలను కోల్పోవటంతో అందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేశారు. బుద్ధవరం రోడ్డును కోల్పోవటం వల్ల గన్నవరం నుంచి కేసరపల్లి వరకు ప్రధాన జాతీయ రహదారి ఉండగా అక్కడి నుంచి శివారు అప్పారావుపేట, అజ్జంపూడి, బుద్ధవరం గ్రామాలను కలుపుతూ ఈ మార్గం నిర్మిస్తున్నారు. దీంతో బుద్ధవరంతోపాటు అజ్జంపూడి, కేసరపల్లి గ్రామాల ప్రజలు బూతిమిల్లిపాడు గ్రామాల మీదుగా తరిగొప్పల, మానికొండ గ్రామాల మీదుగా విజయవాడ- గుడివాడ రహదారికి చేరుకోవచ్చు. ఇంకా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.



కేసరపల్లి-ముస్తాబాద మార్గం..

గన్నవరం మండలం కేసరపల్లి పార్కు కూడలి నుంచి సావారిగూడెం గ్రామం మీదుగా ముస్తాబాద వరకు రెండు లైన్ల రహదారి నిర్మించారు. కృష్ణా పుష్కరాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో వేగవంతంగా అభివృద్ధి చేశారు. వాహనాల రద్దీని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ మార్గంగా దీనిని ఏర్పాటు చేశారు. మచిలీపట్నం-విజయవాడ మార్గంలోని వాహనాలు విజయవాడకు వెళ్లకుండా కంకిపాడు మండలం పునాదిపాడు అడ్డరోడ్డు నుంచి ముస్తాబాద మీదుగా సూరంపల్లి, పాయకాపురం అడ్డరోడ్డు నుంచి విజయవాడ-నూజివీడు ప్రధాన మార్గంలోకి వెళ్లేలా చేశారు. దీని వల్ల 25 కిలోమీటర్ల దూరం ఉన్న విజయవాడను తాకకుండా నూజివీడు వైపు, హైదరాబాద్ వైపు వెళ్లే అవకాశం ఏర్పడింది.



బుద్ధవరంలో నిర్మిస్తున్న సిమెంటు రహదారి

గన్నవరం-సూరంపల్లి ప్రధాన మార్గం

స్థానిక కొత్తపేట కూడలి నుంచి పురుషోత్తపట్నం, ముస్తాబాద గ్రామాల మీదుగా సూరంపల్లి వరకు రెండు లైన్ల ప్రధాన మార్గం నిర్మిస్తున్నారు. ఇది చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి, విజయవాడ-నూజివీడు ప్రధాన మార్గాలను అనుసంధానం చేస్తుంది. గన్నవరం మండల ప్రజలకు అత్యంత ప్రయోజనకరంగా మారింది. ఇన్నాళ్లు రహదారిలో ఏర్పడిన గోతులతో ఇబ్బందులు పడ్డారు. నూతన రహదారి అందుబాటులోకి వస్తుండటంతో సురక్షితంగా ప్రయాణాలు చేయటానికి అవకాశం ఏర్పడిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



జాహ్నవి, కృష్ణహాస

గన్నవరం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి వ్యాసరచన పోటీల్లో గన్నవరం వి.ఎస్. సెయింట్ జాన్స్ పాఠశాల విద్యార్థినులు ప్రతిభచాటారని ప్రిన్సిపాల్ బాలశౌరి తెలిపారు. స్థానిక పాఠశాలలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత ప్రభుత్వ పెట్రోలియం, సహజ వాయు మంత్రిత్వశాఖ అనుబంధ సంస్థ పెట్రోలియం కన్జర్వేషన్ రీసెర్చ్ అసోసియేషన్, సీబీఎస్ఈలు దేశవ్యాప్తంగా వ్యాసరచన పోటీలు నిర్వహించింది. ఇందులో తమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు అల్లు జాహ్నవి, నర్రా కృష్ణహాస ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు వివరించారు. ఈ నెల 16న న్యూదిల్లీలో నిర్వహించే వేడుకల్లో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నుంచి బహుమతులు అందుకుంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ జేసురాజు, సీనియర్ ఉపాధ్యాయులు జిమ్మీకురియాకోస్ తదితరులు అభినందించారు.

హనుమాన్‌జంక్షన్ బైపాస్ సాధనసమితి ఏర్పాటు



బైపాస్ సాధనకు కృషి చేస్తామంటున్న సాధనసమితి సభ్యులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: జంక్షన్ ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారంగా బైపాస్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలనే లక్ష్యంతో హనుమాన్‌జంక్షన్ బైపాస్ సాధన సమితి పని చేస్తుందని గౌరవాధ్యక్షులు తవ్వా హేమేశ్వర నరసింహమూర్తి తెలిపారు. బుధవారం సమితి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా రేవిణిశెట్టి జితేంద్ర, సహ కన్వీనర్లుగా వెలగపల్లి ప్రదీప్, గండేపూడి నితీష్ కుమార్, నక్కా నాగరాజు, షేక్ బాషా మరో 15మంది సభ్యులుగా ఉన్న కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కోడి పందేలు వేస్తే జైలుకే

గన్నవరం, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని జూదం, కోడి పందేలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు విజయవాడ తూర్పు విభాగం సహాయ పోలీస్ కమిషనర్ వి.విజయభాస్కర్ తెలిపారు. బుధవారం గన్నవరం సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో జూదం అరికట్టాలని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించే వారికి బైండోవర్ కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు మండల, డివిజన్ స్థాయిలో కమిటీలు వేయనున్నట్లు చెప్పారు. ఈ కమిటీలు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. నిరంతరం దాడులు చేయటానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఒక వేళ పందేల్లో పాల్గొని పోలీసులకు దొరికితే ఏపీ గేమింగ్ చట్టం, జంతు హింస నివారణ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిందితులకు ఆరు నెలలకు పైబడి జైలు శిక్ష పడుతుందని ఏసీపీ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ విజయభాస్కర్

ఉంగుటూరు, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా కోండి పందేలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైకోర్టు ఉత్తర్వులతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలో కోడిపందేలు వేసేవారు, కోళ్లకు కత్తులు కట్టేవారిపై బైండోవర్ కేసులు నమోదు చేయనున్నట్లు వివరించారు. జూద శిబిరాలపై దాడులు చేస్తామని పేర్కొన్నారు.

ఐక్యంగా హక్కులను సంరక్షించుకోవాలి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : నాయీ బ్రాహ్మణులు తమ హక్కులను సంరక్షించుకొనేందుకు సంఘటితం కావాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సిద్ధవటం యానాదయ్య విజ్ఞప్తి చేశారు. సంఘీయుల ఐక్యతే లక్ష్యంగా ఈ నెల 30న విజయవాడలో ఏర్పాటు చేస్తున్న మహాసభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. మహాసభ ప్రచారం కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన చైతన్య యాత్ర బుధవారం హనుమాన్‌జంక్షన్ చేరుకుంది.

అమ్మవారి ఉత్సవాలకు ఏర్పాట్లు

రామవరప్పాడు(విజయవాడ గ్రామీణం), న్యూస్‌టుడే : ఏటా సంక్రాంతి పండుగ నాడు రామవరప్పాడులోని శ్రీవెంకమ్మ పేరంటాలు అమ్మవార్ల ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారుల ఉత్సవ విగ్రహాలను బుధవారం అందంగా అలంకరించినట్లు ఆలయ ఈవో నూతక్కి సాంబశివరావు తెలిపారు. రాజులబజారులోని అమ్మవారి పుట్టిల్లు నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఉప సర్పంచులు కొమ్మా కోట్లు, కొల్లా ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అభయాంజనేయునికి పూజలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ విప్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం స్థానిక అభయాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ ధర్మకర్తల సంఘం అధ్యక్షులు పావులూరి రామారావు ఆధ్వర్యంలో అభిమానులు, కార్యకర్తలు ఆయన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.



అభయాంజనేయ స్వామికి పూజ చేస్తున్న చింతమనేని

గన్నవరం

నేడు జన్మభూమి సభలు

ఉంగుటూరు, న్యూస్‌టుడే : మండలంలోని మూడు గ్రామాల్లో గురువారం జన్మభూమి మాఊరు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివప్రసాద్ తెలిపారు. ఉదయం మానికొండ గ్రామంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో, నందమూరు, లంకపల్లిలో తహసీల్దార్ ఆధ్వర్యంలో సభలు ఉంటాయని వివరించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ఆటల పోటీలు తిలకిస్తున్న కలెక్టర్

తెంపల్లి (గన్నవరం), న్యూస్‌టుడే : ఆరోగ్య ప్రణాళిక సక్రమమైన విధానాలు పాటించినపుడే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని కలెక్టరు బి.లక్ష్మీకాంతం అన్నారు. గన్నవరం మండలం తెంపల్లి గ్రామంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్యం కుటుంబ సంక్షేమం అనే కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందని చెప్పారు. జననీ సురక్షయోజన, జననీ శిశు సురక్ష, ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, ఎన్టీఆర్ బేబి కిట్, తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యశాఖ ద్వారా రాష్ట్ర బాలస్వాస్థ్య, హెల్త్ ఏటీఎం, 102 ఉచిత కాల్ సెంటర్ వంటి 26 సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జన్మభూమి గ్రామ సభల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గత మూడున్నర ఏళ్లుగా దరఖాస్తు చేసుకున్న అర్జీలను పరిష్కరించటంతోపాటు పరిష్కారం కాని విషయాలపై సమాచారం ఇస్తారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. శుభ్రంగా ఉండటంతో నిర్వాహకులను ప్రశంసించారు. ఆటల పోటీలను పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి ఎ.సుధాకర్, తహసీల్దారు ములుగు మాధురి, ఎంపీడీవో ఇందిరా ప్రియదర్శిని, డీఎంహెచ్‌వో డాక్టర్ టి.పద్మజారాణి, డీసీహెచ్ జ్యోతిర్మయి, వైద్య ఆరోగ్యశాఖ స్టేట్ నోడల్ అధికారి ఆర్.నాగమల్లేశ్వరి, సర్పంచి నిమ్మకూరి విజయకుమార్, కార్యదర్శి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మన ఊరికే అధికారులు వస్తారు

బూతిమిల్లిపాడు, అజ్జంపూడి, అల్లాపురం (గన్నవరం), న్యూస్‌టుడే : జన్మభూమి మాఊరు గ్రామసభల ద్వారా అధికారులను ప్రజల ముందుకు తీసుకువచ్చి సమస్యలను సత్వరపరిష్కారం చేయటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ అన్నారు. మండలంలోని బూతిమిల్లిపాడులో బుధవారం జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జన్మభూమి సభల్లో సాధ్యమైనంత మేర సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2 వేల నివేశ స్థలాలు పేదలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎంపీపీ పట్రా కవిత, జడ్పీటీసీ మరీదు లక్ష్మీదుర్గ, ఎంపీడీవో వై.ఇందిరా ప్రియదర్శిని, ఈవోపీఆర్డీ వి.ఎస్.జాన్‌సన్, తహసీల్దారు ములుగు మాధురి, తెదేపా మండల అధ్యక్షులు పడమట సురేష్, సర్పంచి చింతగుంట ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు. బూతిమిల్లిపాడు సభలో సవలం మరియన్న కుమారుడు ఆస్పత్రి ఖర్చులకు వల్లభనేని అరుణ మెమోరియల్ ట్రస్టు నుంచి రూ.5 వేలు, పెండేటి శివ భార్య డీఎస్సీ కోచింగ్‌కు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఇక్కడ చలువ పందిళ్లు వేసి పచ్చటి తోరణాలు కట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొలుత మండలంలోని అల్లాపురంలో సర్పంచి అనగాని రవి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఎంపీపీ, తహసీల్దారు, ఎంపీడీవోలు గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సంపూర్ణ బహిరంగ మల విసర్జన గ్రామంగా అల్లాపురంను ప్రకటించటం పట్ల అధికారులు అభినందనలు తెలియజేశారు. అజ్జంపూడిలో సర్పంచి కంచర్ల అరుణకుమారి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఎంపీటీసీ గంటా జాన్, కార్యదర్శి గంటా సత్యసాయిబాబు పాల్గొన్నారు. అల్లాపురంలో 96, అజ్జంపూడిలో 50, బూతిమిల్లిపాడులో 26 అర్జీలు సభకు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



జన్మభూమి ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే వంశీ, అధికారులు

కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి

గన్నవరం, న్యూస్‌టుడే : కుల వ్యవస్థ నిర్మూలనకు పాటుపడిన సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాట్రగడ్డ స్వరూపారాణి అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక వీకేఆర్ కళాశాలలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఆంగ్లేయుల పాలనలో సాగిన సాంఘిక దురాచారాలు, సతీ సహగమనం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సావిత్రిబాయి పోరాడినట్లు చెప్పారు. ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మహిళలు, యువతులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కొడాలి రాజేశ్వరి, సీనియర్ న్యాయవాది అనుమోలు వెంకటేశ్వరరావు, ఐద్వా గన్నవరం డివిజన్ కార్యదర్శి మల్లంపల్లి జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల అందజేత

గన్నవరం, న్యూస్‌టుడే : గన్నవరం పంచాయతీలో నూతనంగా మంజూరైన నాలుగు పింఛన్ల నగదు బుధవారం పంపిణీ చేశారు. ఉప సర్పంచి జాస్తి శ్రీధర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. మర్లపాలెం నీటి సంఘం అధ్యక్షుడు మేడసాని రామకృష్ణ, పాలకవర్గ సభ్యులు మాణిక్యాలరావు, అజీజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందిన సావిత్రీ బాయి పూలే జయంతిని పీఆర్టీయూ బుధవారం నిర్వహించింది. మండలంలోని 12మంది మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. పీఆర్టీయూ సేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ డి.శ్రీను సమన్వయం చేశారు. స్రవంతి ఛారిటబుల్ ట్రస్టు అధినేత వీరమాచనేని సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు రాజు, కార్యదర్శి రమేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు కృపావతి, మాగంటి అనిత, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్ బాపులపాడు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : వీరవల్లిలో నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీల్లో బాపులపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. అండర్-14, అండర్-17 విభాగాలలో 8 క్రీడాంశాలలో రెండురోజులపాటు పోటీలు నిర్వహించారు. మండలంలోని 14పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్స్ విభాగంలో వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, జూనియర్ విభాగంలో టెన్నికాయిట్, త్రోబాల్‌లలో మొదటి స్థానంలో నిలిచిన బాపులపాడు హైస్కూలు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుచుకుంది. ఇదే హైస్కూలు జట్లు సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీలో ద్వితీయస్థానంలో నిలిచారు. పలు విభాగాల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన వీరవల్లి హైస్కూలు మండలంలో రెండోస్థానంలో నిలిచింది.

వికాస్‌లో ఇంటర్న్‌షిప్ సెల్ ప్రారంభం

నున్న(విజయవాడ గ్రామీణ), న్యూస్‌టుడే : నున్న వికాస్ కళాశాలలో బుధవారం రాష్ట్ర సాంకేతిక అకాడమీ ఎడిషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విన్ని పాత్రో ఇంటర్న్‌షిప్ సెల్‌ను ప్రారంభించారు. కొత్త సవాళ్లను ఏ విధంగా ఎదుర్కోవాలో మెలకువలు తెలిపారు. కార్యక్రమంలో కె.వి.రాధాకృష్ణ, నరెడ్ల సత్యనారాయణరెడ్డి, బి.రమణ, పి.అంకినీడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడుల కార్యక్రమం

కేసరపల్లి (గన్నవరం), న్యూస్‌టుడే : మండల పరిధి కేసరపల్లి శివాలయంలో బుధవారం ఇరుముడుల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి చెరుకూరి సాయిబాబు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 80 మంది అయ్యప్ప దీక్షాపరులకు ఇరుముడులు కట్టారు. శరణుగోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

పంట బీమా పరిహారం ఇప్పించండి



తిప్పనగుంట సభలో ప్రసంగిస్తున్న ప్రత్యేకాధికారి సత్యనారాయణ

కాకులపాడు, దంటగుంట్ల (హనుమాన్‌జంక్షన్), న్యూస్‌టుడే : అకాల వర్షాల వల్ల నష్టపోయిన వరి, మినుము పంటలకు బీమాపరిహారం ఇప్పించాలని బాపులపాడు మండలం కాకులపాడు, తిప్పనగుంట గ్రామాల రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. జన్మభూమి-మాఊరు రెండో రోజు సభలు కాకులపాడు, దంటగుంట్ల, తిప్పనగుంట చిరివాడలలో నిర్వహించారు. మండల స్థాయి బృందాలతో గ్రామసభలు నిర్వహించారు. కాకులపాడు, దంటగుంట్లలో నిర్వహించిన సభలకు ఎంపీడీవో కేశవరెడ్డి ఆధ్వర్యంలో తిప్పనగుంట, చిరివాడలలో నిర్వహించిన సభలకు తహసీల్దారు కె.గోపాలకృష్ణ, ఆధ్వర్యంలోని బృందం హాజరయ్యాయి. చిరివాడ సభకు గన్నవరం నియోజకవర్గ జన్మభూమి నోడల్ అధికారిణి పి.ఉషాకుమారి వచ్చారు. పంటనష్టం వివరాలు నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపామని త్వరలోనే పరిహారానికి సంబంధించిన నిర్ణయాలను ప్రకటిస్తామని వ్యవసాయాధికారి శ్రీనివాసరావు రైతులకు తెలిపారు. పింఛన్లు, రేషన్‌కార్డులు కావాల్సిన వారు దరఖాస్తులు చేసుకున్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అన్ని చర్యలూ తీసుకుంటామని ప్రత్యేకాధికారి సత్యనారాయణ తెలిపారు. ఎంపీపీ తుమ్మల కోమలి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులూ హాజరై ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు.

పథకాలు చేరువ చేసేందుకే సభలు



తేలప్రోలులో మాట్లాడుతున్న ఎంపీపీ ఇందిర

తేలప్రోలు, చాగంటిపాడు (ఉంగుటూరు), న్యూస్‌టుడే : ప్రభుత్వ పథకాల ప్రజలకు చేరువ చేసేందుకే జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గుదె ఇందిర తెలిపారు. బుధవారం మండలంలో తేలప్రోలు, చాగంటిపాడు, చికినాల గ్రామాల్లో జన్మభూమి మాఊరు గ్రామ సభలు నిర్వహించారు. తేలప్రోలులో ఆమె మాట్లాడుతూ.. అర్హులైనవారికి పథకాలు చేరుతున్నాయా... లేదో తెలుసుకోవడానికి సభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తెదేపా ప్రభుత్వం దార్వనే అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అవసరం ఉదని, దీనిపై సభలో మాట్లాడేందుకు వెళ్లగా అధికారులు మాట్లాడనివ్వలేదని లయన్స్ క్లబ్ జిల్లా నాయకుడు భానుసుందర్ కుమార్ ఆరోపించారు. కొత్తగా మంజూరైన వారికి రేషన్ కార్డులు అందజేశారు. వైస్ ఎంపీపీ ఆర్నేపల్లి సింహాచలం, తహసీల్దార్ ముత్యాల శ్రీనివాస్, ఈవోపీఆర్డీ నరసింహారావు, సర్పంచి భీమవరపు హారిణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. చాగంటిపాడులో ఎంపీడీవో శివప్రసాద్, సర్పంచి పసుపులేటి గణేష్, ఏఎంసీ డైరెక్టర్ జంపా ఏడుకొండలరావు, జన్మభూమి కమిటీ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కానూరు, న్యూస్‌టుడే : నారాయణ విద్యా సంస్థల సహకారంతో స్థానిక వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న స్ప్రైట్ ఈసీసీ కప్-2017 పోటీలు తుది అంకానికి చేరుకుంటున్నాయి. బుధవారం జరిగిన మ్యాచ్‌లలో క్రీడాకారులు అటు బ్యాటింగ్‌లోను.. ఇటు బౌలింగ్‌లోను రాణించారు. జూనియర్స్ విభాగంలో రాజీవ్‌గాంధీ ట్రిపుల్‌ఐటీ, పీబీ సిద్దార్థ జట్లు విజయం సాధించి సెమీస్‌కు చేరాయి. సీనియర్స్ విభాగంలో శ్రీవిద్యా ఆర్ట్సు అండ్ సైన్స్ జట్టు విజయం సాధించింది. సీనియర్స్ విభాగంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆంధ్రా లయోల డిగ్రీ కళాశాల జట్టు.. ఆంధ్ర లయోల ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించి సెమీస్‌లోకి ప్రవేశించింది.

సత్తాచాటారు..

- సెమీస్‌కు చేరిన రాజీవ్‌గాంధీ ట్రిపుల్‌ఐటీ, పీబీ సిద్ధార్థ, ఆంధ్రా లయోల డిగ్రీ కళాశాల జట్లు
- తుది అంకానికి స్ప్రైట్ ఈసీసీ కప్-2017 జిల్లా స్థాయి పోటీలు



విజయం సాధించిన రాజీవ్ గాంధీ ట్రిపుల్ ఐటీ జట్టు



కిరణ్

రాజీవ్‌గాంధీ ట్రిపుల్‌ఐటీ జట్టు సునాయాస విజయం

జూనియర్స్ విభాగంలో రాజీవ్‌గాంధీ ట్రిపుల్‌ఐటీ జట్టు.. శ్రీకాకతీయ జూనియర్ కళాశాల జట్టుపై 9 వికెట్ల తేడాతో విజయం సాధించి సెమీస్‌లోకి ప్రవేశించింది. టాస్ గెలిచి రాజీవ్ గాంధీ జట్టు మొదట బౌలింగ్ ఎంపిక చేసుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకతీయ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేసింది. నరేష్ 22 బంతుల్లో 15 పరుగులు, గణేష్ 8 బంతుల్లో 5 పరుగులు చేశారు. రాజీవ్‌గాంధీ జట్టు బౌలర్లలో సాయి 2, కిరణ్ 1 వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు రాజీవ్‌గాంధీ ట్రిపుల్ ఐటీ జట్టుగ 6.5 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి 59 పరుగులు సాధించి సునాయాస విజయం సొంతం చేసుకుంది. ఈ జట్టులో కిరణ్ 14 బంతుల్లో 2 ఫోర్లతో 23, జీవన్ 23 బంతుల్లో 2 ఫోర్లతో 22 పరుగులు చేశారు. కాకతీయ బౌలర్లు బాలరాజు 1 వికెట్ తీశారు. కిరణ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ప్రకటించారు.

పీబీ సిద్ధార్థ దూకుడు



పవన్‌కుమార్

జూనియర్స్ విభాగంలో పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల జట్టు.. ఉషారామా పాలిటెక్నిక్ కళాశాల జట్టును 29 పరుగులతో చిత్తు చేసి సెమీస్‌లోకి ప్రవేశించింది. టాస్ గెలిచి పీబీ సిద్ధార్థ మొదట బ్యాటింగ్ ఎంపిక చేసుకొని నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసింది. హరికృష్ణ 14 బంతుల్లో 2 ఫోర్లతో 17, ప్రసాదు 19 బంతుల్లో 1 ఫోర్‌తో 17 పరుగులు చేశారు. ఉషారామా బౌలర్లలో నరసింహారావు, రవి చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉషారామా జట్టు 9.3 ఓవర్లలో 31 పరుగులకే ఆలౌట్ అయింది. పీబీ బౌలర్లలో పవన్‌కుమార్ 4, కల్యాణ్ 3 వికెట్లు తీశారు. పవన్‌కుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ప్రకటించారు.



సత్తాచాటిన పీబీ సిద్ధార్థ జట్టు

నేటి మ్యాచ్‌లు >>>

జూనియర్స్ విభాగం

- మిక్‌పాలిటెక్నిక్ కళాశాల జట్టు × శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్టు
- ఎంవీఆర్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు × కేబీఎన్ జూనియర్ కళాశాల

సీనియర్స్ విభాగం

- పీబీ సిద్ధార్థ ఆర్ట్స అండ్ సైన్సెస్ × లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ జట్టు
- కేబీఎన్ డిగ్రీ కళాశాల జట్టు × శ్రీవిద్య ఎడ్యుకేషన్ సొసైటీ

13 పరుగుల తేడాతో 'శ్రీవిద్య' విజయం



శివగోపాల్

సీనియర్స్ విభాగంలో జరిగిన మ్యాచ్‌లో శ్రీవిద్యా ఆర్ట్సు అండ్ సైన్స్ జట్టు.. ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జట్టుపై 13 పరుగులతో విజయం సాధించింది. టాస్‌గెలిచి శ్రీవిద్యా జట్టు మొదట బ్యాటింగ్ ఎంపిక చేసుకొని నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 57 పరుగులు చేసింది. అఖిల్ 18 బంతుల్లో 3 ఫోర్లతో 19, సందీప్ 15 బంతుల్లో 1 ఫోర్‌తో 15 పరుగులు చేశారు. ఎన్ఆర్ఐ బౌలర్లు రవీంద్ర, సువర్ణ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎన్ఆర్ఐ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 44 పరుగులు చేశారు. ఆ జట్టులో పవన్ కార్తీక్ 27 బంతుల్లో 1 ఫోర్‌తో 23, సువర్ణరాజ్ 15 బంతుల్లో 6 పరుగులు చేశారు. శ్రీవిద్యా బౌలర్లు శివగోపాల్ 2, బాషా 1 వికెట్ తీశారు. శివగోపాల్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ప్రకటించారు.



గెలుపొందిన శ్రీవిద్యా ఆర్ట్స అండ్ సైన్స్ జట్టు

ఆంధ్రా లయోల డిగ్రీ కళాశాల జట్టు సత్తా

సీనియర్స్ విభాగంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆంధ్రా లయోల డిగ్రీ కళాశాల జట్టు.. ఆంధ్రా లయోల ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై 16 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీస్‌లోకి ప్రవేశించింది. టాస్ గెలిచి లయోల డిగ్రీ జట్టు.. మొదట బ్యాటింగ్ ఎంపిక చేసుకొని నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 61 పరుగులు చేసింది. జయప్రకాష్ 14 బంతుల్లో 2 ఫోర్లతో 16, షాన్‌వార్ 11 బంతుల్లో 2 ఫోర్లతో 9 పరుగులు చేశారు. లయోల ఇంజినరింగ్ జట్టు బౌలర్లలో రఫీ 2, పవన్ 1 వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన లయోల ఇంజినీరింగ్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 45 పరుగులు చేసి పరాజయం పాలైంది. లయోల డిగ్రీ కళాశాల జట్టు బౌలర్లలో అఖిల్, భాగ్యరాజ్ చెరో రెండు వికెట్లు తీశారు. జయప్రకాష్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ప్రకటించారు.



ప్రతిభ చూపిన ఆంధ్రా లయోల డిగ్రీ జట్టు



జయప్రకాష్

లక్కీడ్రాలో బంగారు నక్లెస్ గెలుచుకున్న నూజివీడు వాసి

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ఎంజీ రోడ్డులోని కళాంజలిలో బుధవారం లక్కీడ్రా విజేతకు బంగారు నెక్లెస్‌ను అందజేశారు. కళాంజలి వినియోగదారుల కోసం 'మా బంగారు మహోత్సవం' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈనెల 26వ తేదీన కళాంజలిలో నూజివీడుకు చెందిన ఓలేటి సుధీర్, శోభన దంపతులు వస్త్రాలను కొనుగోలు చేశారు. వారం.. వారం డ్రా తీసే కార్యక్రమంలో భాగంగా గత నెల 30న విశాఖలోని కళాంజలిలో 'మా బంగారు మహోత్సవం' లక్కీ డ్రాను రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు.. తీశారు. ఇందులో విజేతలుగా సుధీర్ దంపతులు (కూపన్ నంబరు 2085) ప్రకటించారు. బుధవారం వారికి రూ.3.75 లక్షల నెక్లెస్‌ను కళాంజలి సినియర్ మేనేజర్ వెంకటేష్ ప్రదానం చేశారు.



విజేతకు బహుమతి అందజేస్తున్న కళాంజలి సీనియర్ మేనేజర్ వెంకటేష్

9న జిల్లా స్థాయి కూచిపూడి నాట్యపోటీలు

కూచిపూడి, న్యూస్‌టుడే: జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9న కూచిపూడిలో జిల్లా స్థాయి కూచిపూడి నాట్య పోటీలు నిర్వహిస్తున్నట్లు కృష్ణావిశ్వవిద్యాలయం కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వై. సుందరకృష్ణ తెలిపారు. కృష్ణావిశ్వవిద్యాలయం(మచిలీపట్నం) ఆధ్వర్యంలో కూచిపూడిలోని వర్సిటీ క్యాంపస్ కాలేజి(పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం స్మృతి సదనం)లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలు జరుగుతాయన్నారు. జూనియర్ స్థాయిలో 13- 16 ఏళ్ల లోపు బాలబాలికలు జతిస్వరం/శబ్ధం అంశాన్ని, సీనియర్ విభాగంలో 17- 22 ఏళ్ల యువతీయువకులు పాలొనవచ్చున్నారు. వీరు కీర్తన/తరంగం అంశాలను వేషధారణతో ప్రదర్శించాలన్నారు. భోజన ఏర్పాట్లు ఉంటాయమన్నారు. విజేతలకు బహుమతులు ఉంటాయని, పాల్గొనే వారు ప్రశంసాపత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. వయస్సు ధ్రువీకరణ పత్రాన్ని పోటీ సమయంలో నిర్వాహకులను అందించాలన్నారు. పూర్తి వివరాల కోసం సమన్వయకర్త కేశవ ప్రసాద్‌ను 9949618846 చరవాణి నంబరులో సంప్రదించాలని కోరారు.



గాలి కొదిలేశారు..!

- పెట్రోల్ బంకుల్లో ఉచిత సేవలు దూరం
- వాహన యజమానులపై ఏటా రూ.107 కోట్ల 'గాలి'భారం
- మరుగుదొడ్లు ఉన్నా తాళాలు
- పారిశుద్ధ్య లోపాలు
- జాతీయ రహదారులపై వాహనదారుల అవస్థలు

ఈనాడు పరిశీలన







సుబ్బారావు... తన ద్విచక్ర వాహనాన్ని చక్కగా వాడుతుంటారు. ప్రతి వారం టైర్లలోని గాలి ఒత్తిడిని పరిశీలిస్తారు. కచ్చితంగా సరిపడా గాలి ఉండేలా చూసుకుంటారు. అదేమి చాదస్తం అని స్నేహితులు అంటే.... టైర్లలోని గాలి ఒత్తిడికి, వాహనం మైలేజీకి సంబంధం ఉందని చెబుతారు. సరిపడా గాలి ఉంటే వాహనం మైలేజీ బాగా వస్తుందని వివరిస్తారు.



అమరావతి గ్రామం రాయపుడి పెట్రోల్ బంక్ ఇది. ఇందులో గాలి యంత్రం పని చేయడం లేదు. ప్రథమ చికిత్స పెట్టె, తాగునీటి సౌకర్యం ఉన్నాయి.

పెట్రోలు పోయించుకునే బంకులో ఉచితంగా గాలి కొట్టించుకుందామని వెళ్లే సుబ్బారావు లాంటి సగటు వాహనదారులకు నిరుత్సాహమే మిగులుతోంది.. పెట్రోలియం కంపెనీలు చెబుతున్న ప్రకారం ఉచితంగా గాలి కొట్టాలన్న నిబంధన సక్రమంగా అమలు కావడం లేదు.. వీటిని కొన్ని బంకులు మాత్రమే పాటిస్తున్నాయి.. యంత్రం పాడైందనో.. సిబ్బంది లేరనో వాటిని మూలకు చేరుస్తున్నారు.. పూర్తి ఉచితంగా అందాల్సిన సేవకు ఏటా వాహనదారులు రెండు జిల్లాల్లో కలిపి రూ.107కోట్లు చెల్లిస్తుండటం గమనార్హం.. పెట్రోలు బంకుల్లో నిబంధనల ప్రకారం అందాల్సిన ఇతర సేవలు, ప్రజల్లో చైతన్యంపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.

5 బంకుల్లో ఈ ఐదు తప్పనిసరి...

1. ఉచిత గాలి
2. ఉచిత మరుగుదొడ్ల సౌకర్యం
3. ప్రాథమిక చికిత్సకు అవసరమైన దూది, బ్యాండేజీ, మందు
4. వినియోగదారుని కోరికపై పెట్రోల్/డీజిల్ నాణ్యత, కచ్చితమైన కొలతను తెలియజేసే కిట్
5. సలహాలు, ఫిర్యాదుల పుస్తకం

TOILET

జిల్లా	బంకుల సంఖ్య
కృష్ణా	230
గుంటూరు	243

న్యూస్‌టుడే, సూర్యారావుపేట (విజయవాడ)

పెట్రోల్ బంకుల్లో లభ్యమయ్యే ఉచిత సేవలను పరిశీలిస్తే ఉచిత గాలి మినహా మిగిలిన సౌకర్యాలు ఆయా బంకుల్లో కల్పిస్తారన్న విషయం చాలా మందికి తెలియదు. గాలి ఉచితంగా ఇవ్వాలన్న విషయం తెలిసినా వాహనదారులకు ఆ సేవలు అందడం లేదు. కొన్ని బంకుల్లో ఉచితంగా గాలి పెట్టడం లేదు. గాలి యంత్రం ఉన్నా పెట్టేందుకు సిబ్బంది కనిపించరు. మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నా పరిశుభ్రంగా ఉండని పరిస్థితి. కొన్ని చోట్ల తాళాలు వేసి ఉంటాయి. పెట్రోల్ నాణ్యత, కొలతలపై ఆయా పెట్రోల్ కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందూస్థాన్ పెట్రోలియంలు ఎప్పటికపుడు తనిఖీలు చేస్తుంటాయి. ప్రతి ట్యాంకరు లోడ్ రాగానే ఆయా బంకుల యాజమాన్యాలు నాణ్యత, కొలతలను పరిశీలించుకుంటాయి. ఆ తరువాతే ట్యాంకుల్లోకి దిగుమతి చేసుకుంటాయి. ట్యాంకులోకి దిగుమతి అయిన తరువాత నాణ్యతలో లోపం వస్తే ఆయా బంకు యాజమాన్యాలదే బాధ్యత. అందుకే ప్రతి ఒక్కరూ నాణ్యత విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉంటారు. ఇక వాహనదారుకు నాణ్యత, కొలతపై అనుమానం వస్తే తక్షణం దాన్ని నివృత్తి చేసే ఉపకరణాలు ప్రతి బంకులో అందుబాటులో ఉంటాయి. నాణ్యత నిర్ధారణకు ఫిల్టర్ పేపర్ పరీక్ష, డెన్సిటీ పరీక్షలు నిర్వహించి తెలియజేస్తారు. ఇవన్నీ ప్రతి పెట్రోల్ బంకులో ఉండాలి. వాహనదారులకు ఈ విషయాలు తెలిసినా పరీక్షించమని కోరేది 1 శాతం కంటే తక్కువే.

వాహనానికి ఖర్చు ఇలా...



ప్రతి ద్విచక్ర వాహనం, కార్లు తదితర వాహనాలు ప్రతి వారం తమ వాహనం టైర్లలో గాలి ఒత్తిడి సక్రమంగా ఉండేలా చూసుకుంటాయి. ప్రైవేటు దుకాణాల్లో ద్విచక్ర వాహనానికి ఒకసారి గాలి పెడితే రెండు టైర్లకు కలిపి రూ.10 వసూలు చేస్తే అదే కారుకు రూ.20 తీసుకుంటారు. ఇక లారీలు ఆటోలది ఇదే పరిస్థితి. మన ద్విచక్రవాహనాలు, కార్లను తీసుకుని ఏటా కేవలం గాలి కోసమే అయ్యే ఖర్చును లెక్కిస్తే... అమ్మో అనుకోవాల్సిందే.

వాహనం	వారం ఖర్చు	నెల ఖర్చు	ఏడాది ఖర్చు (రూపాయల్లో)	రెండు జిల్లాల్లో వాహనాలకు.. (రూ.)
బైక్	10	40	480	92,93,61,600
కారు	20	80	960	14,74,56,960

కేవలం ద్విచక్ర వాహనాలు, కార్లకు ఉచితంగా గాలి పెట్టకపోతే వాహన యజమానులపై ఏడాదికి పడే భారం అమ్మో అనుకోకతప్పదు. అది రూ.107,68,18,560గా లెక్క తేలింది.

రెండు జిల్లాల్లో వాహనాల సంఖ్య

జిల్లా	కార్లు	ద్విచక్రవాహనాలు
విజయవాడ	82,417	7,84,932
కృష్ణారూరల్	23,710	7,52,730
గుంటూరురూరల్	39,657	3,23,126
గుంటూరు సిటీ	7,817	75,382
మొత్తం	1,53,601	19,36,170

ఉచిత గాలి కొన్ని చోట్ల కనిపించదు...

ప్రతి వాహనానికి ఉచితంగా గాలి పెట్టాలన్నది ఆయా పెట్రోలియం కంపెనీల నిబంధన. దీనికి అనుగుణంగా ఆయా పెట్రోలియం కంపెనీలే గాలి యంత్రాలను బంకుల్లో ఏర్పాటు చేస్తాయి. అయితే కొన్ని చోట్ల ఇది అమలుకు నోచుకోవటం లేదు. సిబ్బంది కొరత అని కొన్నిచోట్ల, పని చేయడం లేదంటూ ఇంకొన్ని చోట్ల గాలి పెట్టటం లేదు. ఫలితంగా వాహన యజమానులు దుకాణాల్లో డబ్బులు ఇచ్చి గాలి పెట్టించుకుంటున్నారు.

పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలు కల్పిస్తున్నాం

ప్రతి పెట్రోల్ బంకులో వినియోగదారుల కోసం తప్పనిసరిగా అందుబాటులో ఉండే ఉచిత సేవలను అందిస్తున్నాం. అయితే కొన్ని చోట్ల మాత్రం ఉచిత గాలి ఉండటం లేదు. యంత్రం పాడైతే సదరు కంపెనీ వచ్చి మరమ్మతులు చేయాలి. ఒక్కోసారి ఇది ఆలస్యం అవుతుంది. ఒక్కోసారి సిబ్బంది కొరత వల్ల ఉచితంగా గాలి ఇవ్వలేకపోతున్నారు. **-సిహెచ్.నరసింహారావు, కృష్ణా జిల్లా పెట్రోల్ బంకుల సంఘం అధ్యక్షుడు**

పరిశీలన

నగరంలోని పెట్రోల్‌బంకుల్లో మరుగుదొడ్డి సౌకర్యం అందుబాటులో ఉంది. పెట్రోల్ నాణ్యత, కొలతలో అనుమానం ఉంటే పరిశీలించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయి. ఆయా కంపెనీలు నిత్యం వీటిని పర్యవేక్షిస్తుంటాయి. అయితే ఉచిత గాలి మాత్రం పగటి పూట సైతం అందుబాటులో లేని బంకులు కొన్ని ఉన్నాయి. గాలి యంత్రాలున్నా వాటిని కొన్ని చోట్ల ఉపయోగించటం లేదు. కొన్ని చోట్ల పనిచేయటం లేదు. అపుడపుడు మొరాయిస్తున్నాయి.

1. ప్రదేశం: మధురానగర్ పెట్రోల్ బంక్
పరిశీలన: ఉచిత గాలి అందుబాటులో లేదు. ఇక్కడ మిషన్ ఉంది. కానీ వాడుతున్న దాఖలాలు లేవు. నిరుపయోగంగా పడి ఉంది.

2. ప్రదేశం: మహాత్మాగాంధీ రోడ్డులో హెచ్‌పీ పెట్రోల్‌బంక్
పరిశీలన: ఉచిత గాలి యంత్రం ఉంది. పెట్రోలు పంప్‌నకు సమీపంలో ఉండటంతో ద్విచక్రవాహనాలు ఆగి గాలి పెట్టించుకునేందుకు అనువుగా లేదు.

3. ప్రదేశం: మహాత్మాగాంధీ రోడ్డులోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ బంక్
పరిశీలన: గాలి ఉచితంగా పెడుతున్నారు. ఇరుకైన ప్రదేశంలో బంక్ ఉంది.

4. ప్రదేశం: గాంధీనగర్‌లోని గారపాటి పెట్రోల్‌బంక్
సేవలు: ఉచిత గాలి అందుబాటులో ఉంది.

5. ప్రదేశం: సీతారాంపురంలోని ఐఓసీ పెట్రోల్‌బంక్
సేవలు: ఉచిత గాలి ఉంది. కానీ పెట్టేందుకు సిబ్బంది అందుబాటులో లేరు.

6. ప్రదేశం: గూడవల్లిలోని లారీ యజమానుల సంఘం పెట్రోల్ బంక్
సేవలు: గాలి యంత్రం ఉంది. ఉచిత గాలి ఎపుడూ అందుబాటులో ఉంటుంది. విశాలమైన ప్రాంగణంలో అన్ని సౌకర్యాలతో ఉంది. ప్రథమ చికిత్స పెట్టె ఉంది.

7. ప్రదేశం: బందరురోడ్డులో భారత్ పెట్రోలియం బంక్
సేవలు: విశాలమైన ప్రాంగణం. ఉచితంగా గాలి అందుబాటులో ఉంది.

8. కానురు: ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంక్
పరిశీలన: గాలి యంత్రం పని చేయడం లేదు. వాహన యజమానులు అడిగితే పనిచేయడం లేదని సిబ్బంది సమాధానం చెబుతున్నారు. మరుగుదొడ్లకు తాళాలు వేస్తారు.



మాలకొండయ్యను సన్మానిస్తున్న బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం

డీజీపీకి ఆత్మీయ సన్మానం

నంబూరు(పెదకాకాని): డీజీపీగా బాధ్యతలు చేపట్టిన మాలకొండయ్యను బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు, రైన్‌ట్రీ పార్క్ నివాసితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం సన్మానించారు. పెదకాకాని మండలం నంబూరు గ్రామ సమీపంలోని రైన్‌ట్రీ పార్క్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా ఆయన్ని సన్మానించారు. రైన్‌ట్రీ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి, డాక్టర్.రమేష్‌బాబు, డాక్టర్ వీరరాఘవయ్య, వ్యవసాయ కళాశాల డీన్‌లు కాకుమాను సాంబశివరావు, సురేంద్రబాబు, ఐఎఫ్ఎస్ విశ్రాంత ఉద్యోగులు సాయిబాబా. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 26, 27 తేదీల్లో బాపట్లలో జాతీయ సదస్సు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: వ్యవసాయంలో సాంకేతికత, డిజిటల్, ఇంజినీరింగ్ టెక్నాలజీలపై జాతీయ సదస్సు బాపట్లలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టరు వి.దామోదరనాయుడు తెలిపారు. గుంటూరు లాంలోని విశ్వవిద్యాలయం పరిపాలన భవన్‌లో జాతీయ సదస్సుకు సంబంధించి కరపత్రాలను బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తులు రైతులు సాధించేలా డిజిటల్, సాంకేతికత సద్వినియోగంపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సదస్సును బాపట్ల వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల, ఆగ్రోస్, భారతీయ ఇంజినీరింగ్ సమాజం-ఆంధ్రప్రదేశ్ ఛాప్టర్ సహకారంతో నిర్వహిస్తున్నారని వివరించారు. ఇతర వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.angrau.ac.inలో చూడాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ ఇంజినీరింగ్ విభాగం డీన్ భాస్కరరావు, అధికారులు పాల్గొన్నారు.

ఒకే ఒక్కడు..!


వాటర్ స్పోర్ట్స్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ
జిల్లాకు పేరు తెచ్చిన కానిస్టేబుల్



ఓ ఆర్మీ రిజర్వు కానిస్టేబుల్..క్రీడలో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి ఆ శాఖకే పేరు, ప్రతిష్ఠలు తెచ్చిపెట్టాడు. ఏళ్లుగా ఎన్నడూ లేని విధంగా వాటర్ స్పోర్ట్స్ విభాగంలో తొలి ప్రయత్నంలోనే రెండు రజత పతకాలు సాధించి జిల్లాను ఓ మెరుపు మెరిసేలా చేశాడు. ఆ క్రీడ.. ఆ విశేషాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన రైతు సీతారామయ్య- పద్మల కుమారుడే మణికంఠ. పాఠశాల స్థాయి నుంచే తల్లిదండ్రులకు సాయపడుతూ చదువుకున్నారు. ఇంటర్ వరకు కళాశాలకు వెళ్లిన ఆయన..ఆర్థిక వెసులుబాటులేక వ్యవసాయం చేస్తూ దూర విద్యలో డిగ్రీ చేసి 2013లో ఏఆర్ కానిస్టేబులు ఉద్యోగం పొందాడు.

కసిగా ఓడి.. ఆపై గెలిచి



పతకంతో మణికంఠ

పోలీసు శిక్షణ కేంద్రంలో తర్ఫీదు పొందడం ముగిసిన వెంటనే ఆ శాఖ తరపున క్రీడా పోటీలు నిర్వహించారు. అనేక విభాగాల్లో కసిగా పాల్గొన్నా ఆయన ఒక్క దానిలోనూ పతకం సాధించ లేదు. అతనిలోని కసిని చూసి అధికారులు నీవు నిరాశ చెందకు వాటర్ గేమ్ వచ్చింది. దానిలో పాల్గొనాలంటే ఈత వచ్చి ఉండాలన్నారు. అప్పుడు మణికంఠ ముఖంలో ఆనందం కనిపించింది. అక్కడే ఉన్న ఈతకొలనుతో ఈతకొట్టమన్నారు. ప్రతిభ చూసి వెంటనే వాటర్ గేమ్స్ శిక్షణకు ఎంపిక చేశారు. దానిలో రోయింగ్, కెనోయింగ్, కైయాకింగ్ మూడు విభాగాలు ఉన్నాయి. కెనోయింగ్ విభాగాన్ని ఆయన ఎంచుకున్నాడు. పొడవాటి పడవలో (తెడ్డువేస్తూ) నీటిని వేగంగా కదిలిస్తూ తక్కువ సమయంలో గమ్యస్థానానికి చేరుకోవాలి. తొలి రోజుల్లో ఆ పడవలో అటు ఇటు కదలకుండా బ్యాలెన్స్ చేయటానికి ఆరు నెలల సమయం పట్టింది. శివారెడ్డి పర్యవేక్షణలో రోజూ ఉదయం మూడు, సాయంత్రం మూడు గంటలసేపు కసరత్తు చేసేవారు. రోజు 7 నుంచి 10 కిలోమీటర్ల పరుగు వారానికి ఒకసారి 15 కిలోమీటర్లు పరుగు శిక్షణలో కీలక భాగంగా ఉండేది.

తొలి ప్రయత్నంలోనే పతకాలు

డిసెంబరు 5 నుంచి 9వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని అప్పర్‌లేక్ సరస్సులో ఆలిండియా వాటర్ స్పోర్ట్సు ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. దానికి పోలీసులతోపాటు కేంద్ర బలగాలకు చెందిన క్రీడాకారులు 18 మంది పోటీ పడ్డారు. ఒక్క మణికంఠ మాత్రమే కెనోయింగ్ విభాగంలో రెండు రజత పతకాలు సాధించి జాతీయ స్థాయిలో గుంటూరు జిల్లా ఖ్యాతిని పెంచేలా చేశాడు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి చౌహన్, హోంమంత్రి చేతుల మీదుగా పతకాలు, ప్రశంసా పత్రాలు స్వీకరించి అందరి ప్రశంసలందుకున్నాడు. తొలి ప్రయత్నంలోనే రెండు పతకాలు సాధించిన మణికంఠను అర్బన్ ఎస్పీ విజయరావు ప్రత్యేకంగా అభినందించారు.

ఇండియన్ పోలీసు జర్కిన్ వేసుకోవాలనేదే కల

ఆలిండియాలో పతకాలు సాధించిన వారిని వాటర్ గేమ్స్ సీనియర్ జట్టుకు ఎంపిక చేస్తారు. దానిలో పోలీసుశాఖే కాకుండా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సుతోపాటు ఇతరులు పోటీపడతారు. అంతటి ప్రతిష్ఠాత్మకమైన ఆ పోటీల్లో పోలీసుశాఖ తరపున ఎంపికైతే ఇండియన్ పోలీసు అనే జర్కిన్ వేసుకొనే అవకాశం ఉంటుంది. అలా అది వేసుకుని పతకాలు సాధించాలనేది నా కల.

- నెహ్రూనగర్, గుంటూరు, న్యూస్‌టుడే

నీవే రాజు... నీవే మంత్రి

పోరాడాలి..పరిహారం సాధించాలి
మార్గాలున్నాయి..ఉపయోగించుకోండి



రారాజు ఏమి చేస్తాడు..దేనినైనా శాసిస్తాడు. అయితే మార్కెట్ ప్రపంచంలో రారాజైన వినియోగదారుడు నేడు అన్ని రకాలుగా మార్కెట్ మాయాజాలంలో మోసపోతున్నాడు. కొంత మంది వ్యాపారులు, కొన్ని సంస్థల స్వార్థం వల్ల రోజూ ఎక్కడో ఒక చోట నష్టపోతూనే ఉన్నాడు. విషయం తెలిసినా వారిని ఎదుర్కొనే సత్తాలేక ఎక్కువ మంది అలాగే వదిలేస్తున్నారు. కొంత మందికి ఆసత్తా ఉన్నా మార్గాలు తెలియక మిన్నకుండి పోతున్నారు. ఈ బలహీనతే వ్యాపారులకు బలంగా మారింది. అయితే నేడు కొంత మంది సామాన్యులు వారితో పోరాటం చేసి విజయాలు సాధించడమే కాదు. లక్షల్లో పరిహారం పొందారు. అది మీరూ చేయవచ్చు.. ఆ మార్గాలపై న్యూస్‌టుడే ప్రత్యేక కథనం.



గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన నాగమల్లేశ్వరి భర్త ఆనందరెడ్డి 2014లో రూ.10 లక్షలకు సత్తెనపల్లిలోని జీవిత బీమా సంస్థలో బీమా తీసుకున్నాడు. ఏడాదిలోపే అతను గుండెపోటుతో మృతి చెందాడు. బీమా సొమ్ము చెల్లించమని ఆమె ఆ సంస్థను కోరగా దానికి వారు నిరాకరించారు. సరైన వైద్య సమాచారం ఇవ్వకుండా బీమా సభ్యుడిగా చేరారని ఆరోపించారు.

వెనుతిరగలేదు.. జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం బీమా మొత్తం రూ. 10 లక్షలను వడ్డీతో చెల్లించాలని మరో రూ. 20వేలు నష్టపరిహారం, రూ. 2వేలు ఖర్చులు కూడా ఫిర్యాదికి చెల్లించమని ఫోరం ఆదేశించింది.



గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన లంకా శ్రీనివాస శర్మ ఆన్‌లైన్ ద్వారా లెనోవా కంపెనీకి చెందిన సెల్‌ఫోన్‌ను ఫ్లిప్‌కార్ట్‌లో ఈ ఏడాది మార్చి 22న నమోదు చేసుకొని రూ. 12,499లకు కొనుగోలు చేశారు. నెల రోజుల్లోపే అది పనిచేయలేదు. మరో ఫోన్ ఇవ్వమని కోరగా దానికి సంస్థ అంగీకరించ లేదు. దీంతో ఆయన జిల్లా ఫోరంలో కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం అతను చెల్లించిన నగదు రూ.12,499లు లేదా కొత్త ఫోన్ వెంటనే ఇవ్వాలని.. రూ. 40 వేల నష్టపరిహారాన్ని మరో రూ.2వేల ఖర్చులను వడ్డీతో సెల్‌ఫోన్ కంపెనీ చెల్లించాలని జిల్లా ఫోరం ఆదేశించింది.



గుంటూరుకు చెందిన లక్ష్మీ ఇటీవల నగరంలోని ఒక కూల్ డ్రింక్ షాపులో శీతలపానీయాన్ని కొనుగోలు చేసింది. దానిలో చనిపోయిన బొద్దింక ఉంది. ఈ మేరకు ఆమె జిల్లా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫోరం విచారణ జరిపి ఆ కంపెనీ నుంచి ఫిర్యాదురాలికి రూ.30వేలు నష్టపరిహారం ఇప్పించింది.



విజయవాడలోని భవానీపురంనకు చెందిన రత్నాకర్ కొత్త చరవాణీ కొనుగోలు చేశాడు. కొద్ది రోజుల తరువాత దానికి వైబ్రేషన్ ఎక్కువై త్వరగా వేడెక్కుతోంది. దానిపై షాపు యజమానిని సంప్రదించగా సర్వీస్ చేయించి ఇచ్చారు. అయినా మళ్లీ అదే సమస్య వస్తోంది. సుధాకర్ తిరిగి సెల్‌ఫోన్ యజమానిని కలిసి కొత్త ఫోన్ అడిగితే ఇచ్చేందుకు నిరాకరించి మళ్లీ సర్వీసు చేసి ఇచ్చారు. అయినా పరిస్థితిలో మార్పు కనిపించ లేదు. దీంతో బాధితుడు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. ఫోరం విచారించి షాపు నిర్వాహకుడిని ఫిర్యాదు దారునికి కొత్తఫోన్, దాని ఖరీదు మొత్తం చెల్లించటంతోపాటు, రూ.10వేలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చింది.

ఇటీవల వెల్లడైన సర్వే ఫలితాలు

వినియోగదారులు వస్తువుల కొనుగోలు విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలపై ఇటీవల ఓ సంస్థ హైదరాబాద్, విజయవాడ, గుంటూరు నగరాల్లో సర్వే నిర్వహించింది. 79 శాతం మంది నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోవడం లేదు. ప్యాక్ చేసిన వస్తువులు సీల్ సరిగా ఉన్నదా లేదా..? దాని గడువు తేదీ ఎంత వరకు ఉంది..? ఎస్ పీఓ, ఐఎస్ఐ, అగ్‌మార్కు ఉందా లేదా..? అనే విషయాలు చూడడం లేదని తేల్చింది.

ఫిర్యాదు దాఖలు పద్ధతి



వస్తువులు కొన్న నగదు రశీదు, వారెంటీ కార్డులతో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు. దీనికి న్యాయవాదిని పెట్టుకోవాల్సిన అవసరం లేదు.

ఫిర్యాదు ఎక్కడ చేయాలి

వస్తువుల ధర లేదా సేవల విలువ.. కోరుతున్న పరిహారం బట్టి ఫిర్యాదు చేయాల్సి ఉంది. రూ. 20 లక్షల వరకు ఉంటే జిల్లా ఫోరంలో, రూ. 20 లక్షల నుంచి రూ. కోటి వరకు రాష్ట్ర కమిషన్‌కు, రూ. కోటి కంటే ఎక్కువ ఉంటే జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

ఆసుపత్రి సేవలపై



కేస్‌షీట్, డిశార్చ్ సమ్మరీ, మందుల చీటీలు ఉండాలి. వాటి నకలుతో ఫిర్యాదు చేయాల్సి ఉంది.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నేషన్ కన్జూమర్స్ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబరును 1800-11-14004లు ఏర్పాటు చేసింది.

ఎస్ఎంఎస్ ద్వారా విచారణ ప్రగతి తెలుసుకోవచ్చు

7738299899 ఫోన్ నెంబర్‌కు జిల్లా ఐడీ కేసు నెంబరుతో ఎస్ఎంఎస్ పంపితే దాని ద్వారా ఫిర్యాదు విచారణ ప్రగతిని తెలుసుకోవచ్చు. దీని కోసం కంటోనెట్ అనే ఒక సాఫ్ట్‌వేర్ సౌకర్యం కల్పించారు. వినియోగదారులు తమకు నష్టం జరిగితే...సలహాలు, సూచనలకు ఈ నెంబర్లను సంప్రదించవచ్చు.

వినియోగదారుల ఫోరం ఫోన్ నెంబరు. 0863- 2241500

గుంటూరు జిల్లా వినియోగదారుల సమాచారకేంద్రం ఇన్‌ఛార్జి నెంబరు -98495 00354

వినియోగదారుల ఫోరం ద్వారా న్యాయం జరుగుతుంది

ఏదైనా వస్తువు కొనుగోలు చేసిన సందర్భంలో అది పాడైనప్పుడు షాపు నిర్వాహకులు దానిని వాపసు తీసుకోకుంటే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించవచ్చు. ఆహార పదార్థాల విషయంలోనే ఫిర్యాదు చేయవచ్చు ఫోరం విచారించి పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుంది. వినియోగదారులు సలహాలు సంప్రదింపుల కోసం మా ఫోన్ నెంబరు. 98495 00354ను సంప్రదించవచ్చు.

- చదలవాడ హరిబాబు, రాష్ట్ర వినియోగదారుల పరిరక్షణ కమిటీ సభ్యులు

యాప్ ద్వారా అన్ని విషయాలు పసిగట్టవచ్చు

స్మార్ట్ కన్జూమర్ మొబైల్ అప్లికేషన్ యాప్‌ను తీసుకొచ్చారు. దాని వలన వినియోగదారుడు ఒక ఉత్పత్తి యొక్క బార్‌కోడ్‌ను స్కాన్ చేసి.. ఆ ఉత్పత్తి వివరాలు..? వస్తువులు తయారు చేసిన వారు ఎవరు..? తయారైన సంవత్సరం, తేదీ, దానిలోని పరిమాణం..? లోపాలుంటే ఎవరికి ఫిర్యాదు చేయాలనే వివరాలు తెలుసుకోవచ్చు.

పోర్టల్ వచ్చేసింది

ఇన్‌గ్రామ్ ఇంటిగ్రేటెడ్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ మెకానిజమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. దీని ద్వారా సమస్యలను ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.



- నెహ్రూనగర్, పట్నంబజార్ (గుంటూరు)

ఆన్‌లైన్ వినియోగదారులు

ఆన్‌లైన్ కన్జూమర్ కమ్యూనిటీస్.. దీనిని ప్రభుత్వం స్థానికుల సలహాలతో ఏర్పాటు చేశారు. ఈ వేదిక ద్వారా వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఫోరం దృష్టికి తీసుకురావచ్చు. ఆవేదిక అవసరమైతే ప్రభుత్వానికి సలహాలు ఇవ్వవచ్చు.

గుడ్డుకు.. పురస్కారం

ప్రపంచంలో చాలా దేశాల్లో మంచి ఆలోచనలకు నగదు బహుమతులు అందజేస్తున్నాయి. కొన్ని సంస్థలు ఉద్యోగాలు ఇస్తున్నాయి. ఇందుకు భిన్నంగా ఓ సంస్థ జాతీయ స్థాయిలో పురస్కారాన్ని ప్రకటించింది. అది చూసిన ఓ ఇంటర్ విద్యార్థి తన ఆలోచనను పంచుకుని ఆ అవార్డు పొందాడు. ఆ విశేషాలు ఆ విద్యార్థి మాటల్లో విందాం.

నా పేరు మాబూ సుభాని. మాది గుంటూరు జిల్లా లాం గ్రామం. నేను 10వ తరగతిలో ఉన్నప్పుడు గుంటూరు రైల్వేస్టేషన్‌కు సైన్స్ ఎక్స్‌ప్రెస్ వచ్చింది. దానిలో ప్రదర్శనలు చూస్తున్న సమయంలో ఓ వ్యక్తి వచ్చి కరపత్రం ఇచ్చాడు. దానిలో "నేషనల్ ఇన్నొవేటివ్ ఫౌండేషన్- ఇండియా ఆధ్వర్యంలో సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు, ఆలోచనలకు ఏటా "ఏపీజే అబ్దుల్ కలాం ఇగ్నైటివ్ అవార్డులు ప్రదానం చేస్తారు" అని ఉంది. అప్పుడే ఏదో ఒక కొత్త ఆలోచన చేయాలని నిర్ణయించుకున్నా. 'ఎక్స్‌పైరీ డేట్ స్టాంపింగ్ ఆన్ ఎగ్స్' అనే ఆలోచన చేశా. అది సమాజానికి ఎలా ఉపయోగపడుతుందనే విషయాన్ని ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి ఆ సంస్థకు పంపించా. వారు దానిని అవార్డుకు ఎంపిక చేసి 2017 డిసెంబరు 22వ తేదీన గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నా.

నేను నా గుడ్డు: ఎక్కువ పోషకాలు అందుతాయి. ఇది పిల్లలకు తప్పనిసరని వైద్యులు చెబుతున్నారు. అయితే అది 21 రోజులు మాత్రమే చెడిపోకుండా ఉంటుంది. కోళ్లు పొదిగేందుకు కూడా 15 రోజులులోపే ఉంది.



మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ నుంచి అవార్డు అందుకుంటున్న విద్యార్థి మాబు సుభాని

సమస్య ఇక్కడే: మార్కెట్‌లో ఎవరు డజన్ గుడ్లు తెచ్చుకున్నా.. వాటిలో రెండూ, మూడు పనికి రాకుండా పోతున్నాయి. అది ఎన్ని రోజులదో గుర్తించే అవకాశం లేదు. బయటకు బాగా కనిపించినా లోపల పరిస్థితిని గుర్తించ లేము.


పరిష్కారం : ఉత్పత్తి అయిన రోజు, గుడువు తేదీ రెండు వేయడం ద్వారా ప్రజలకు నాణ్యమైన ఆరోగ్యకరమైన గుడ్డు అందుతుంది. మార్కెట్‌లో ధరలు పెరిగినప్పుడు వాటిని నిల్వచేసి అధిక ధరలు అమ్ముకునే విధానాన్ని అరికట్టవచ్చు. అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. నాలో స్ఫూర్తిని నింపింది.

- నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

చెవులకు చిలుకలు తోడుంటే

మహిళలు తమ చెవులకు ధరించే రింగులు వారికి మరింత అందాన్ని తెచ్చిపెడతాయి. మరి అందానికి మారు పేరుగా చెప్పుకునే చిలుకలును తలపించేలా..అలాగే అదే ఆకారంలో నగలు వస్తే..వాటిని చెవులకు పెట్టుకుంటే వారి అందం మరింత రెట్టింపు అవుతుంది. రింగులు, దిద్దులు, లోలాకులు, జుంకాలు, బుట్టలు ఇలా చాలా రకాలు మార్కెట్‌లోకి వచ్చేశాయి. అవి బంగారు కోటింగ్‌తో చూడటానికి అచ్చం బంగారు నగలు లాగా ఉంటున్నాయి. సంక్రాంతి సంబరాల నేపథ్యంలో విజయవాడ, గుంటూరు నగరాల్లో అవి సందడి చేస్తున్నాయి.

- న్యూస్‌టుడే, ప్రత్తిపాడు.





ఒక్క ఐడియా ఇవ్వండి. . రూ.10 లక్షలు పారితోషకాన్ని గెల్చుకోండని మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. ఇది ఆ రాష్ట్ర ప్రజలను ఆనందంగా ఉంచడానికి ఏం చేయాలనే ఆలోచనకు ప్రకటించిన నగదు బహుమతి. ఆనందంపై పరిశోధనలకు అవసరమైన ఆర్థిక తోడ్పాటును అందిస్తామని ప్రకటించి నవ ఆలోచనకు నాంది పలికింది. పీహెచ్‌డీ పూర్తయి 35 ఏళ్ల వయసున్న యువతీ, యువకులు, విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు చేస్తున్న వారికే ఈ అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఈ ప్రకటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



ఆనంద అమరావతి కావాలి..!



మధ్యప్రదేశ్ బాటలో సాగితే సాకారం | **సుస్థిర అభివృద్ధికి ప్రజల సంతోషమే కీలకం**

అమరావతి ఫీచర్స్, న్యూస్‌టుడే

మధ్యప్రదేశ్ తర్వాత దేశంలో ప్రజలను సంతోషంగా ఉంచడం దిశగా అడుగులు వేస్తున్న రాష్ట్రం నవ్యాంధ్రప్రదేశ్ మాత్రమే. 2029 నాటికి ఆనంద ఆంధ్రప్రదేశ్ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారు. ఈ విజన్‌కు సంబంధించిన కార్యక్రమాలు గడచిన ఏడాది నుంచే రాష్ట్రంలో ప్రారంభమయ్యాయి. అవి అంతగా ఆశాజనక ఫలితాలను ఇవ్వట్లేదు. క్షేత్రస్థాయి నుంచి ప్రణాళికల అమలు లేకపోవడమే దీనికి అవరోధంగా ఉంది.

కృష్ణా 4.. గుంటూరు 6



ఇటీవల ప్రభుత్వం 5 అంశాలతో సంతోష సూచిక సర్వే నిర్వహించింది. స్వేచ్ఛా జీవనం, సామాజిక భద్రత.. ఆపదలో అండ, అవినీతి, పారిశ్రామిక అవినీతి. సేవాభావం అందులో ఉన్నాయి. 10 మార్కులకు గాను...శ్రీకాకుళం 6.414 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. కృష్ణా జిల్లా 5.746 మార్కులతో 4వ, గుంటూరు 5.515 మార్కులతో 6వ స్థానంలో నిలిచాయి.

అవినీతి తొలగాలి.. సేవాభావం పెరగాలి



అవినీతి పౌరసేవలపై ప్రభావం చూపిస్తుందని 65 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. మానవాభివృద్ధి.. సంతోష సూచికలో మొదటి స్థానాల్లో ఉన్న దేశాల్లో అవినీతిని భూతద్దంలో పెట్టి వెతకాల్సిన పరిస్థితి. ప్రజలు తాము ఆనందంగా ఉంటే మరొకరి సంతోషానికి కృషి చేస్తారు. ఇక్కడ సేవాభావం అనేది చాలా ముఖ్యమైన అంశం. ఇందులో మన రెండు జిల్లాలు వెనుకబడి ఉన్నాయి.

ప్రతి 100 మందిలో గుంటూరులో 25, కృష్ణాలో 19 మంది సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని సంతోష సూచిక సర్వేలో వెల్లడైంది. దీని శాతం 60 నుంచి 70 ఉంటే నవ్యనగరిలోని చాలా సమస్యలకు సులువుగా పరిష్కారం దొరికే అవకాశముందని తేల్చాయి.

ఆనందం ఎందుకు..? ఏంటి..?

ప్రజల ఆనందంతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఆదిశగా చర్యలు చేపట్టాలని సూచనలు చేసింది.



వ్యాయామ అక్షరాస్యత అమలు..?



ఆనంద ఆంధ్రప్రదేశ్‌లో వ్యాయామ అక్షరాస్యత ముఖ్యమైన అంశం. ఒకటో తరగతి నుంచే పిల్లలను ఆటలవైపుకు మళ్లించాలన్నది దీని లక్ష్యం. ఒకటి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు యోగా, ధ్యానం, వివిధ రకాల ఆటలను ఆడించేలా ఈ విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి తీసుకొచ్చి మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. అయితే విద్యా సంవత్సరం ముగింపు దశలో ఉన్నా ఇప్పటివరకు దాని ఊసే లేదు.

ఆనంద ఆదివారంతో ఫలితం ఎంత..?



రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో ఆనంద ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విజయవాడలో ఇది కొంచెం లక్ష్యం దిశగా కొనసాగుతుంది. సినీ, క్రీడా, విద్య, వైద్య, రాజకీయ ప్రముఖులను తీసుకొచ్చి ఉత్తేజ భరితంగా వివిధ సాంస్కృతిక.. వినోద.. ఆటపాటలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గుంటూరు నగరంతోపాటు రెండు జిల్లాల్లో 18 పురపాలక సంఘాలు, రెండు నగర పంచాయతీల్లో ఇది మొక్కుబడిగా కొనసాగుతుంది. ఆనంద ఆదివారంలో సామాజిక సేవకు అవకాశం ఉండడం లేదు. మొక్కలు నాటడం.. కాలుష్యాన్ని అరికట్టడం.. నీటి పొదుపు.. తోటివారికి సాయం చేయాలనే ఆలోచనను తీసుకురావడం జరగట్లేదు. ఇక్కడే అసలు లక్ష్యం కనుమరుగైపోతుంది.



ఉద్యోగులకు ర్యాంకులు ప్రోత్సాహకాలు

ఆనంద్ విభాగ్ పేరుతో ప్రభుత్వశాఖలు ప్రజలను ఆనందంగా ఉంచేందుకు చేసే కృషికి ర్యాంకులు ఇస్తున్నారు. దీంతో ఆరోగ్యకర పోటీ వాతావరణంలో అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. దాని కోసం పోటీపడుతున్నారు. జన్మభూమి సందర్భంగా సభలో మాట్లాడుతూ మన సీఎం కూడా ఇలాగే ప్రకటించిన విషయం తెలిసిందే.



ప్రభుత్వం పనిచేస్తే సరిపోతుందా..?

ఇదే ఆలోచనను అక్కడి పాలకపక్షం చేసింది. సమాజంలో కీలకంగా ఉండే స్వచ్ఛంద సేవా సంస్థల్ని ఇందులో భాగస్వాములను చేసింది. ప్రజలను సంతోషపర్చేందుకు కృషిచేసే సామాజిక సేవకులతో 'ఆనంద్ దళ్'ను ఏర్పాటు చేశారు. వారు ఆనందానికి దోహదంచేసే కార్యక్రమాలను చేపడుతున్నారు.

మనమూ ఆబాట సాగితే ..

అమరావతిలో సమాజ సేవకులు, విద్యావంతులు, మేధావులకు కొదవ లేదు. సమస్యల్లా వారిలో స్ఫూర్తిని నింపే చొరవే లోపంగా ఉంది. మనమూ మధ్యప్రదేశ్ కార్యక్రమాలను పుణికిపుచ్చుకుంటే ప్రపంచం మెచ్చే రాజధానిగా అమరావతి మారడంతోనూ ఆనంద ఆంధ్రప్రదేశ్ సాకారమవుతోంది.

మధ్యప్రదేశ్‌లో ఏం చేస్తున్నారంటే.....

- దేశంలో తొలి సారిగా ఆనంద మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి నిధుల కేటాయింపులు.. సిబ్బంది నియామకాలు చేసింది.
- ఆనంద్ సభ అనే కార్యక్రమం ద్వారా 9వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థులకు ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో శిక్షణ కార్యక్రమాలు మొదలయ్యాయి.
- ఆనందం ఒక పాఠ్యాంశంగా అమలు చేస్తున్నారు. ప్రేరణ.. స్ఫూర్తి.. నవోత్తేజం రగిల్చే అంశాలకు పుస్తకాల్లో ప్రాధాన్యత ఉంది.
- ప్రతి పట్టణంలో ఆనందం అనే విభాగాని ఏర్పాటు చేశారు. అది ప్రజల సంతోషం కోసమే వివిధ కార్యక్రమాల్ని నిర్వహిస్తుంది.
- నేఖి కీ దీవార్ పేరిట గోడలను ఏర్పాటు చేశారు. ఇళ్లల్లో ఉండే పనికిరాని వస్తువులను అక్కడ పడేస్తే అవి పేదలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకున్నారు. భూటాన్ నుంచి స్ఫూర్తిగా ఈ గోడలు ఏర్పాటవుతున్నాయి.



అధికారులతో మాట్లాడుతున్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి

IRON & CEMENT, EYE CARE, COOKING,FLOORINGS, YOGA & MEDIDATION, BEAUTY PARLOUR, DIABETIES, HOUSE KEEPING, COURERS, DRIVING SCHOOLS, TAILORING, YOGA & MEDIDATION, BEAUTY PARLOUR, DIABETIES

EENADU CLASSIFIEDS

CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS ELECTRICAL, FURNITURE FOR SALE, SWEETS, MESSCELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS

BUSINESS SERVICES

WANTED DEALERS / AGENTS

ప్రముఖ టెలిమార్కెటింగ్ కొరకు డీలర్స్ డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. Franchise కొరకు సంప్రదించండి. 8142657223, 040 38163916.

BUSINESS OFFER

ఫ్రీ ట్రైనింగ్.. ఫ్రీ ట్రైనింగ్.. మీకు మీరుగా సంపాదించుకొనే విధంగా స్వతంత్రంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేవిధంగా షేర్ మార్కెట్ నందు ట్రైనింగ్ ఇవ్వబడును. ✆ 99517 83555.

హోల్‌సేల్ వస్త్రవ్యాపారులకు మావద్ద ఆల్ శారీస్, డ్రెస్‌మెటీరియల్స్, షూటింగ్ షర్టింగ్ మ్యానుఫ్యాక్చరింగ్ కాస్ట్‌కు లభించును. Hyd: 7095930991/ 9121017798/ E/G ద్వారపూడి: 7337530469

ధర్మకోల్ & పేపర్‌ప్లేట్స్, టీ కప్స్, అగరబత్తి తయారీ మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నెల 20 వేలు ఆ., బై బ్యాక్ అగ్రిమెంట్, (నో ఛార్జెస్). శ్రీ ఇంజనీరింగ్, విజయవాడ - 88972 67259.

ఏదైనా సొంతంగా వ్యాపారం పెట్టదలుచుకునేవారికి గొప్ప అవకాశం. మీ ప్రాంతంలోనే ఉంటూ తక్కువ పెట్టుబడితో నెలకు 25 వేలు ఆపైన సంపాదించుకోవచ్చు. ✆ 99661 44067.

PACKERS & MOVERS

మీరు ఇల్లు మారాలంటే అమ్ములు ప్యాకర్స్ & మూవర్స్, ప్యాకింగ్/ లోడింగ్/ అన్‌లోడింగ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఏ ప్రాంతానికైనా సరే సంప్రదించండి ✆ 96662 49249, 90520 16555.

EDUCATION

Core & Adv.Java by Mr. Surya 10+ Yrs. Real Time Faculty 4 Weeks (Sat & Sun- 50 Hrs.) Batch Starts: 05-01-2018. ✆ 83412 62728.

HEALTH CARE

బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యంలేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్రదించండి 79953 92747, 96030 55647.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటన ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

HOME NEEDS

MOSQUITO SCREENS

Image మస్కిటోనెట్స్ డోర్స్ & విండోస్, మాడ్యులర్‌కిచెన్, చిమ్నీ + Hobs @ పాలిక్లినిక్‌రోడ్, బెంజిసర్కిల్ దగ్గర VJA ✆ 98494 23555, 98661 56677.

PEST CONTROL

చెదల నివారణ భారతదేశం పెస్ట్ కంట్రోల్ చెదలకు 5 సం.లు, బల్లులు బొద్దింకలకు 6 నెలలు. వాసనలేని మరకలుపడని ఇష్యు సంస్థ. VIJ. ✆ 94411 06194, 98669 30889.

FURNITURE & FURNISHING

HOME FURNISHING



PEOPLE CARE

OLD AGE HOME

విజయ ఓల్డేజ్ హోం & హోంకేర్ సర్వీస్. వృద్ధులు, మంచాన ఉన్నవారికి 24 గం॥ సేవలు చేయుటకు ఆయా/ అటెండర్లను ఇంటికి పంపగలము. ✆ 99121 73322, 99124 53322.

REAL ESTATE

A.P.Govt అమరావతి రాజధాని నిర్మాణములకు రైతులనుండి తీసుకొన్న భూములకు ప్రతిగా సచివాలయం/VIT ప్రాంతంలో రైతులకిచ్చిన స్థలము అమ్మకము. J.P.బాబు. ✆ 84640 37777.

రాజధాని అమరావతి రాయపూడి మండదం, ఉద్దండరాయునిపాలెం వెలగపూడికి అతి దగ్గరలో గ॥ 7500/- అపార్ట్‌మెంట్ ప్లాట్ 15 లక్షలు. బ్యాంక్‌లోన్ కలదు. 92464 70909.

FLAT FOR SALE

గన్నవరంలో Sft Rs.2,500/-, 2 BHK & 3 BHK అమ్మకం. గేటెడ్ కమ్యూనిటీ, 80% బ్యాంక్ లోన్, ఎయిర్‌పోర్ట్‌కి 1.5 Km. కోటేశ్వరరావు. ✆ 93949 99945.

3 BHK ఇండివిడ్యువల్ ఫ్లోర్ 2200 S.Ft. బందరురోడ్డు వారధిపేట Vertex దగ్గర మెలమిన్ పాలిష్ డోర్స్ & విండోస్ 2 కార్ పార్కింగ్, ఆటోమేటిక్ లిఫ్ట్, జనరేటర్, పుల్లీఫర్నిష్డ్ ఫ్లాట్స్ N/Fతో గృహప్రవేశానికి సిద్ధముగా ఉన్నవి. ✆ 99853 04967.

HOUSE FOR SALE

42 లక్షలకే Benz Circle కు 12 KM పరిధిలో 183 చ॥గ॥లలో నిర్మిస్తున్న ఇండివిడ్యువల్ & Duplex హౌసెస్ 80% Loan సౌకర్యంతో అమ్మకం. ✆ 80961 23123.

41 లక్షలకే ఇండివిడ్యువల్ & Duplex హౌసెస్. బందరు రోడ్డుకి సమీపంలో 100 అడుగుల రోడ్ ఫేస్, రైల్వేస్టేషన్‌కి 4 KM & ఎయిర్‌పోర్ట్‌కి 8 KM దూరంలో 80% లోను M.P డెవలపర్స్ ✆ 98481 34126.

99 హౌసెస్ గల హౌసింగ్ కాలనీలో 200/ 254 చ॥గ॥లలో మీ ప్లాన్ ప్రకారం హౌసెస్ నిర్మించబడును. ఎయిర్‌పోర్ట్, HCL, L&T, IT పార్క్‌లకు సమీపమున కేసరపల్లిలో బ్యాంక్‌లోన్ సౌకర్యం కలదు. ✆ 92489 31111.

LAND FOR SALE

కృష్ణాజిల్లా నూజివీడు దగ్గర ముసునూరు గ్రామ పరిధిలో నల్లరేగడి ఆనుకొని బోరు వసతి గల 6 ఎకరముల మాగాణి భూమి అమ్మకమునకు కలదు. ఎక రేటు17 లక్షలు. ✆ 94906 36217.

పణుకూరు, పెనమలూరు మండలం, R.N.B. రోడ్డు ప్రక్కన, బందరురోడ్డుకి దగ్గరలో 1 ఎకరం, 60 సెంట్లు పొలం అమ్మబడును. సంప్ర: ✆ 99893 60614.

కృష్ణాజిల్లా జి.కొండూరు (మం) తెల్లదేవరపాడు (గ్రా). 1 ఎ॥ కానీ 2 ఎ॥ 65 సెంట్లుగాని మామిడితోట అమ్మబడును. బోర్, మోటారు కలవు.✆ 79974 37146, 94903 07146.

గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు అతిదగ్గరలో 60 సెంట్లు పొలం అమ్మకము. కావలసినవారు సంప్రదించండి. ✆ 90304 89489.

PLOT FOR SALE

మధ్యతరగతి వారు కోటీశ్వరులయ్యే మంచి అవకాశం. తక్కువ పెట్టుబడి ఎక్కువ భూమి 22 సెంట్లు 100 చ॥గ॥లు చెట్లు (పట్టాదారు పాస్‌బుక్‌తో) స్పాట్ రిజిస్ట్రేషన్ 6వ సం నుండి ఆదాయం 15 గ్రా॥ గోల్డ్‌ఫ్రీ. ✆ 88018 03689.

Kankipadu, Vijayawada: CRDA Aprvd. Plots: 143, 183, 200, 220, 234, 250 & 327 Sq.Yds @ Rs: 11,999/- Per Sq.Yd. Ph: 9959834503 & 9030262246.

విజయవాడ బందరోడ్డు, కంకిపాడు నందు CRDA ప్లాట్స్ ఇల్లుకట్టుకొనుటకు అనుకూలంగా బ్యాంక్‌లోన్ సౌకర్యంతో కలవు. ✆ 98481 83304.

మంగళగిరి నుండి రాజధాని వైపు గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో ప్లాట్లు, విల్లాలు, LEPL వారి సౌజన్యంతో శ్రీసిటీ ఫేజ్ -1,2,3, లోన్ సౌకర్యం. శ్రీసాయిప్రగతి ఇన్‌ఫ్రా & డెవలపర్స్. ✆ 99661 49858.

కృష్ణాజిల్లా, గన్నవరం గర్ల్స్ హైస్కూల్ దగ్గరలో 10 సెంట్లు ఇళ్లస్థలము (నార్త్ ఈస్ట్ కార్నర్ బిట్) అమ్మబడును. నో బ్రోకర్స్. ప్లీజ్ సంప్రదించండి: 93475 08464.

తేలప్రోలు సరోజినిదేవి ఇంజనీరింగ్ కాలేజ్ ప్రక్కన పద్మశ్రీ వెంచర్‌లో 278 చ.గ. N/E కార్నర్ ప్లాట్ అన్ని సదుపాయాలతో అమ్మకం ✆ 90304 89489.

గన్నవరం ఎయిర్‌పోర్ట్ వెనుక శుభగృహ వెంచర్‌లో N/E కార్నర్ 400 చ.గ. ప్లాట్ అన్ని సౌకర్యాలతో అమ్మకం. ✆ 90304 89489.

నంబూరు VVIT కాలేజ దగ్గర పంచాయతీ ప్లాట్లు 110 చ.గ.లు రూ. 5 లక్షలు & చెవిటికల్లు, నందిగామ హైవే ఆనుకొని CRDA LP No's గల ప్లాట్లు అమ్మకం. ✆ 99081 66858.

కంచనపల్లి: హార్ట్ ఆఫ్‌ది సిటీలో రెండు ఎకరాల్లో రాబోతున్న డూప్లెక్స్ విల్లాస్‌కి ఆనుకొని గజం 16 వేలకే అమ్మకం. 1000 గజాలు మాత్రమే. ✆ 94944 98809.

400 చ॥గ॥ ప్లాటు గోసాల to కంకిపాడు 200 అ॥ బందరురోడ్డు ఆనుకుని గోసాల చైతన్య టెక్నోస్కూల్ ప్రక్కన 400 చ॥గ॥లు అమ్మకం. ✆ 98487 14252

TO-LET

2 B/R 1st Floor D.No-297. Left Side V Lane, Veerakakani St, Srinivasa Nagar Bank Colony, Ring Road. ✆ 89784 58577.

పటమట 3rd ఫ్లోర్‌లో 2 రూములు అన్ని సౌకర్యాలతో అద్దెకు కలదు. బ్యాచిలర్, ఎంప్లాయిస్‌కు అనుకూలం. కోనేరువారి వీధి, Opp: సోనోవిజన్.✆ 93947 48101.

ఇళ్లు, అపార్టుమెంట్లు 2,3 B/R కమర్షియల్ ఆఫీస్ గోడౌన్స్ కావాలన్నా, ఇవ్వాలన్నా సం॥ శ్రీ సాధన రెంటల్ ఏజెన్సీ. ✆ 0866 - 2470680, 92464 77680.

WANTED

విజయవాడ టౌన్ మరియు పరిసర ప్రాంతాలలో ప్రముఖ చాయ్ బాబు చాయ్ 'టీ' అవుట్‌లెట్స్‌కి మంచి కమర్షియల్‌లో షాపులు అద్దెకు కావలెను. ✆ 93935 25252, 93930 40404.

JOBS

Ignis Careers Pvt Ltd., An English Training Frim is Recruiting Sales/ Marketing: 3 Years Exp. in School Related Business, Banking, Insurance Etc., Salary: 20K to 30K. Locations: Krishna, Guntur. Apply with CV/ Resume to hr@ignisca-reers.com, ✆ 9100778563/ 9989027755. (Call Between Mon-Sat 9.30 AM- 6 PM)

Lady Clerk to Work 10-7, Qua: Deg, Age: 25 Below, Sal: 7,000+1000/- Comn Cont with Originals. Rajiv Academy, VJA-10. ✆ 9392762257

Wanted Experienced Male RM's and Team Leaders Q: Degree / MBA Sal: 15k-30k+Incentive+ Bonus ✆ 98497 44553, 91821 70966.

సూపర్‌వైజర్స్ కావలెను. ప్రభుత్వరంగ సంస్థ కాంట్రాక్టర్ వద్ద లైట్ వెహికల్ (కార్) మెయింటెనెన్స్ చూసుకొనుటకు అనుభవం గలవారు కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 99121 26115.

కారు డ్రైవర్స్ కావలెను. ప్రభుత్వరంగ సంస్థ కాంట్రాక్టర్ వద్ద పనిచేయుటకు మంచి నడవడిక + LMV లైసెన్స్ + బ్యాడ్జి కలిగిన డ్రైవర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 99121 26115.

Domestic కాల్ సెంటర్‌లో పనిచేయుటకు స్త్రీ/పు 120 మంది కావలెను. Qly: 10 to PG. ✆ 98856 62957, 98856 63761. ఏలూరు రోడ్, VJA.

SNAP Advertising నందు గ్రాఫిక్ డిజైనర్ కావలెను. (2 సం. అనుభవం), snapcommunication@gmail.com ✆ 88974 96676.

BANSALS రెడిమేడ్ లేడీస్‌వేర్ షోరూమ్ నందు పనిచేయుటకు అనుభవం గల సేల్స్‌గర్ల్స్ కావలెను. జీతం: 10,000/- పైనే. బీసెంట్‌రోడ్, VJA. ✆ 98490 81159.

ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మేనేజర్స్, టెలికాలర్స్ కావలెను. (ఫ్రెషర్స్ కూడా అర్హులే. Age: 25 - 55. ✆ 98664 17445.

స్వగృహఫుడ్స్‌లో పనిచేయుటకు సేల్స్ గర్ల్స్, సేల్స్ బాయ్స్ కావలెను. Contact: స్వగృహఫుడ్స్, బందరురోడ్, విజయవాడ-10 ✆ 99498 45000.

స్వగృహఫుడ్స్‌లో పనిచేయుటకు కంప్యూటర్ బిల్లింగ్ ఆపరేటర్స్ కావలెను. అర్హత డిగ్రీ. ★ స్వగృహఫుడ్స్, M.G. రోడ్డు, VJA-10 ✆ 99498 45000.

Leading Financial Services Invites Retd/ Un Employed/ House Wives/ Businessmen. P/F Time. Earn upto 50K P.M. Age: 25-65. Q: Inter+ ✆ 84639 93595, 93932 12324.

E-Commerce Officer's for BBonline Solutions for Vijayawada, Gudivada, Nuzivid, Machilipatnam. Qul-Any Degree, 2-Y Exp/MBA-Freshers Attractive Sly+Incentives. Interview on 04,05,06 Jan. ✆ 80734 31658, 97664 34204.

Req Civil Eng(JR/SR) with 2 to 15 yrs Exp To work in Railway BGLINE Project. ✆ 82973 13335. E-mail:irpinfratech@yahoo.in.

Work from Home are you looking for PartTime Job. bbcpro.com ✆ 70957 80343, 72880 52346.

Wanted Lady Accountant with B.Com & Tally 3 Years Experience needed. Mail: fortunefeeds.com ✆ 88866 69436.

B.Sc/ M.Sc/ B.Pharmacy (QC)/ Lab Technicians/ Telecallers/ Front Office/ Cashier/ Banking/ Mechanical/ Stores/ Net Working. ✆ 0866-6641333.

Computer Operator Jobs for Freshers/ Females. Free Training, No Target, Direct Placement. Q: Inter/ Deg/ Diploma. ✆ 98481 89218.

స్త్రీ/పు కర్స్, టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్స్ ఏజెంట్స్ ఎగ్జిక్యూటివ్స్ మా బ్రాంచ్ నందు చేయువారు అర్హతను బట్టి జీతం, డిగ్రీ ఆపైన. రోజాజీ ✆ 94904 16355, 94401 57931.

రెడీమేడ్ షాపులో 2 సం.లు పైన అనుభవంగల కంప్యూటర్/ బిల్లింగ్ ఆపరేటర్, సేల్స్‌మెన్ M/F కావలెను. విజయ డ్రెస్సెస్, VJA. ✆ 98491 43822.

ఎలక్ట్రీషియన్స్, హెల్పర్స్ కావలెను. నెల జీతం లేక రోజువారి వేతనం SN పురం, గాంధీ కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రక్కన, VJA ✆ 95053 46392, 77939 66328

విజయవాడలోని లోన్స్ & బీమా కంపెనీలో స్త్రీ/పురుష అభ్యర్థులు కావలెను. Q: డిగ్రీ to PG, Age: 23 to 30, Sal: 11,000/- to 15,000/- ✆ 80745 99880.

విజయవాడ బందరురోడ్డు M&M షోరూం దగ్గర మున్సిఫ్స్ ఇంటిలో వంట చేయుటకు వంటమనిషి (F) పనిచేయుటకు పనిమనిషి (F) కావలెను. పనిబట్టి జీతం. ✆ 99893 50403.

హైదరాబాద్‌లోని ఇళ్ళల్లో 24 గం.లు వృద్ధులకు సేవచేయడానికి, పిల్లలను చూసుకోవడానికి 100 మంది ఆడ/మగవారు కావలెను. జీతం:10 వేలు. భోజనం+వసతి ఫ్రీ.✆ 7032025222

Jr. అకౌంటెంట్స్– 02, Tally నందు 2- 5 సం. అనుభవం & Sr. సివిల్ ఇంజనీర్ B.Tech/ M.Tech కలిగి అపార్ట్‌మెంట్స్ కన్‌స్ట్రక్షన్ రంగంలో 10 - 15 సం. అనుభవం. ✆ 94942 53749.

విజయవాడలో ప్రముఖ యాడ్ ఏజన్సీలో కోరల్‌డ్రా, అడోబ్‌ఇల్లస్ట్రేటర్, ఫోటోషాప్‌లలో 2 సం.ల అనుభవం కలిగిన గ్రాఫిక్ డిజైనర్ కావలెను. సం॥ ✆ 94914 14477.

వాటర్‌ట్యాంక్ నందు పనిచేయుటకు హౌస్‌కీపింగ్ (F), ఆఫీస్‌బాయ్, మార్కెటింగ్ (M) కావలెను. ఏలూరురోడ్, 100 అడుగులరోడ్, హిందూఆఫీస్ ప్రక్కన. ✆ 0866-2551955.

విజయవాడలోని ప్రైవేటు బ్యాంకులలో ఉద్యోగాలకు M/F కావలెను. ఖాళీలు: 18, జీతం: 18K - 22K, Q: ఇంటర్ - PG. ✆ 90590 23542, 90529 40550.

పటమట పంటకాలువ రోడ్డులో టెలిశాం ఆఫీస్ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ మరియు పికప్‌బాయ్స్ కావలెను. Q: ఇంటర్. ★ జీతం + ఇన్సెంటివ్. ✆ 92980 56789.

గన్నవరం దగ్గరలో ఉన్న స్కూల్‌లో పనిచేయుటకు 1st క్లాస్ అన్ని సబ్జెక్టులు చెప్పుటకు టీచర్ కావలెను. ✆ 89850 58168.

Children Homeలో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్ కావలెను. వయస్సు: 35 - 40. ✆ 89850 58168.

Walk In Interview ప్రకాశం జిల్లాలోని ప్రముఖ చిట్‌ఫండ్ నందు పనిచేయుటకు B.M, రికవరీ మేనేజర్, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. మరియు విజయవాడ H.O నందు చిట్‌ఫండ్ సంస్థనందు లీగల్ యాక్టివిటీస్ తెలిసిన లీగల్ ఆఫీసర్ & ఆఫీస్ బాయ్స్ కావలెను. ✆ 83675 56969.

ప్రముఖ సెక్యూరిటీ సంస్థలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్/ వాచ్‌మెన్ M/F వెంటనే కావలెను.✆ 70133 34507, 93999 91929.

హోమ్‌లోన్స్ అసోసియేట్ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు డిగ్రీ (or) ఇంటర్ (M) చదివి కంప్యూటర్ నందు అనుభవం ఉన్నవారు కావలెను. ✆ 98662 47581.

Airtel సంస్థ నందు పనిచేయుటకు టెలికాలర్స్ కావలెను. Opp. SBI, గాంధీనగర్, విజయవాడ. ✆ 99084 42541, 80997 77577.

రెడిమేడ్ మెన్స్‌వేర్ నందు మార్కెటింగ్ అనుభవం కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కర్నూలు జిల్లాలో పనిచేయుటకు కావలెను. సిద్ధ రెడిమేడ్స్ నంద్యాల, కర్నూలు జిల్లా. Cell: 93922 14856.

సెక్యూరిటీ మార్కెటింగ్‌లో 2సం॥ల అనుభవం, విజయవాడలో పనిచేయాలి. ఏదైనా డిగ్రీ, స్వంత వాహనం, మంచి జీతం, అలవెన్సులు, మొబైల్ సౌకర్యం, ఇన్సెంటివ్‌లు పొందవచ్చు. సురభి సెక్యూరిటీ సర్వీసెస్, విజయవాడ ✆ 7995599940

ఆంధ్రమేడ సేల్స్ & డిస్ట్రిబ్యూషన్ ప్రై.లి.కి లోన్స్ డిపార్ట్‌మెంట్ నందు పనిచేయుటకు టెలికాలర్స్ - (F), ఎగ్జిక్యూటివ్స్ - (M) కావలెను. మరియు నూజివీడు, గుడివాడ, గుంటూరులలో ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 93479 00192.

CNC ఆపరేటింగ్ & Artcam, Coreldraw అనుభవంగల యువకులు మరియు మార్కెటింగ్‌కి ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 0866 - 6570789.

ఐడిలో పనిచేయుటకు వాచ్‌మెన్ కుటుంబంతో నివాసముండుటకు కావలెను. వ: 40 సం॥ to 50 సం॥లలోపు. సంప్ర॥ ఆర్.కె. హైస్కూల్, కామకోటినగర్, విద్యాధరపురం, RTC వర్క్‌షాపు రోడ్డు, విజయవాడ. ✆ 98491 48241.

ప్రముఖ బ్యాంకు సంబంధిత సంస్థ విజయవాడలో పనిచేయుటకు ★ అనుభవం గల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 2 వీలర్ తప్పనిసరి. ✆ 90321 34222/ 90307 44999.

నాగార్జున సిమెంట్స్ కొండపల్లి నందు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం, 8 గం. డ్యూటీ+ OT. ఫ్రీ రూం. క్యాంటీన్ సదుపాయం, నో ఫీజు ✆ 70754 36284, 97035 02634.

TOURS & TRAVELS

గోవా, కర్ణాటక 20 క్షేత్రాల యాత్ర జనవరి 19న జనవరి 29న శిరిడీ+ 5 జ్యోతిర్లింగాలతో 21 క్షేత్రాలు, శివరాత్రికి రామేశ్వరం+ 30 క్షే॥ ఫిబ్రవరి 7న. ✆ 98662 46466.

కర్ణాటక టూర్ మైసూర్, శృంగేరి, కుక్కి, శ్రీరంగం 8 రో॥ 6800/- 27-1 వ॥బ॥ ★ కాశి మినిటూర్ 3 రో॥ కాశి, ప్రయాగ, సీతామడి, 3300/- వ॥బ॥ 31-1 & 22-2 సత్యసాయి టూరిజం 7674806567.

శబరిమలై యాత్ర 23 యాత్రలు, 9 రోజులు. భోజనం+ 2 పూటల టిఫిన్, రూ.4500, 9-1-18న బయలుదేరును. మాటూర్స్. ✆ 92488 08361, 97031 04453.

BOOK YOUR COLOUR CLASSIFIED

₹ 700/- (5 Lines)

BLACK & WHITE CLASSIFIED

₹ 600/- (5 Lines)

PH: 80087 09525 80080 12644 80087 09526

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం



ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

గ్రామాల అభివృద్ధికి 'దశ' దిశా నిర్దేశం

నక్షత్రాల మెరుపులతో ప్రగతి మలుపులు ✤ కలెక్టరు లక్ష్మీకాంతం

విజయవాడ సబ్‌కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధిని పది నక్షత్రాల (స్టార్‌ల) కొలమానంతో గుర్తించనున్నట్లు కలెక్టరు బి.లక్ష్మీకాంతం తెలిపారు. నగరంలోని తమ విడిది కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ గ్రామాల సంపూర్ణ అభివృద్ధికి, గ్రామీణుల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టే కార్యక్రమాలకు స్టార్ రేటింగు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. గ్రామంలోని అన్ని గృహాలకు మరుగు దొడ్డి ఉంటే ఒక స్టార్ కేటాయిస్తామన్నారు. అందరికీ విద్యుత్తు సౌకర్యం ఉంటే రెండు స్టార్లుగా గుర్తింపు ఉంటుందన్నారు. ఇలా వంట గ్యాస్, తాగునీటి కుళాయి, సాలిడ్ వేస్టు (డంపింగు యార్డు), రహదారుల అభివృద్ధి, ఫైబర్ నెట్, కుటుంబ కనీస ఆదాయం రూ.10 వేలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాల్లో ప్రగతి సాధిస్తే వరుసగా పది స్టార్ల రేటింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో రూ.850 కోట్లతో గ్రామాల్లో ఇంటింటికి కుళాయి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.



స్టార్ రేటింగు వివరాల పత్రాన్ని చూపుతున్న కలెక్టరు లక్ష్మీకాంతం

11న మెగా గ్రౌండింగు మేళా: ఈనెల 11 వ తేదీన జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మెగా గ్రౌండింగు మేళాను నిర్వహించనున్నట్లు కలెక్టరు తెలిపారు. రూ.1300 కోట్లతో ఉపకరణాలు, ఉపకార వేతనాలు, బ్యాంకు అనుసంధాన రుణాలు తదితరాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీస్తే మధు మేహ వ్యాధి గ్రస్తులు ఎక్కువగా ఉన్నట్లు తేలిందన్నారు. భౌతికంగా వ్యాయామం లేకపోవడం వల్ల ఈపరిస్థితి ఏర్పడిందని, ప్రతి వ్యక్తి ప్రతి రోజూ 9 వేల అడుగులు నడవాలన్నారు. ఇది మూడు కి.మీ. నడకతో సమానం అన్నారు. ఈక్రమంలో గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాసాధికారిత సర్వేలో ఉండి, అర్హులైన వారికి రేషను కార్డు రాకుంటే, మొబైల్ యాప్ ద్వారా పంపితే కార్డు వస్తుందన్నారు. గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో జన్మభూమి 1247 గ్రామసభలను నిర్వహించాల్సి ఉండగా, రెండు రోజుల్లో 240 గ్రామ సభలను నిర్వహించామన్నారు.

ఆర్థికేతర అంశాల పరిష్కారంలో మొదటి స్థానం: అర్జీల పరిష్కారంలో ముఖ్యంగా ఆర్థికేతర అంశాల అర్జీల పరిష్కారంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నట్లు కలెక్టరు తెలిపారు. 1,84,766 వినతుల్లో 1,84,482 వినతులను పరిష్కరించి 99.85 శాతంతో రాష్ట్ర స్థాయిలో జిల్లా ముందంజలో ఉందని వివరించారు. డ్వామా, డీఆర్డీఏ, పీఆర్, వంటి రంగాల్లో నూరు శాతం పురోగతి సాధించినట్లు వివరించారు.

'దళితులపై దాడులు ఆపాలి'

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు జరుగుతున్నాయని వైకాపా ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర ఛైర్మన్ మేరుగు నాగార్జున ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఎంజీ రోడ్డులోని వైకాపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రు, ప్రకాశం జిల్లా దేవరపల్లిలో జరిగిన సంఘటనలు మరచిపోకముందే విశాఖ జిల్లాలోని జెర్రిపోతులపాలెంలో దళిత మహిళను ఓ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, అతని కుమారుడు ఆదేశాల మేరకు వివస్త్రను చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో నిష్పక్షపాతంగా వ్యవహరించి నిందితులైన తెదేపాకు చెందిన నేతలు, కార్యకర్తలపై కేసులు నమోదు చేయడంతో ఏసీపీ లంకా అర్జున్‌ను ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా బదిలీ చేశారని అన్నారు. కర్నూలు జిల్లా నక్కలదిన్నెలో దళితులపై వివక్షా పూరితమైన చర్యలకు ఒడిగట్టారని అన్నారు. కర్నూలు జిల్లా కలెక్టర్, ఎస్పీలు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శించారు. గుంటూరు జిల్లా పెదగొట్టిపాడులో సైతం అగ్రవర్ణాలు దళితులపై దాడులు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా నాయకులు కాలే పుల్లారావు, బి.శ్రీనివాసారవు, తోకల శ్యామ్‌కుమార్, పి.రవి, చందన్, సుందరప్రసాద్, తిరుపాల్, ఎం.ప్రేమలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైకాపా ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర ఛైర్మన్ మేరుగు నాగార్జున

ఆన్‌లైన్‌లో గ్యాస్ సరఫరాదారుల ఎంపిక

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజల ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి పథకాలను పారదర్శకంగా అమలు చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టరు కోన శశిధర్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఎల్‌పీజీ పంపిణీదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా కంప్యూటరైజ్డ్ ఆన్‌లైన్ డ్రా కార్యక్రమం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జిల్లా సంయుక్త కలెక్టరు క్రితికా శుక్ల అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టరు మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హెచ్.పి. గ్యాస్ కంపెనీలకు సంబంధించి పంపిణీదారుల ఎంపికను కంప్యూటరైజ్డ్ ఆన్‌లైన్‌లో చేపట్టడాన్ని అభినందించారు. ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావు లేకుండా కలెక్టరేట్‌లోని నిక్ కేంద్రంలోని అంతర్జాలం ద్వారా చేపట్టారన్నారు. ఆన్‌లైన్ డ్రాలో పంపిణీదారులుగా ఎంపికైన వారు ప్రజలకు సకాలంలో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను చేరవేసినపుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన అందజేయటమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. గతంలో గ్యాస్ కోసం 20 కిలోమీటర్ల దూరం వరకు వెళ్లి సిలిండర్ తెచ్చుకునే వారని, ప్రజలకు అందుబాటులోకి గ్యాస్‌ను తెచ్చేందుకు మారుమూల ప్రాంతాల్లోనూ పంపిణీదారులను ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డీజీఎం మీరానాయర్ ఎల్‌పీజీ పంపిణీదారుల కంప్యూటరు ఆన్‌లైన్ డ్రా ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. కృష్ణా జిల్లా ఊటుకూరు కేంద్రానికి సంబంధించి ఆన్‌లైన్ డ్రా ద్వారా ఎంపిక చేశారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన 257 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 230 మందిని ఎంపిక చేశారు. సమావేశంలో హెచ్‌పీసీఎల్ డీజీఎం ఖాద్రీ, డీఎస్‌వో చిట్టిబాబు, ఆయా గ్యాస్ కంపెనీల అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మార్పీఎస్ ఉపవాస దీక్షలు

గాంధీనగర్ (విజయవాడ) న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ కోరుతూ మూడు రోజులుగా అలంకార్ ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ ఉపవాస దీక్షలు బుధవారంతో ముగిశాయి. సంఘం జాతీయ అధికార ప్రతినిధి దొండపాటి సుధాకర మాదిగ, కార్యదర్శి పరసా రామయ్యలు దీక్షా శిబిరాన్ని సందర్శించి దీక్షలను విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుత దీక్షలకు తెలంగాణ ప్రభుత్వం దీక్షలకు అనుమతివివ్వకుండా జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో తెరాస, తెదేపాలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. అధికారంలోకి వస్తే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని కేసీఆర్, వర్గీకరణ చేసి పెదమాదిగనవుతానని ఏపీలో చంద్రబాబు మోసపూరిత వాగ్ధానాలతో మాదిగలను మోసం చేశారని విమర్శించారు. ఉద్యమాన్ని అణచివేయడంలో ఇద్దరు ముఖ్యమంత్రులు నియంతల్లా వ్యవహరిస్తున్నారని చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా అఖిల పక్షాన్ని దిల్లీ తీసుకెళ్లి కేంద్రంపై వత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధికార ప్రతినిధి మానికొండ శ్రీధర్ మాదిగ, నాయకులు వైఎస్ రాజు, కోటా డానియేలు, దూడల నరసింహారావు, లింగాల నర్సింహులుమాదిగ, పి.చర్చిల్, ఎల్.వెంకటేశ్వరరావు, ఎం.వీరయ్య, చిట్టిబాబు, కాంపాటి వెంకటేశ్వరరావు మాదిగ, టోని, కె.సైదులు, ఏలియా, దూడల నర్సి, నారాయణ, మందా రాజు, వి.పృథ్వీ, వంశీ, వంగూరి వెంకన్న, మామిడి రాంబాబు, మురికిపూడి దాసు, మహిళా నాయకులు లంకా బుజ్జిమాదిగ, మాదాసు వాణి తదితరులు దీక్షల్లో పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గన్నవరం నుంచి విమానాలు బయలుదేరే వేళలు



ప్రాంతం	సమయం	ఏ రోజుల్లో
హైదరాబాద్	08:05	ప్రతి రోజు
హైదరాబాద్	8:25	ప్రతి రోజు
హైదరాబాద్	15:35	బుధవారం మినహా
హైదరాబాద్	16:30	బుధవారం మాత్రమే
హైదరాబాద్	17:35	శనివారం మినహా
హైదరాబాద్	18:35	శనివారం మాత్రమే
విశాఖపట్నం	12:30	ప్రతి రోజు
విశాఖపట్నం	18:40	బుధవారం మినహా
విశాఖపట్నం	20:05	బుధవారం మాత్రమే
తిరుపతి	15:30	బుధవారం మినహా
చెన్నై	12:35	ప్రతి రోజు
చెన్నై	15:25	ప్రతి రోజు
బెంగళూరు	7:55	ప్రతిరోజు
బెంగళూరు	8:20	ప్రతి రోజు
బెంగళూరు	20:10	ప్రతి రోజు
దిల్లీ	09:05	ప్రతి రోజు
దిల్లీ	17:20	ప్రతి రోజు
దిల్లీ	20:40	ప్రతి రోజు

- న్యూస్‌టుడే, విమానాశ్రయం (గన్నవరం)

5న జిల్లా బాడీ బిల్డింగ్ జట్టు ఎంపిక

విజయవాడ క్రీడలు: జిల్లా బాడీ బిల్డింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన రైల్వే స్టేషన్ సమీపంలోని ఆర్‌ఈ కాలనీలో జిల్లా బాడీ బిల్డింగ్ జట్లను ఎంపిక చేస్తామని ఆ సంఘం కార్యదర్శి తుమ్మల వరప్రసాద్ తెలిపారు. ఎంపిక పోటీలు జూనియర్, మాస్టర్స్, ఫిజికల్లీ ఛాలెంజ్డ్ విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. ఒక్కో విభాగంలో ఎనిమిది వెయిట్ కేటగిరీల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు ఫోన్ 86396 41948 నంబరుపై సంప్రదించాలన్నారు.

అమరావతి సమాచారం



ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై దుర్గగుడి అంతరాలయంలో వేకువజామున 4 నుంచి 5గంటల వరకు జగన్మాత దుర్గమ్మకు ఖడ్గమాల పూజ నిర్వహిస్తారు. స్థలాభావం కారణంగా టికెట్ రుసుం రూ.5,116 చెల్లించిన 12మంది భక్తులను మాత్రమే ఈ పూజకు అనుమతిస్తారు.

★ మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు లక్షకుంకుమార్చన, అష్టోత్తరం, సహస్రనామార్చన పూజలు చేస్తారు. ఒకటో అంతస్తులో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు గంగా, పార్వతీసమేత దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు శాంతి కల్యాణం నిర్వహిస్తారు.

★ దుర్గగుడి అంతరాలయంలో మధ్యాహ్నం 3.30గంటల నుంచి 4.30గంటల వరకు జగన్మాత దుర్గమ్మకు 102 బంగారు పుష్పాలతో రుత్వికులు స్వర్ణపుష్ప పూజ చేస్తారు. స్థలాభావం కారణంగా టికెట్ రుసుం రూ.2,500 చెల్లించిన 12 మంది భక్తులను మాత్రమే ఈ పూజకు అనుమతించనున్నారు.



రూ.300 దర్శనం టికెట్లు : జనవరి 9 నుంచి మార్చి 31వరకు అందుబాటులో ఉన్న మేరకు జారీ చేస్తారు.

కాటేజీలు : ఫిబ్రవరి 27వ తేదీ నుంచి మార్చి 31 వరకు అందుబాటులో ఉన్న మేరకు ఇవ్వనున్నారు.

అర్జిత సేవలు : మార్చి 5 వ తేదీకి గురువారం జారీ చేస్తారు.

ఈ దర్శనం కేంద్రాల్లో లభ్యమయ్యే సేవలు: కల్యాణం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్ర దీపాలంకరణ, విశేష పూజలు

గమనిక : దర్శనం, సేవ టికెట్లు పొందాలనుకునే భక్తులు ఆధార్, పాస్‌పోర్టు, పాన్ కార్డులలో ఏదో ఒకటి తమ వెంట తీసుకురావాలి.

★ రూ.300 టికెట్లు పొందాలనుకునే భక్తులు ఎంత మందైనా వారికి సంబంధించిన ఆధార్ పత్రాలు తీసుకుని ఒక వ్యక్తి వచ్చి తీసుకోవచ్చు.

★ సేవ టికెట్లు కావాల్సిన భక్తులు ప్రతి ఇద్దరికి ఒకరు విధిగా కేంద్రానికి రావాలి. ★ వాట్సాప్, చరవాణిలో ఉన్న గుర్తింపు పత్రాలు ఆమోదించరు.

★ **కేంద్రం తెరిచి ఉండే వేళలు :** సోమవారం నుంచి శనివారం వరకు, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 2 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు. ప్రతి మంగళవారం సెలవు.

-న్యూస్‌టుడే, లబ్బీపేట (విజయవాడ సిటీ)

స్వరాజ్యమైదాన్ రైతుబజారులో నిన్నటి ధరలు

విజయవాడ సబ్‌కలెక్టరేట్: వంకాయలు రూ.15/18, టమాట రూ.10, బెండ రూ.20, పచ్చిమిర్చి రూ.19, కాకర రూ.20, బీర రూ.26, కాలీఫ్లవర్ 8/10/12, క్యాబేజి రూ.14, క్యారెట్ రూ.43, దొండ రూ.18, బంగాళదుంప రూ.12, ఉల్లిపాయలు రూ.39, గోరుచిక్కుళ్లు రూ.20, దోస రూ.18, సొర రూ.7/8, పొట్ల రూ.10/8, అరటికాయ రూ.4/5, చామదుంప రూ.34, ములక్కాయ రూ.7/8, ఆకు కూరలు 3 కట్టలు రూ.5, కంద రూ.24, బీట్‌రూట్ రూ.22, కీర దోస రూ.12, బీన్స్ రూ.24, క్యాప్సికమ్ రూ.40, చింతకాయలు రూ.24, నిమ్మ (డజను) రూ.10/12, కొత్తిమీర కట్ట రూ.3/5, పుదీనా రూ.3/5, ముల్లంగి రూ.5, పచ్చిమామిడి రూ.22/20, అల్లం రూ.32. **గమనిక:** పటమట, కేదారేశ్వర పేట రైతుబజార్లలో కూడా ఇవే ధరలు వర్తిస్తాయి.



2 కంట్రీస్.. స్వర్ణ ప్యాలెస్, అలంకార్, నీలిమ, వెంకటేశ్వర డీలక్స్ (పాయకాపురం), దుర్గామహల్, రామచంద్ర (కంకిపాడు), **జ్యూమాంజి (తెలుగు)..** శైలజ, నవరంగ్, శకుంతల, **ప్రాజెక్ట్ Z..** జయరాం, వెంకటేశ్వర ప్యాలెస్, **ఒక్క క్షణం..** వెంకట స్వర్ణ ప్యాలెస్, కపర్థి, శ్రీనివాస మహల్, రాఘవేంద్ర, స్వర్ణలక్ష్మి (పాయకాపురం), రాంగోపాల్, విజయలక్ష్మి (కానూరు), శ్రీనివాస (పోరంకి), శ్రీచంద్ర (కంకిపాడు), శివకృష్ణ (కొండపల్లి), **హలో..** అన్నపూర్ణ, రాజకుమారి, బాలాజీ సినివిల్లా (పోరంకి), స్వర్ణ (ఇబ్రహీంపట్నం), **ఎం.సి.ఎ. (మిడిల్ క్లాస్ అబ్బాయి)..** అప్సర, సౌమ్య, స్వాతి, వినాయక్, వెంకట కృష్ణ (పోరంకి), విజయలక్ష్మి (కంకిపాడు), బాలాజీ (ఇబ్రహీంపట్నం), **టార్జాన్..** కళ్యాణచక్రవర్తి, **ఖాకీ..** రామకృష్ణ,

రవీంద్రసినిమాస్ (పాయకాపురం): 2 కంట్రీస్, ఒక్క క్షణం, హలో. ఎం.సి.ఎ. (మిడిల్ క్లాస్ అబ్బాయి)..

జి3 - రాజ్, యువరాజ్: 2 కంట్రీస్, ఒక్క క్షణం, హలో, ఎం.సి.ఎ. (మిడిల్ క్లాస్ అబ్బాయి).. మీరజ్ సినిమాస్ (గాంధీనగర్): జ్యూమాంజి (తెలుగు), 2 కంట్రీస్, ఒక్క క్షణం, హలో, ఎం.సి.ఎ. (మిడిల్ క్లాస్ అబ్బాయి),

క్యాపిటల్ సినిమాస్ (బెంజిసర్కిల్): 2 కంట్రీస్, COCO (3D ఇంగ్లీషు), ఒక్క క్షణం, మళ్లీ రావా.. హలో, జ్యూమాంజి (3D ఇంగ్లీషు, తెలుగు), ఎం.సి.ఎ. (మిడిల్ క్లాస్ అబ్బాయి), ది గ్రేటెస్ట్ షోమాన్ (ఇం.), ప్రాజెక్ట్ Z, టైగర్ జిందాహై (హిందీ).. Y. Screens: (బస్టాండ్): 2 కంట్రీస్, ఒక్క క్షణం, హలో, ఎం.సి.ఎ. (మిడిల్ క్లాస్ అబ్బాయి)

కాలువలో జారిపడి వ్యక్తి మృతి

రామవరప్పాడు(విజయవాడ గ్రామీణం), న్యూస్‌టుడే : కాలు జారి కాలువలో పడిన వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రామవరప్పాడులో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ప్రసాదంపాడు పురుషోత్తమనగర్‌కు చెందిన వల్లభాపురం బాలాజి(28) ఆటోనగర్‌లో మెషిన్ ఆపరేటింగ్ పని చేస్తుంటాడు. ఇతనికి ఒక భార్య, ఇద్దరు పిల్లలు. ప్రతి రోజులానే మంగళవారం ఉదయం పనికి వెళ్లాడు. రాత్రి ఎంత సేపటికీ రాకపోవటంతో కంపెనీ యజమానికి భార్య ఫోన్ చేసి అడిగారు. యజమాని మాత్రం ఉదయం 11గంటలకు కంపెనీలో కరెంటు పోయిందని(షట్‌డౌన్) కావడంతో అప్పుడే వెళ్లిపోయాడని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు రాత్రి అంతా బాలాజీ కోసం గాలించారు. రాత్రి ఒక వ్యక్తి రామవరప్పాడు రైవస్ కాలువ గట్టు వద్ద కూర్చున్నాడని బుధవారం ఉదయం బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు గ్రామాధికారులను సంప్రదించారు. వారి సహాయంతో ఈతగాళ్లతో వెతికించగా రామవరప్పాడు వంతెన సమీపాన రైవస్ కాలువలో బాలాజీ శవమై తేలాడు. మృతదేహం అతనిదేనని కుటుంబ సభ్యులు నిర్ధారించారు. బాధితులు గుండెలవిసేలా రోధించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కాలు జారి పడటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు తెలపడంతో పటమట పోలీసులు నిర్ధారించి కేసు నమోదు చేశారు.

మహిళ ఆత్మహత్య

గుడివాడ, న్యూస్‌టుడే : మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుల కథనం ప్రకారం శ్రీరాంపురంలో నివాసముండే శివాజీరాజుకు తలసాని లక్ష్మి (45)గత కొంతకాలంగా వంటచేసి పెడుతోంది. లక్ష్మికి భర్త చనిపోవడంతో ఆమె వంటచేసి పెడుతూ జీవనం సాగిస్తుంది. గత కొంతకాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతూ ఆమె మద్యానికి బానిస అయింది. ఈ క్రమంలో బుధవారం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకుంది. ఒకటో పట్టణ ఎస్సై గౌతమ్‌కుమార్ ఈ మేరకు కేసు నమోదు చేశారు.

చోరీలకు పాల్పడే ఇద్దరి అరెస్ట్

ఆకివీడు, న్యూస్‌టుడే: తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు సభ్యుల ముఠాను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆకివీడు మండలం దుంపగడప గ్రామానికి చెందిన పులవర్తి లీలాసాయిగుప్తపై గతంలో కృష్ణాజిల్లా కైకలూరు గ్రామీణ, ఆకివీడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు కేసులు నమోదయ్యాయి. ఇతను ఆకివీడుకు చెందిన బొల్లా అభిరామ్‌తో పరిచయం పెంచుకుని, సులువుగా డబ్బు సంపాదించాలనే దురాశతో తాళం వేసి ఉన్న ఇళ్లలో రాత్రి సమయాల్లో దొంగతనాలకు పాల్పడుతూ వచ్చారు. విజయవాడ నగరంలోని సత్యనారాయణపురం, మాచవరం, కృష్ణా జిల్లా వీరవల్లి, పశ్చిమగోదావరి జిల్లా పెదపాడు, ఉండి, పాలకోడేరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగిలించిన సొత్తును విజయవాడ చిట్టినగర్, ఆకివీడులోని మణప్పురం సంస్థలో, దుంపగడపలోని లీలా సాయిగుప్త తల్లి పులవర్తి భాగ్యవెంకటలక్ష్మీ ఇంట్లో దాచారు. బంగారం, వెండిని అమ్మేందుకు భీమవరం వెళుతుండగా.. పోలీసులు సాయిగుప్త, అభిరామ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10లక్షల విలువజేసే సుమారు 25 కాసుల బంగారం, మూడు కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

శాంతియాత్రలో ఉద్రిక్తత

❖ అనుమతి నిరాకరణతో ఆగ్రహించిన ముస్లిం సోదరులు ❖ పోలీసుల పహారాలో కొనసాగిన ప్రదర్శన

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ముస్లిం సంఘాలు ఇచ్చిన శాంతి-సద్భావన యాత్ర ఎంజీ రోడ్డుపై నిర్వహించేందుకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఇరువర్గాల మధ్య తోపులాటకు దారితీసింది. ఇందులో భాగంగా ముస్లింలు ఎంజీ రోడ్డులోకి ప్రవేశించి సబ్ కల్క్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అది ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు దగ్గర నూరాని మసీదులో మత గురువు మౌజన్‌ను హత్య చేసినందుకు నిరసనగా నగరానికి చెందిన ముస్లిం సంఘాలు ప్రతినిధులు శాంతియాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సీపీ గౌతంసవాంగ్ నుంచి అనుమతి తీసుకున్నారు. బుధవారం బెంజిసర్కిల్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుండగా ఎంజీ రోడ్డులోకి వెళ్లడానికి అనుమతి లేదని పోలీసులు ఆపివేశారు. పిన్నమనేని పాలీక్లినిక్ రహదారి మీదుగా సబ్ కలెక్టరేట్ వరకు వెళ్లాలని సూచించారు. దీంతో ర్యాలీ పాలీక్లినిక్ రహదారిలోని మదర్‌థెరెసా జంక్షన్ కూడలి వరకు వచ్చింది. ఎంజీ రోడ్డులోకి అనుమతి ఇవ్వాలని కోరుతూ ముస్లింలు అక్కడ బైఠాయించి ఆందోళన నిర్వహించారు. సమాచారం అందుకున్న డీసీపీ కాంతిలాల్ రాణా ఆ ప్రాంతానికి వచ్చి ముస్లిం సంఘాల ప్రతినిధులతో చర్చించారు. ఈ సమయంలో ముస్లింలు అక్కడి నుంచి టిక్కిల్ రహదారిలోకి వెళ్లుతుండగా పోలీసులు అడ్డగించారు. వారిని తోసుకుని సైతం ముందుకు వెళ్లారు. కొంత దూరం వెళ్లిన తర్వాత రోడ్డుకు అడ్డంగా పోలీస్ వాహనాలను నిలిపారు. ఆగకుండా ముందుకు కదలడంతో డీవీ మానర్ సమీపంలో ప్రత్యేక బృందం వచ్చి రోప్‌వే వేశారు. వాటిని తొలగించుకొని ఎంజీ రోడ్డులోకి ప్రవేశించారు. దీంతో ఆ మార్గం వైపు వాహనాలు రాకుండా పోలీసులు ఆపించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సబ్ కలెక్టరేట్ వరకు కొనసాగిన ర్యాలీ వెంట డీసీపీ, ఏసీపీలు సత్యానందం, టి.నాగరాజు, కె.శ్రీనివాసరావు, సీఐ ఉమామహేశ్వరరావుతో పాటు పలువురు సీఐ, ఎస్ఐలు, ప్రత్యేక బలగాలు తోడ్కొని వెళ్లారు. అత్యధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ముస్లిం-హిందూ భాయ్‌భాయ్, అందరం భారతీయులం అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. సబ్ కలెక్టరేట్‌లోకి ఏవో పాషాకు వినతిపత్రాన్ని అందజేశారు.



రోప్‌వేను దాటుకొని వస్తున్న ముస్లింలు



ఎంజీ రోడ్డులో ముస్లిం శాంతి-సద్భావన ర్యాలీ

సమగ్రంగా దర్యాప్తు చేయాలి

మౌజన్ హత్యకు సంబంధించి సమగ్రంగా విచారణ చేసి నిజమైన దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజయవాడ పీస్ కమిటీ కన్వీనర్ ఫారుఖ్ షుబ్లీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జమాతీ ఇస్లామీ హిందూ మీడియా సెక్రటరీ మహ్మద్ అక్బర్ బాషా మాట్లాడుతూ మతాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలాగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. శ్రీవెంకటేశ్వర యోగి గురూజీ మాట్లాడుతూ అందరం సోదరభావంతో ఉంటూ ప్రశాంతంగా ఉంటున్న ఈ రాష్ట్రంలో ఈ ఘటన చోటుచేసుకోవడాన్ని ఖండించారు. జ్యుడిషియల్ విచారణ చేయాలని ముస్లిం ఐక్యవేదిక కార్యాచరణ సమితి అధ్యక్షుడు షేక్ మునీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముక్తార్ అలీ, ముస్లిం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఇస్మాయిల్, మాజీ మైనార్టీ ఛైర్మన్ సుబాని ఖాన్ పాల్గొన్నారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: సొంతింటి కల నెరవేరాలంటే చేయాల్సిన దానాలు?, వాస్తురీత్యా విద్యుత్ ఉపకరణాలు ఏ దిశలో ఉండాలి?, 08-30: టాలీవుడ్ టైమ్స్, 09-00: ఈనాడు సినిమా: ఆడదే ఆధారం (సీత, విసు).

మధ్యాహ్నం

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'వంకాయ ఉలవకారం', మీ చేతివంట 'పన్నీర్ చెనా కర్రీ', 'ఆలూ పాలక్‌రైస్', జస్ట్ ఎ మినిట్ 'కాజూ గోబీపకోడి' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జీన్స్-2 (రిపీట్), 06-00: ఒకరి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ – సూపర్‌హిట్ కామెడీ షో, 10-30: జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం

11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 డీజే రిపీట్
01:15 స్టే..పూలిష్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 నా షో నా ఇష్టం రిపీట్

సాయంత్రం

04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 టాప్స్
10:00 కిర్రాక్ కిడ్స్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస - బ్రహ్మకుమారి (ఉ.6:00, రా.11:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.6:00, రా.10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.6:30, రా.10:00)
- ★ అమృతం: డైరీ డిలైట్స్ (ఉ.8:00, మ.12:30, రా.8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.1:00, రా.8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ.1:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు ఆడుకునే బొమ్మలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు (ఉ.9:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా? (మ.2:00, రా.7:00)
- ★ సుఖజీవనం (ఉ.10:00, మ.2:30, రా.9:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. చెడు అలవాట్లు - కీళ్ల నొప్పులు, 2. నొప్పి నివారణ మాత్రలు - వాస్తవాలు, 3. చెవిలో శబ్దాలు (ఉ.10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (మ.3:00, రా.9:00)
- ★ డా. ఈటీవీ: క్యాన్సర్ కేర్ (ఉ.11:00)
- ★ డా. ఈటీవీ: దంత సంరక్షణ (ఉ.11:15)
- ★ డా. ఈటీవీ: అజీర్తి సమస్యలు (మ.3:30, రా.7:30)
- ★ డా. ఈటీవీ: జనరల్ హెల్త్ (మ.3:45, రా.7:45)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలిషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: ఇద్దరు కొడుకులు (శోభన్‌బాబు, రాధ) 10-00: మార్నింగ్ షో: నిత్యాకల్యాణం పచ్చతోరణం (చలం) **మధ్యాహ్నం:** 1-00: మాట్నీ: దొంగమొగుడు (చిరంజీవి, రాధిక) **సాయంత్రం:** 4-00: ఈవినింగ్ షో: ఒక సినిమాకథ (రాజేంద్రబాబు) **రాత్రి:** 7-00: ఫస్ట్ షో: వాడె వీడు (ఎన్టీఆర్, మంజుల) 10-00: ప్రముఖ దర్శకుడు పి.సి.రెడ్డితో గుర్తుకొస్తున్నాయి... (రెండవ భాగం).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కీన్వ కాబూలినా టిక్కీ & జుకిని మిల్లెట్ మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మసాలా ఎన్నగై, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - సగ్గుబియ్యం టిక్కీస్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - బ్రొకోలి సూప్, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - జొన్న రొట్టె & పండుమిరపకాయ పచ్చడి, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్డ్ వెజ్ సాగూ, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - చెనా ఘూర్ గరం, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ (మొగలై స్టైల్) - బెండకాయ మటన్ కర్రీ, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - మేతి బార్లీ సూప్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ బిర్యానీ & పాలక్ ఈడ, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) వంకాయ బజ్జీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - మటన్ ఖీమ బిరానీ రైస్ & గోంగూర మటన్, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - టమాటో అటుకులు, మ.2.45, రా.10.30: కారాలు, పొడులు - ఉసిరి కారం & రాగి తీపి అట్టు పొడి, మ.3.30: భళా మిస్టర్ బ్రహ్మచారి - చికెన్ ఫ్రైడ్ రైస్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ⁰, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 ⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, అలంపురం, పశ్చిమ గోదావరి జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 ⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, గంగారం, వికారాబాద్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 04-01-2018

SVBC TTD — **ఉదయం:** 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడ సేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకువేళాయె - దత్తాత్రేయస్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, **సాయంత్రం:** 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు నేను.. నా.. స్వామి, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - రామేశ్వరలక్ష్మణేశ్వర దేవస్థానం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాల కృష్ణమాచార్యులు.

భక్తి TV — **ఉదయం:** 6-00 శ్రీసాయి హారతి, 6-30 సద్గురుస్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 8-00 పుణ్యక్షేత్రం, 8-30 జ్యోతి స్వరూపా అయ్యప్ప, 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 4-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనకధారస్తోత్రం, 5-30 సాయిగీతామృతం, 6-00 సద్గురుస్తోత్రం, 7-00 భక్తివిశేషాలు,7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగవద్గీత 9-00 దుర్గాసప్తశతి, 9-30 మహాభారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11-00 గోదామృతం.

ZEE తెలుగు — **ఉదయం:** 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్, 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: నాగవల్లి 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్ 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 కల్యాణ వైభోగం (రిపీట్), **సాయంత్రం:** 04-00 బిగ్ సెలబ్రిటి చాలెంజ్ ఇంటర్‌నేషనల్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్),11-00 బిగ్ సెలబ్రిటి ఛాలెంజ్ ఇంటర్‌నేషనల్ (రిపీట్).

MAA — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: చంద్రలేఖ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: యమదొంగ, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్రబంధం, 10-00 నీలికలువలు, 10-30 దసరా వచ్చిందయ్య (రిపీట్).

GEMINI — **ఉదయం:** 06-00 టెలిషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: దేవుళ్లు, 11-30 నాగిని -2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: ఆ నలుగురు, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: ఆర్య.

HBO — **ఉదయం:** 06-00 స్టార్ ట్రెక్ 2: ది రాత్ ఆఫ్ ఖాన్, 07-56 ది కరాటే కిడ్ పార్ట్ 2, 09-59 బ్యాక్ టు ది ఫ్యూచర్ పార్ట్ 3, **మధ్యాహ్నం:** 12-03 మ్యాన్ ఆఫ్ స్టీల్, 02-27 పుష్ ఇన్ బూట్స్, **సాయంత్రం:** 04-03 వే ఆఫ్ ది డ్రాగన్, 5-53 ది డిక్టేటర్ **రాత్రి:** 07-08 ది లాస్ట్ ఎయిర్‌బెండర్, 09-00 కుంగ్ ఫూ పాండా 2, 10-40 పాల్.

ప్రజాసంతృప్తిలో జిల్లా మొదటి స్థానం: కలెక్టర్

విజయవాడ సబ్‌కలెక్టరేట్, న్యూస్‌టుడే: జన్మభూమి-మాఊరు గ్రామ సభల నిర్వహణ, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రజల సంతృప్తి 72 శాతానికి సాధించి రాష్ట్రంలో మొదటి స్థానం సాధించినట్లు కలెక్టరు బి.లక్ష్మీకాంతం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల రెండో తేదీ నుంచి ఆరంభమైన జన్మభూమి సభల్లో సంక్షేమం, సంతృప్తి, ఆరోగ్యం, ఆనందం అనే అంశాలను ప్రజల్లో తీసుకెళ్లి ప్రజాసంతృప్తి శాతాన్ని పెంచామని కలెక్టరు వివరించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చేయండి.. జన్మభూమి సభల్లో ప్రభుత్వ మార్గ దర్శకాల ప్రకారం ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేలా క్షేత్ర స్థాయి అధికారులు కృషి చేయాలని నగరంలోని విడిది కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం నిర్వహించిన టెలీకాన్ఫరెన్సులో కలెక్టరు సూచించారు. ప్రజలు సంతృప్తి చెందేలా వారికి ఇవ్వనున్న పింఛన్లు, రేషను కార్డులకు సంబంధించిన ఉత్తర్వులను అందించాలన్నారు. అదే విధంగా ఓడీఎఫ్, ఆరోగ్య సేవలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో లబ్ధిపొందిన వారితో వారి అనుభవాలను గ్రామ సభల్లో తెలిపేలా ప్రత్యేకాధికారులు చూడాలన్నారు.


కలెక్టరు లక్ష్మీకాంతం

విజయవాడలో ఈనాడు

గవర్నరుపేట, న్యూస్‌టుడే: గురువారం ఉదయం 10 గంటలకు మహాత్మాగాంధీరోడ్డులోని శేషసాయి కళ్యాణమండపంలో ఫుడ్ ప్రాసెసింగ్-2018 ప్రదర్శన, సదస్సు ప్రారంభం.

★ ఉదయం 11 గంటలకు గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో 'నవ్యాంధ్రప్రదేశ్ సాంస్కృతిక రంగం-సమస్యలు' అనే అంశంపై కళాసంస్థలు, కళారంగ ప్రముఖులతో రౌండ్‌టేబుల్ సమావేశం

★ మధ్యాహ్నం 2 గంటలకు గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో దళిత బహుజన రిసెర్చ్ సెంటరు సమావేశం

★ సాయంత్రం 6 గంటలకు గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శ్రీ నివేదిత సంక్షేమ సంఘం సమావేశం.

★ **విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే:** సంగీత సన్మండలి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వేంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో జరుగుతున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో

★ ఉదయం గం.9లకు పి.హేమలక్ష్మి (నెల్లూరు) వీణ కచేరీ

★ ఉదయంం గం.9.20 నుంచి ఈదర లోకేశ్వర్, పి.కృష్ణరోహిత్, ఎన్.భవ్యశ్రీ గీతిక, పి.శ్రీహంసిని, డి.మౌనిక, కె.లక్ష్మీనరసమ్మ గాత్ర కచేరీలు

★ ఉదయం గం.10లకు ఎస్.గౌరీశంకరశాస్త్రి వీణ కచేరీ

★ సాయంత్రం గం.5లకు ఎన్.సి.సాహితి, కె.అలేఖ్య, కె.మాధవి, ఎల్.తేజస్విని, ఉప్పులూరి సాత్విక, పి.గాయత్రి గౌరీనాథ్ గాత్ర కచేరీలు

★ రాత్రి గం.7లకు అయ్యగారి సత్యప్రసాద్, రాజ్యలక్ష్మి వీణద్వయం

★ రాత్రి గం.8ల నుంచి సి.వి.పి.శాస్త్రి, మల్లాది సోదరుల గాత్ర కచేరీ

స్వరాజ్యమైదానంలో జరుగుతున్న పుస్తకమహోత్సవంలో

★ సాయంత్రం గం.4లకు గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్ నుంచి స్వరాజ్యమైదానం వరకు పుస్తకప్రియుల పాదయాత్ర. ప్రారంభకులు భూమా అఖిలప్రియ, భాషా, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి

★ సాయంత్రం గం. 6.30లకు డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ టాక్‌షో

★ రాత్రి గం.8లకు 'సోరెస్స్ అఫ్ హిస్టరీ ఆఫ్ తెలుగూస్' పుస్తకావిష్కరణ. ఆవిష్కర్త: మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి

నగరంలో నేటి జన్మభూమి గ్రామ సభల వివరాలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలోని మూడు సర్కిళ్ల పరిధిలో జన్మభూమి సభలు నోడల్ అధికారుల ఆధ్వర్యంలో గురువారం జరగనున్నాయి. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 29వ డివిజన్ పరిధిలోని లేబరు కాలనీ జీఎస్ఆర్ పాఠశాల ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుంది. ఇక అదే నియోజకవర్గం పరిధిలోని 39వ డివిజన్లో గాంధీజీ మున్సిపల్ పాఠశాల ప్రాంగణంలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు జరుగుతుంది.

★ మధ్యనియోజకవర్గ పరిధిలోని 52వ డివిజన్ రాజరాజేశ్వరీపేట వాటర్ రిజర్వాయరు వద్ద ఉదయం 9 నుంచి 11 గంటల వరకు జన్మభూమి గ్రామసభ జరుగుతుంది. 54వ డివిజన్ అజిత్‌సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు గ్రామసభ జరుగుతంది. ఇక 5వ డివిజన్ పరిధిలోని మాచవరం ఎస్ఆర్ఆర్అండ్ సీవీఆర్ కళాశాల ప్రాంగణంలో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు గ్రామ సభ జరుగుతుంది.

★ తూర్పు నియోజకవర్గం పరిధిలోని 11వ డివిజన్లోని తోటవారివీధి కమ్యూనిటీ హాలులో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు గ్రామసభ జరుగుతుంది. 16వ డివిజన్ సిమెంట్ గోడౌన్ రాణిగారితోట వద్ద ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జన్మభూమి గ్రామసభ జరగనుంది. గ్రామ సభలను సంబంధిత నియోజవర్గాల పరిధిలోని టీం లీడర్లు, స్థానిక కార్పొరేటర్లు నిర్వహించి స్థానిక ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరిస్తారు.

క్రమశిక్షణే ఉన్నతికి సోపానం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో క్రమశిక్షణే ఉన్నతికి సోపానమని ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ పాఠశాల 41వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎల్.ఎస్.రాంబాబు మాట్లాడుతూ వివిధ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు సాధిస్తున్నారని పేర్కొన్నారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, సెక్రటరి పాలడగు లక్ష్మణరావు, కోశాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, కన్వీనర్ పి.ప్రభాస్, డాక్టర్ నాగేశ్వరారవు, వైస్ ప్రిన్సిపల్ లతా కుమారి తదితరులు పాల్గొన్నారు. చదువు, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాలలో 25 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఉపాధ్యాయులు అనురాధ, బీఎల్ మోహన్‌లను సత్కరించారు. విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కూరగాయలు తింటేనే ఆరోగ్యకరంగా ఉంటామనే సందేశాన్ని ఇచ్చారు.



మాట్లాడుతున్న ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు

విమానాశ్రయంలో తుపాకీ కలకలం

విమానాశ్రయం (గన్నవరం), న్యూస్‌టుడే : గన్నవరం విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడి సంచిలో తుపాకీ ఉండటం కలకలం సృష్టించింది. సేకరించిన వివరాల మేరకు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే అన్న కొడుకునని చెబుతున్న ఆ యువకుడు (19) పుణెలో చదువుకుంటున్నాడు. అక్కడికి వెళ్లేందుకు బుధవారం కారులో విమానాశ్రయానికి వచ్చాడు. 5:15 గంటలకు హైదరాబాద్ వెళ్లే ఎయిర్ ఎండియా విమానానికి టిక్కెట్ బుక్ చేసుకున్నాడు. సామగ్రి తనిఖీల విభాగంలో సిబ్బంది పరిశీలించగా.. అతని బ్యాగ్‌లో తుపాకీ ఉండటాన్ని గుర్తించారు. వెంటనే తుపాకీని స్వాధీనం చేసుకుని, యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అది ఎయిర్ గన్ అని పోలీసుల విచారణలో యువకుడు తెలిపాడు. తుపాకీ నిర్ధారణకు విజయవాడ నగర పోలీస్ కమిషనరేట్ ఆయుధ భాండాగర కేంద్రానికి పంపారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అన్న కొడుకు కావటంతో ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచినట్లు సమాచారం. ఆ తుపాకీ నిజమైనదేనా, చదువుకోసం వెళ్లే యువకుడి వద్ద అది ఎందుకు ఉంటుందనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై 'ఈనాడు' బృందం వివరణ కోరేందుకు విజయవాడ నగర ఈస్ట్‌జోన్ ఏసీపీ, విమానాశ్రయం ఏసీపీలను ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులో లోకిరాలేదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు తాడేపల్లి ప్రకాష్‌నగర్‌కు చెందిన ముత్యాల దుర్గారావు(55) కబ్‌బోర్డులు పని చేస్తుంటాడు. ఇందిరానాయక్‌నగర్‌లోని పనులు ముగించుకుని అజిత్‌సింగ్‌నగర్‌లో నివసిస్తున్న కుమారుడు వద్దకు బుధవారం మధ్యాహ్నం పైపులరోడ్డు నుంచి జక్కంపూడికి వెళ్లే అంతర్వలయ రహదారిలో రాంగ్‌రూటులో సైకిల్‌పై వస్తుండగా లారీ వెనుక భాగం తలిగింది. దీంతో అక్కడిక్కడే పడి తీవ్రగాయాలపాలయ్యాడు. అతడ్ని 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'వైకాపా దిగజారుడుతనానికి నిదర్శనం'

విజయవాడ క్రీడలు: ధార్మిక సంస్థలను కూడా రాజకీయ స్వార్థానికి వేదిక చేసుకోవడం వైకాపా దిగజారుడుతనానికి నిదర్శనమని శాప్ మాజీ ఛైర్మన్, శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ ఛైర్మన్ పీఆర్‌మోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయంలో జరిగిన ఘటనపై ఓ వైపు ప్రభుత్వ విచారణ కొనసాగుతుండగా.. ప్రతిపక్ష వైసీపీ నేతలు ధార్మిక సంస్థలను కూడా తమ స్వార్థ రాజకీయానికి వేదిక చేసుకోవాలని ఆరాటపడడం దారుణమన్నారు.

వెంటనే నీరందించండి లేకుంటే అరెస్టు చేయిస్తాం

గుత్తేదారు ప్రతినిధిపై ప్రత్యేకాధికారి ఆగ్రహం

ఐనవోలు(తుళ్లూరు): నెల రోజులుగా గ్రామంలో మంచినీరు సరఫరా లేదు..ఎన్టీఆర్ సుజల స్రవంతి ఉంది కాబట్టి సరిపోతోంది. అది కూడా లేకుంటే జనం ఏం తాగాలి. తక్షణమే పైపులైన్‌కు మరమ్మతులు చేయించి గ్రామస్థులకు మంచినీరు అందించండి. లేదంటే అరెస్టు చేయించేందుకు వెనకాడమంటూ తాడికొండ నియోజకవర్గ జన్మభూమి కార్యక్రమ ప్రత్యేక అధికారి లక్ష్మీనరసింహం గుత్తేదారు సంస్థ ప్రతినిధిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తుళ్లూరు మండలం ఐనవోలు గ్రామంలో బుధవారం జన్మభూమి గ్రామ సభ జరిగింది. రాజధాని నిర్మాణ పనులను చేజిక్కించుకున్న సంస్థ లారీలు రాకపోకలు సాగిస్తుండటం వల్ల గ్రామానికి వచ్చే తాగునీటి పైపులను దెబ్బతిన్నాయని, దీంతో తాగునీటికి కటకట ఏర్పడిందని ప్రజలు విన్నవించారు. ఇది విన్న ప్రత్యేకాధికారి గుత్తేదారు సంస్థకు చెందిన ప్రతినిధిని పిలిపించారు. తక్షణమే తాగునీటి సమస్యకు కారణమైన పైపులైనుకు మరమ్మతులు చేయించాలని, లేదంటే మీపై ఇప్పటికే ఉన్న క్రిమినల్ కేసులను అమలు చేస్తూ ...అరెస్టు చేయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, సర్పంచి వలపర్ల జ్ఞానానందం, జడ్పీటీసీ సభ్యుడు బెజవాడ నరేంద్రబాబు, ఎంపీపీ వడ్లమూడి పద్మలత, తాడికొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ బెల్లంకొండ నరసింహారావు పాల్గొన్నారు.

పాఠశాల బస్సు - లారీ ఢీ

విద్యార్థికి, బస్సు డ్రైవర్‌కి తీవ్ర గాయాలు

కనుమూరు(గ్రామీణ పామర్రు), న్యూస్‌టుడే: మండలంలోని కనుమూరులోని విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే ఉయ్యూరు శ్రీ విశ్వశాంతి ఆంగ్ల మాధ్యమం పాఠశాలకు చెందిన బస్సు 40 మంది విద్యార్థులతో కనుమూరు మీదుగా మొవ్వ మండలం పెడసనగల్లు వెళ్తోంది. బస్సు స్థానిక కనుమూరు చెక్‌పోస్టు సమీపంకి రాగానే పామర్రు వైపు నుంచి ఉయ్యూరు వైపు వెళ్తున్న లారీ ఎదురుగా ఢీకొన్నాయి. దీంతో పెడసనగల్లుకి చెందిన 7వ తరగతి విద్యార్థిని సంజన, మొవ్వకి చెందిన పాఠశాల బస్సు డ్రైవర్ శ్రీనివాసరావుకి తీవ్ర గాయాలయ్యాయి. మరో నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయలయ్యాయి. ఈ సంఘటనను వి.వి.ఎస్.ప్రసాద్(కనమూరు జడ్పీ పాఠశాల పీఈటీ), తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు దగ్గుపాటి ఫణీంద్రనాథ్, జడ్పీ గణిత ఉపాధ్యాయుడు యానాదయ్యలు గుర్తించి స్పందించారు. వెంటనే 108కి సమాచారం అందించారు. బస్సులో ఇరుక్కుపోయిన విద్యార్థినిని బయటకు తీసి ఆటోలో ఉయ్యూరు ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌ని రాడ్ల సాయంతో బయటకు తీశారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో తరలించారు. లారీ డ్రైవర్ పరారవ్వగా, రెండు వాహనాల ముందుభాగాలు నుజ్జయ్యాయి.

కంచికచర్లలో వానర మూక హల్‌చల్

దాడిలో పలువురికి గాయాలు


గాయపడిన చిన్నారి

కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్లలో బుధవారం వానరాల మూక హల్‌చల్ చేసింది. పలువురిపై దాడి చేశాయి. స్థానిక వసంత కాలనీలో ఒక్కసారిగా గుంపులుగా రావడంతో స్థానికులు హడలి పోయారు. దాడి చేయడంతో ఒక చిన్నారితో సహా ఐదుగురు గాయపడ్డారు. చింపిరాల భార్గవి, మోగులూరి రామకృష్ణ, తోట కృష్ణ, పారేపల్లి వెంకటేశ్వరరావు, సాయిలు గాయపడ్డారు. వానరాల సంచారంతో కాలనీ వాసులు పరుగులు తీశారు. ఈక్రమంలో పలువురు కింద పడటంతో గాయాలయ్యాయి.


యువతిపై దాడి చేస్తున్న వానరం

తిరువూరులో కోర్టు హాల్ ప్రారంభం నేడు

విజయవాడ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: డిజిటల్ విధానం ద్వారా తిరువూరులో కోర్టు అడిషనల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు హాలును ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు, కృష్ణా జిల్లా పోర్టుపోలియో న్యాయమూర్తి జస్టిస్ రామసుబ్రమణ్యం గురువారం ప్రారంభిస్తారని విజయవాడ నగర మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా సాయంత్రం 5 గంటలకు నెట్‌లైవ్స్. ఇన్(స్లాష్)కృష్ణా డిజిటల్ కోర్టుహాల్ లింక్ ద్వారా నెట్‌లో చూడవచ్చని తెలిపారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా డిజిటల్ విధానం ద్వారా కోర్టు హాలును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.



ప్రపంచ వాణిజ్య సంస్థ అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించడానికి ఏర్పాటైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ ఆర్థిక సంస్థ. భాగస్వామ్య దేశాల మధ్య జరిగే వస్తువులు, సేవలు, మేధోసంపత్తి హక్కుల వాణిజ్యాన్ని నియంత్రించడం, వాణిజ్య సంబంధాలను సమర్థంగా నిర్వహించేందుకు అనువైన కార్యాచరణను రూపొందించడం, వివాదాలను పరిష్కరించడం దీని ప్రధాన బాధ్యతలు. తాజాగా జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) 11వ మంత్రుల స్థాయి సదస్సు ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఏ పరిష్కారం చూపకుండానే ముగిసింది.

ప్రతిభ

ఆహారానికి ఏదీ భద్రత...?

జనరల్ స్టడీస్

డబ్ల్యూటీవో మంత్రుల స్థాయి సదస్సు - 2017

ప్రపంచ వాణిజ్య సంస్థ 11 వ మంత్రులు స్థాయి సదస్సు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో డిసెంబరు 10 నుంచి 13 వరకు నాలుగురోజుల పాటు జరిగింది. ఈ సదస్సులో 164 సభ్య దేశాలు పాల్గొన్నాయి. సేవా వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఈ-కామర్స్ సేవలు, మార్కెట్ సౌలభ్యం, దేశీయ నియంత్రణలు, ఆహారభద్రత, వాణిజ్యం - మహిళా సాధికారిత తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో ఆహారధాన్యాల నిల్వ, రాయితీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించినా ఎలాంటి పరిష్కారం చూపకుండానే చర్చలు ముగిశాయి. బహుళైచ్ఛిక వాణిజ్య విధానాల విషయంలోనూ ఎలాంటి పురోగతి లేదు. అయితే మత్స్య సంపదపై రాయితీల నిషేధం విషయంలో సభ్యదేశాలకు ఉన్న నిబద్ధతపై 2019 కల్లా పరిష్కారాన్ని చూపుతామనే భరోసా ఇచ్చేందుకు మంత్రుల స్థాయి సమావేశం ప్రయత్నించింది.

✦ భారత్, చైనా సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎలాంటి కఠినతర నిబంధనలు లేకుండా తమ తమ దేశాల్లో ఆహారభద్రతా కార్యక్రమాలను అమలు చేసేందుకు అమెరికా మోకాలడ్డింది. దీంతో చర్చలు విఫలమయ్యాయి. ప్రధాన విషయాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో ప్రపంచ వాణిజ్య సంస్థలోని భాగస్వామ్య దేశాలన్నీ మూకుమ్మడిగా ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంటుంది. కాబట్టి ఏ ఒక్క దేశమైనా కావాలనుకుంటే ప్రక్రియను ముందుకు సాగనీయకుండా చేయొచ్చు.

✦ 2001 లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో అపరిష్కృత సమస్యలకు పరిష్కారాలను ప్రతిపాదించకుండానే 'కొత్త అజెండా'ను తెరమీదకు తెచ్చేందుకు యూరోపియన్ సమాఖ్య (ఈయూ) దేశాలు పావులు కదుపుతున్నాయి. ఆహారభద్రత సాధనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులపై 2001 లో దోహాలో జరిగిన చర్చలు ఎటూ తేలకుండా ముగిశాయి. నాటి నుంచి నేటి వరకు ఆహారభద్రత హక్కుల విషయమై ఇతమిద్ధంగా తేలిందేమీ లేదు. సమావేశం అనంతరం వెలువరించాల్సిన మంత్రుల ప్రకటన కూడా రద్దయ్యింది. దీంతో భారత్ సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి.

✦ సభ్య దేశాలు నిరాశకు గురవడం కొంత కటువైందైనప్పటికీ అవి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ రాబెర్టో అజ్వేడో వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సమావేశాలకు భారత్ తరపున కేంద్రమంత్రి సురేశ్ ప్రభు హాజరయ్యారు. ఒక సభ్య దేశం వైఖరి కారణంగా ఎలాంటి నిర్ణయాలు లేకుండానే సమావేశాలు ముగిశాయని భారత్ ప్రకటించింది.

భద్రతలేని ఆహార హక్కు

ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రులు స్థాయి సమావేశంలో అమెరికా వ్యతిరేకత చూపినా భారత్ మాత్రం ఆహార భద్రత హక్కు విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల పక్షాన గట్టిగానే వాదించింది. గత దశాబ్ద కాలంగా తమ దేశాల్లోని వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలను చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు ఇదే విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మాత్రం మోకాలడ్డుతున్నాయి.

✦ సంపన్న దేశాలకు అనుకూలంగా రూపొందించుకున్న డబ్ల్యూటీఓ నిబంధనలను సవరించాలని భారత్, చైనా ప్రతిఘటించినా అడుగు ముందుకు పడలేదు. ఆది నుంచి భారత్ ఈ దిశగా పట్టిన పట్టు విడవకుండా కృషి చేస్తోంది. సన్న, చిన్నకారు, అల్పాదాయవర్గ రైతుల నుంచి సరైన మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరించి, తిరిగి దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే యంత్రాంగాన్ని మెరుగుపరిచి, పటిష్టవంతం చేసే దిశగా భారత్ సుదీర్ఘ కసరత్తు చేస్తోంది.

✦ డబ్ల్యూటీఓ నిబంధనల ప్రకారం రైతుల నుంచి సేకరించే వ్యవసాయ ఉత్పత్తులకు, ఆహార రాయితీల కింద ఇచ్చే మొత్తం సొమ్ము, ఆ దేశ మొత్తం ఆహార ఉత్పత్తుల విలువలో (1986-88 నాటి ధరల ప్రకారం) 10 శాతానికి మించకూడదు. ఒకవేళ అభివృద్ధి చెందుతున్న దేశాలు రైతులకు అంతకు మించి చెల్లించినట్లయితే దాన్ని వాణిజ్య నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఇలాంటి పరిమితులు తాము అమలు చేస్తున్న 'ఆహారభద్రత' కార్యక్రమానికి విఘాతం కలిగిస్తాయంటూ భారత్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. 2013 లో బాలిలో జరిగిన సమావేశంలో కూడా దీనిపై చర్చించారు. అప్పట్లో ఈ విషయమై ఒక అంగీకారానికి వచ్చి 'శాంతి నిబంధన' ప్రతిపాదించారు. ఇది ఒకరకంగా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు రక్షణ కవచం లాంటిది. దీని ప్రకారం ఏ దేశమైనా ఈ 10 శాతానికి మించి చెల్లించరాదనే నిబంధనను ఉల్లంఘిస్తే దాన్ని డబ్ల్యూటీఓలో సవాలు/ ఫిర్యాదు చేయకూడదనేది ప్రధాన సారాంశం. ఈ శాంతి నిబంధన ఉన్నా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల సార్వభౌమ హక్కులను కాలరాసి, రైతులకు ఆహార రాయితీలు ఇవ్వకుండా, కనీస మద్దతు ధర చెల్లించకుండా సంపన్న రాజ్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. కాబట్టే భారత్ ఈ బ్యూనస్ ఎయిర్స్ సమావేశంలో 'శాంతి నిబంధన' లోని అంశాలను మరింత మెరుగుపరచి, ఆహార భద్రత సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుక్కునేలా దీన్ని తీర్చిదిద్దాలని డిమాండ్ చేసింది. తృతీయ ప్రపంచ దేశాలు సైతం ఈ విషయంలో భారత్‌లో గొంతు కలిపాయి.

✦ నిజానికి అమెరికా, యూరోపియన్ దేశాలు ఉమ్మడిగా తమ రైతులకు ఏటా 16 వేల కోట్ల డాలర్లకు పైగా భారీ రాయితీలు ఇస్తున్నాయి. స్థూలదేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం నుంచి సమకూరుతున్న వాటాలో అమెరికా తిరిగి సగభాగాన్ని రైతుల సబ్సిడీల కోసమే కేటాయిస్తోంది. అమెరికాతో పోలిస్తే భారత్ రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తున్నది అత్తెసరు మాత్రమే.

అమెరికా సేంద్రియ సాగు, పర్యావరణ పరిరక్షణ పేరు చెప్పుకుని వ్యవసాయ స్థూలదేశీయోత్పత్తి వాటాలో 40 శాతం నిధులను 'గ్రీన్ బాక్స్' పేరిట రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తోంది. అయినా ప్రపంచవాణిజ్య సంస్థ వీటిని మార్కెట్ విచ్ఛిన్నకర రాయితీలుగా పరిగణించకపోవడం దారుణం. అమెరికా లాంటి సంపన్న దేశాలు 'గ్రీన్ బాక్స్' పేరుతో డబ్ల్యూటీఓ నిబంధనలకు చిక్కకుండా తప్పించుకుంటున్నాయి.

✦ సగానికిపైగా జనాభాకు వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న, మూడోవంతు జనం అర్ధాకలితో అలమటిస్తున్న భారత్ లాంటి దేశంలోని పరిస్థితులు అమెరికాకు పూర్తి భిన్నం. రైతులకు మద్దతు ధరలు చెల్లించడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకాలపై రాయితీలు ఇవ్వక తప్పదు. ఈ తరహా చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశించిన 'మార్కెట్ విచ్ఛిన్నకర' రాయితీల పరిధిలోకి వస్తాయని ఐరోపా, అమెరికా దేశాలు గొంతు చించుకుంటున్నాయి. ఈ రకమైన సంపన్న దేశాల దాష్టీకాన్ని భారత్ మొదటి నుంచీ అనేక వేదికలపై ఎప్పటికప్పుడు ఎండగడుతూనే వస్తోంది.

✦ 2013 లో బాలిలో, 2015 లో నైరోబీ సదస్సుల్లో వర్ధమాన దేశాలను కూడగట్టుకుని, న్యాయమైన తమ హక్కులు, బడుగు బలహీన వర్గాల ఆహార భద్రత కోసం, రైతులను ఆదుకోవడానికి భారత్ తన వాదనను గట్టిగానే వినిపించింది. ఆహార భద్రత హక్కుల కోసం కృషి చేస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాలపై 10 శాతం పరిమితి నిబంధనను ఎత్తేయాలని గతంలోనే 45 దేశాలను కూడగట్టుకుని డబ్ల్యూటీఓలో వాదించింది. కానీ అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు భారత్ వాదనను తోసిపుచ్చాయి. ఈసారి మాత్రం వర్ధమాన దేశాల గళం మరింత పదునెక్కింది. చైనాతో సహా 100 కు పైగా దేశాలు మద్దతు ఇచ్చాయి. ఎలాంటి నిర్ణయం లేకుండా సమావేశాలు ముగిసినా అమెరికా తీరుపై ధిక్కార స్వరం మరింత పెరగడం ఆ దేశ వైఖరిలో మార్పు తెస్తుందేమో చూడాలి.

ప్రపంచ వాణిజ్యం - మహిళా సాధికారత

ఆహారభద్రత విషయంలో ఎటూ నిర్ణయం తీసుకోలేకపోయిన డబ్ల్యూటీఓ - 17 సమావేశం 'మహిళా సాధికారత' పట్ల మాత్రం చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రపంచంలో నాలుగింట మూడోవంతు దేశాలు సభ్యులుగా ఉన్న డబ్ల్యూటీఓ వర్తక, వాణిజ్యాల్లో మహిళల భాగస్వామ్యంపై ఎదురవుతున్న అవరోధాలను తొలగించడానికి సత్వర చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది. లింగ సమానత, మహిళా సాధికారత కోసం విశేషంగా మద్దతు ఇస్తున్న భారత్ డబ్ల్యూటీఓలో మైనార్టీ వర్గంలో ఉన్నా, బాగా ప్రభావితం చేసేదిగా ఉండి కూడా ఈ విషయంపై సానుకూలంగా వ్యవహరించలేదు. లింగ భేదం వాణిజ్య సంబంధమైన విషయం కాదని, వాణిజ్య సంబంధిత అంశాలకు - మహిళా సాధికారకతకు లంకె పెట్టడం సమంజసం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

✦ అభివృద్ధి చెందిన దేశాలు అవలంబిస్తున్న లింగపరమైన విధానాల్లో ఉన్నత ప్రమాణాలుగా పేర్కొంటున్నవి అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులకు అడ్డుకట్ట వేయడమేకాక అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ మహిళలకు ప్రోత్సాహం కల్పించడాన్ని పరోక్షంగా నియంత్రిస్తున్నాయి. అలాగే లింగసంబంధమైన అంశాలపై చర్యలు చేపట్టడానికి డబ్ల్యూటీఓ వేదికగా, ఒక సరైన వేదిక అవసరమని భారత్ అభిప్రాయపడింది. ఎందుకంటే ప్రపంచ వాణిజ్య సంస్థ అనేది కేవలం వాణిజ్య సంబంధ సంస్థ. వాణిజ్యేతర అంశాలైన కార్మికులు, పర్యావరణం- ప్రమాణాలు మొదలైనవి చర్చించడానికి డబ్ల్యూటీఓలో మరొక విభాగాన్ని ఏర్పాటు చేయడం సమంజసమని భారత్ అభిప్రాయం.

✦ ప్రపంచ వాణిజ్య సంస్థ చరిత్రలోనే తొలిసారిగా 119 సభ్య దేశాలు 'మహిళలు - వాణిజ్యం' అనే బ్యూనస్ ఎయిర్స్ డిక్లరేషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అంగీకరించాయి. మహిళల వాణిజ్య భాగస్వామ్యంలోని ప్రతిబంధకాలను తొలగించేందుకు, ఆర్థిక - వాణిజ్య రంగంలో మహిళా సాధికారతను వేగవంతం చేసేందుకు ఇది దోహదం చేస్తుంది. డిక్లరేషన్‌లో పొందుపర్చిన కార్యాచరణ మహిళలకు మరిన్ని మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని డబ్ల్యూటీఓ పేర్కొంది. లింగ సమానత ద్వారా సాధికారత సాధ్యమవుతుందని, తద్వారా ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఇవి దోహదం చేస్తాయని పేర్కొంది.

✦ వాణిజ్యంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా మహిళలకు సమానావకాశాలను కల్పించడం సాధ్యమవుతుందని, తద్వారా ప్రపంచ స్థూల దేశీయోత్పత్తికి 2025 నాటికి 28 ట్రిలియన్ డాలర్లు జతకూడతాయని ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్చనా గోంజాలెజ్ అభిప్రాయపడ్డారు.

✦ ఈ డిక్లరేషన్ మహిళల అభ్యున్నతికి ప్రతిబంధకంగా నిలుస్తున్న డబ్ల్యూటీఓ నిబంధనలను గురించి వెల్లడించడంలో విఫలమైందని, దీనికి బదులు అసమానతలు, అణిచివేతలకు దోహదం చేస్తున్న డబ్ల్యూటీఓ విధానాలకు ముసుగువేసి చూపించినట్లు ఉందని 160 దేశాలకు చెందిన మహిళా హక్కుల సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ప్రపంచంలోని అన్ని మహిళా హక్కుల సంఘాలు ఈ డిక్లరేషన్‌ను తిరస్కరించాయని, డబ్ల్యూటీఓ అనుసరిస్తున్న హానికారక విధానాల నుంచి దృష్టి మళ్లించడానికి చేపపిల్లలకు వేసిన ఎరగా దీన్ని ప్రకటించారని మహిళల న్యాయం, సంక్షేమ విభాగం, ఆసియా ఎకనామిక్ ఫోరం, గ్లోబల్ కో-ఆర్డినేటర్ కేట్ లాపిన్ అభిప్రాయపడ్డారు.

ప్రపంచ వ్యవసాయ వాణిజ్య నిబంధనలను ప్రజాస్వామికంగా సంస్కరించాలన్నదే భారత్ ప్రధాన ఆశయం. ఆకలి, దారిద్ర్యం నుంచి ప్రపంచానికి విముక్తి కల్పించాలనేది ఐక్య రాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకమైంది. ఆహారభద్రత కల్పనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులను గౌరవించాల్సిన ఆవశ్యకత సుస్పష్టం.

✦ డబ్ల్యూటీఓ సభ్య దేశాలు, మద్దతుదారులు మాత్రం వాణిజ్య, ఆర్థిక లావాదేవీల్లో మహిళల వెనుకబాటుతనాన్ని సరిదిద్ది, వారిని ప్రోత్సహించేదిగా ఉందని, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది దోహదం చేస్తుందని చెబుతున్నాయి. లింగ సమానత్వాన్ని దృష్టిలో ఉంచుకుని సభ్య దేశాలు విధానాలను రూపొందించి, మదింపు చేస్తాయని, దీని ప్రగతి నివేదిక 2019 లో విడుదల చేసే అవకాశం ఉందని ప్రపంచ వాణిజ్య సంస్థ పేర్కొనడం గమనార్హం. భారత్ మాత్రం ఈ చర్యను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది.

ఈ-కామర్స్

ఈ-కామర్స్ సేవలపై ప్రపంచవ్యాప్త నిబంధనలు ఉండకూడదని భారత్ వాదిస్తోంది. ఇలాంటి నిబంధనలకు తాము వ్యతిరేకం కాకపోయినా ఇవి తమకు ఇబ్బందికరంగా ఉంటాయని భారత్ అభిప్రాయం. ఈ-ట్రాన్స్‌మిషన్‌పై సభ్యదేశాలు కస్టమ్ డ్యూటీ విధించడాన్ని నిషేధించేందుకు ఉద్దేశించిన మారటోరియాన్ని విస్తరించడంపై అంగీకారం తెలిపేందుకు భారత్ ముందస్తు షరతులు విధించింది.

✦ 1998 లో జరిగిన రెండో మంత్రుల స్థాయీ సమావేశంలో 'గ్లోబల్ ఈ-కామర్స్ డిక్లరేషన్'లో ఈ మారటోరియాన్ని అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం సభ్య దేశాలు తమ ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించడాన్ని కొనసాగించవచ్చని నిర్ణయించారు. ఇది తాత్కాలికమే అయినా ప్రతి రెండేళ్లకోసారి జరిగే మంత్రుల స్థాయీ సమావేశంలో దీన్ని పొడిగించుకుంటూ వస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించేందుకు 'శాశ్వత మారటోరియం' విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్య అభివృద్ధి చెందుతున్న దేశాలు చూపుతున్న చొరవను ప్రభావితం చేసేదిగా ఉందని భారత్ అభిప్రాయపడింది. ఇలాంటి చర్యలు భారత్ సహా పలు దేశాల్లోని దేశీయ ఔషధ తయారీ పారిశ్రామిక రంగానికి హాని కలిగించవచ్చనేది అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన. ప్రపంచ వాణిజ్య సంస్థకు చెందిన విభాగాల్లో రూపొందించిన వర్క్ ప్రోగ్రామ్ మార్గదర్శకాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని అనుసరించి ఈ-కామర్స్‌పై చర్చలు కొనసాగించడానికి ఇతర సభ్యదేశాల అంగీకారాన్ని, మద్దతును బట్టి మారటోరియంపై భారత్ తన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని పేర్కొంది.

✦ మొత్తానికి ఈ-కామర్స్‌పై ప్రతిబంధకంగా పరిణమిస్తున్న నిబంధనలను ఎత్తివేయాలని భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే తమ దేశ సాఫ్ట్‌వేర్, అకౌంటింగ్ నిపుణులు, నర్సులకు ఇతర దేశాల్లో అవకాశాలు కల్పించాలని భారత్ కోరుతోంది.



రచయిత:
డాక్టర్ జి.వి.ఎల్. విజయ్‌కుమార్